




# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 326 • పేజీలు : 12 • ఆదివారం 18 ఆగస్టు 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada | Visakhapatnam | Srikakulam | Rajahmundry | Kurnool | Guntur | Ongole | Nellore Tirupati




## ఆర్థిక అంశాలపైనే చర్చ

ప్రధాని మోడీతో చంద్రబాబు భేటీ

పోలవరం, రాజధానికి నిధులపై ప్రస్తావన

7లో



## రాష్ట్రానికి మరిన్ని ఎయిర్ పోర్టులు తీసుకొస్తాం

- ఏపీలో 14 ఎయిర్ పోర్టుల అభివృద్ధికి చర్యలు
- ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్ హబ్‌గా తూర్పు తీరప్రాంతం
- కుప్పం, దగదర్తి, సాగర్, తునిలో కొత్త ఎయిర్‌పోర్టులు
- ఉడాన్ పథకం కింద కనెక్టివిటీ పెంచేందుకు కృషి
- దేశంలో విమానయాన రంగం అభివృద్ధికి చర్యలు
- విమానయాన అధికారులతో సిఎం చంద్రబాబు చర్చలు
- వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

7లో



# ఐక్యతతో కొత్త దిశలో పయనిద్దాం

- ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి వాతావరణం నెలకొంది
- ప్రాథమిక సమస్యలపై దృష్టి పెట్టాలి..
- అయా దేశాల మధ్య పరస్పర వాణిజ్యం, సమ్మిళిత వృద్ధి అవసరం
- ముఖ్యమైన సమస్యలపై ఏకతాటిపై నిలవాలి
- పెను ముప్పుగా ఉగ్రవాదం, తీవ్రవాదం..
- గ్లోబల్ సౌత్ సమ్మిట్‌లో వర్చువల్ కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ.ఆగస్టు 17:** ఆరోగ్య భద్రత, ఆహార భద్రత, ఇంధన భద్రత, సాంకేతిక విభజన, ఉగ్రవాదం వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి గ్లోబల్ సౌత్ దేశాలు ఏకం కావాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. శనివారం(ఆగస్ట్ 17) జరిగిన గ్లోబల్ సౌత్ సమ్మిట్‌లో వర్చువల్ కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి వాతావరణం నెలకొని ఉందన్నారు. అటువంటి మిగతా 7లో

## ఉత్తరాంధ్రలో వర్షాలు



**అమరావతి,ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక):** ఐఎండీ సూచనల ప్రకారం ఉత్తర కర్ణాటకను ఆనుకొని ఉన్న తెలంగాణ ప్రాంతంలో ఆవర్తనం విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. దీని ప్రభావంతో ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ప్రకాశం, మిగతా 7లో

## వైకాపాకు ఆళ్ల నాని రాజీనామా



**ఏలూరు,ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక):** మాజీ మంత్రి ఆళ్ల నాని వైకాపాకు రాజీనామా చేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. వ్యక్తిగత కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్ష, ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జ్ పదవులకు ఆయన రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

## పోలవరం కాలువ దస్త్రాల దహనం

### - కలకలం రేపుతున్న దుశ్చర్య



**ధవళేశ్వరం, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక):** మదనపల్లె ఘటన మరచిపోక ముందే.. పోలవరం ప్రాజెక్టు పరిపాలనా కార్యాలయం దస్త్రాలు దగ్ధమవడం కలకలం సృష్టిస్తోంది. పోలవరం ఎడమ ప్రధాన కాల్వకు సంబంధించిన దస్త్రాలు దగ్ధమయ్యాయి. కార్యాలయంలోని అధికారులే కాల్చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూసేకరణకు సంబంధించి లబ్దిదారులకు పరిహారం విషయంలో అక్రమాలు బయటకు వస్తాయనే ఈ ఘటనకు పాల్పడి ఉంటారని అనుమానాలు మిగతా 7లో



## డాక్టర్లు ఆందోళన విరమించాలని కేంద్రం విజ్ఞప్తి

- వైద్యులు వెంటనే సమ్మె విరమించాలి
- వైద్యుల భద్రతకు కమిటీ వేస్తామన్న కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 17: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచారానికి నిరసనగా దేశ వ్యాప్త నిరసన చేపడుతున్న వైద్యులు తక్షణమే సమ్మె నిలిపివేయాలని కేంద్రం సూచించింది. వారి భద్రతకు తీసుకోవాల్సిన మిగతాది 7 లో

## ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు

- నిషేధం ఎత్తివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- మొత్తం 15 శాఖల్లో బదిలీలు చేపట్టాలని నిర్ణయం
- ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన వారికి బదిలీ తప్పనిసరి
- ఈ నెల 31లోగా బదిలీల ప్రక్రియ పూర్తి

7లో

## గాజాపై భీకర దాడులు

వైమానిక దాడిలో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి..

7లో





## సిఎం పదవికి రాజీనామా చేయాలి

డాక్టర్ హత్యాచార కేసులో మమతా బెనర్జీ విఫలం

నిర్భయ తల్లి ఆశాదేవి డిమాండ్

7లో

## పోలవరాన్ని గోదావరిలో ముంచేశారు

- నిధులను పక్కదారి పట్టించారు
- మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం



7లో

## రాజీనామా చేసేంత తప్పేం చేసా?

గవర్నర్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం

మీడియాతో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య



7లో

## సంక్షేమ కార్యక్రమాల కోసం వెంకయ్యనాయుడు జీవితం అంకితం

- సమరయోధుల కలలు సాకారమవుతున్నాయి
- స్వర్ణభారతి ట్రస్ట్ వార్షికోత్సవంలో ఉపరాష్ట్రపతి
- వెంకయ్య సేవలను కొనియాడిన ధన్‌ఖడ్

12లో






ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు

# నాదం -యోగం

మానవాళికి మానసిక, శారీరక సౌభాగ్యాన్ని ప్రసాదించే శక్తిమంతమైన యోగ మార్గం నాదోపాసన,యోగాభ్యాసం. అవి సామాజిక సామరస్యానికి కూడా గొప్ప ఉపకరణగా నిలుస్తాయి.అవి రెండూ వేరు కాదు, ఒక్కటే.ఎన్నో ఉద్వేగాలు, విద్వేషాల విష ప్రభావాలను మనం చూస్తూనే ఉన్నాం. సంయమనం కోల్పోయి, మానవత్వాన్ని వీడి, దానవ ప్రవృత్తితో జరుగుతున్న దమనకాండలు లోకాన్ని కుదిపేస్తున్నాయి. ఆస్తులు ధ్వంసమవుతున్నాయి. కట్టెదుటే పేగుబంధాలు తెగిపోతున్నాయి. రకరకాల ప్రభావాలు,ప్రవృత్తితో సాటిమనిషిని తోటిమనిషే చంపుకుంటున్నాడు. రణరంగం కాని చోటు భూమిపై ఎక్కడా కనిపించడం లేదు. ఈ దానవక్రీడలో కొందరిది స్వార్థం, కొందరిది ఆవేశం, కొందరిది అహంకారం, కొందరిది అవసరం, కొందరిది అజ్ఞానం. రోజురోజుకూ వేడెక్కిపోతున్న మానవ మనఃతాపాన్ని తగ్గించడంలో సంగీతం, యోగ ఎంతగానో ఉప'యోగ'పడతాయి. అందుకే ప్రపంచం యోగా దినోత్సవం, సంగీత ఉత్సవం కూడా జరుపుకుంటోంది. ఐక్యరాజ్యసమితి మన ప్రధాని నరేంద్రమోదీ చేసిన సూచనలను ఎంతో గౌరవంగా స్వీకరించింది కూడా. మన భరతభూమి వేదభూమి,యోగభూమి. యోగసాధన ఒకప్పుడు మన విద్యావిధానంలో ప్రధానమైన భాగంగా ఉండేది. విద్యాధికులే కాక, సామాన్యులు కూడా వివిధ మార్గాల్లో యోగసాధన చేసేవారు,భక్తి మార్గంలో నడిచేవారు. యోగాసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం,ధ్యానం నిత్య సాధనగా ఉండేవి. మేలుకున్నప్పటి నుంచి నిద్రించే వరకూ 'పాట' మన జీవనంలో భాగంగా ఉండేది. మేలుకొలుపు పాటలు,జోలపాటలు, జానపదాలు,భజనలు,కోలన్నలు, యక్షగానాలు,వీధిభాగోతాలు, చిందులు,తప్పెట్లు,తాళాలు పల్లెల్లో ఒకప్పుడు మార్మోగేవి. "తల్లడిల్లే వేళ – తల్లిపాడే జోల– పాల కన్నా తీపి పాపాయికి.." అని మన వేటూరి అన్నట్లు, మేలుకుంటే పాట,ఏలుకుంటే పాట అన్నట్లుగా ఉండేది. యోగ – సంగీతం సహజ సజలపాతాలుగా మన జీవనంలో ప్రవేశించి ప్రవహించి ప్రయాణించాయి. పుస్తకాన్ని మంచి స్నేహితుడితో ఎలా పోల్చేవారో,సంగీతం కూడా మనకు మంచి స్నేహితురాలు. మన భావోద్వేగాలన్నింటిలో దానికి భాగస్వామ్యం ఉంటుంది. సంగీతం మనల్ని సేద తీరుస్తుంది, బాధలను మరిపింపజేస్తుంది. మనసు పడే ఒత్తిళ్లను తగ్గించి కర్తవ్యోముఖులను చేస్తుంది, అద్భుతమైన ఆరోగ్యాన్నిస్తుంది. సంగీతం ద్వారా వ్యాధులు నయమవుతాయని చెబుతారు. మంగళంపల్లి బాలమురళీకృష్ణ గానం విని,కోమాలో ఉన్న ఎంజిఆర్ పైకి లేచి,ఆరోగ్యంతో జీవించారని మంగళంపల్లి స్వయంగా చెప్పగా మనం అనేకసార్లు విన్నాం. సంగీతం ద్వారా రాళు కరిగాయని, వర్షం కురిసిందని చదువుకున్నాం. రాళ్లంటే కేవలం రాళ్లు కాదు, రాళ్ల వంటి మనసులు కరిగి మనిషిగా మారడంగానూ అన్వయించుకోవచ్చు. యోగ సాధన ద్వారా అచంచలమైన ఏకాగ్రత,తద్వారా అమోఘమైన జ్ఞాపకశక్తి,అమూల్యమైన జ్ఞానం కలుగుతాయని పూర్వపురుషుల జీవితాలు చెబుతూనే ఉన్నాయి. వేదజ్ఞానం అలా సంపాయించుకున్నదే. సకల విద్యాసముపార్జన అలా జరిగిందే. 'అవధానవిద్య' అక్కడ నుంచి పుట్టిందే. గురువు విద్యను బోధిస్తూ ఉంటే ఏకాగ్రతగా వినడం,విన్న దానిని మనసులో ధరించుకోవడం, ధరించుకున్న దానిని వల్లె వేసుకోవడం,మళ్ళీ తిరిగి అప్పజెప్పడం... అదే! ఒకప్పటి మన విద్యాభ్యాసం. రాసుకోవడం,చూసుకోవడం, చదువుకోవడం అనే ప్రసక్తే లేదు. మనసులోనే అన్నింటినీ నిక్షిప్తం చేసుకోవడమే అప్పటి మార్గం. అదే మానసిక యోగ సాధనం. అటువంటి అభ్యాసం వల్ల మనిషి మెదడు చాలా చురుకుగా ఉండేది,పాదరసంలా పనిచేసేది. ముందుయుగం దూతలు, పావన నవజీవన బృందావన నిర్మాతలైన యువకులు పుట్టుకొచ్చేవారు. మరిప్పుడో! "కొంతమంది కుర్రవాళ్లు పుట్టుకతో వృద్ధులు" అన్న శ్రీశ్రీ కవితా పంక్తులు గుర్తుకు తెస్తున్నారు. జీవనశైలిని మార్చుకోండి –ఆరోగ్యం బాగుపడుతుందని వైద్యులు నేడు ఘోషిస్తున్నారు. నేటికాలంలో వచ్చే చాలా వ్యాధులకు అనారోగ్యమైన జీవనవిధానమే ముఖ్య కారణమని మనం తరచూ వింటున్నాం. మన జీవనంలో యోగ,సంగీతాలను తప్పనిసరి భాగస్వామ్యులుగా చేర్చుకుంటే జీవితసర్వస్వం ఆరోగ్యంగా మారిపోతుందని గుర్తెరిగితే సరిపోతుంది. మంచి ఆలోచనలు కలిగినప్పుడు మంచి రసాయనాలు, ఎంజైమ్స్ ఊరుతాయని మానసిక శాస్త్రవేత్తలు, వైద్యశాస్త్రవేత్తలు చెబుతూనే ఉన్నారు. సంగీతానికి భాష లేదు, అది విశ్వజనీనం. నాదయోగమే సంగీతం. మానసిక,భౌతిక సాధనే యోగాభ్యాసం. సంగీతాన్ని దైవభాషగా చెబుతారు. సంగీతంతో భాషిస్తే దైవం మనిషికి దగ్గరావుతారని అంటారు. అందుకే మన వాగ్గేయకారులంతా సంగీత,సాహిత్యాలను సంయోగం చేశారు. సమలంకృతంగా,సమభూషితంగా వాక్కు,సంగీతాలను సమన్వయం చేసుకున్నారు. 'ఓం'కార సాధన యోగాభ్యాసంలో భాగమే. సంగీతాన్ని అభ్యసించేవారు కూడా తమ సాధనను 'ఓంకారం'తో శ్రీకారం చుడతారు. ఆరోగ్యకర జీవన విధానానికి ఉఛ్వాస,నిశ్వాసల వంటి సంగీతం – యోగ సాధనల అభ్యాసాన్ని పెంచుకుంటూ వెళ్ళడమే పరమపథ సోపానం. ఈ రెండు విద్యలకు సంబంధించిన శిక్షణా కేంద్రాలను పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. గురువుల కొరత చాలా ఉంది. ఈ మార్గాలను ప్రధాన వృత్తులుగా ఎంచుకునేవారి సంఖ్య పెరగాలి. రాశి,వాసి పెరగాలంటే ప్రోత్సాహం పెరగాలి.ఉద్యోగ,ఉపాధి అవకాశాలు పెరగాలి. ఈ వృత్తిలో స్వయంసమృద్ధిగా జీవించే ఆర్థికపటుత్వం పెరగాలి. ప్రభుత్వాలతో పాటు కార్పొరేట్ సంస్థలు,సంపన్నులు ఈ బాధ్యతను తలకెత్తుకోవాలి. భారత ప్రభుత్వం తాజాగా చేపట్టిన 'నవీన విద్యావిధానం'లో యోగ,సంగీత విద్యలకు సముచిత స్థానం దక్కుతుందని ఆశిద్దాం.

# మొగల్ విస్తరణను అడ్డుకున్న వీరుడు పాపన్న

ఛత్రపతి శివాజీ సమకాలికుడు, మొగలాయి పాలకులను ఎదిరించిన ధీరుడు, సమర్థ నాయకుడు, పాలకుడు, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక, బహుజన హృదయ విజేత సర్దార్ సర్వాయి పాపన్న. శివాజీ, ముస్లింల పాలనా అంతానికి మహారాష్ట్రలో ఎలాగైతే పోరాడాడో, పాపన్న కూడా తెలంగాణలో ముస్లింల పాలనా అంతానికి పోరాడాడు. శివాజీకి పాపన్న ఏ మాత్రం తక్కువ కాదు. దక్షిణ భారత దేశంలో మొగల్ సామ్రాజ్య విస్తరణను అడ్డుకున్న తొలి యోధుడు పాపన్నే. యావత్ భారత దేశాన్ని, దాదాపు ఆనాటి భారత రాజులు అందరినీ ఓడించిన ఔరంగ జేబు మాత్రం పాపన్న ముందు తల దించుకున్నాడు. మళ్లీ అదే మొగల్ చక్రవర్తి తర్వాత వచ్చిన బహదూర్ షా తో సన్మానం చేయించుకున్న పోరాట యోధుడు సర్దార్ పాపన్న. అత్యంత క్రూరులు, భయంకరమైన మొగల్ సుల్తాన్లనే కాదు, గోల్కొండ సేనాధిపతులను, గవర్నర్ లనే ఎదిరించి నిలబడి, వారి దౌర్జన్యాలను, అక్రమాలను ప్రశ్నించాడు. బహుజనుల ఐక్యతతో రాజ్యాధి కారం సంపాదించ వచ్చునని నిరూపించాడు. పూలే కంటే ముందే సామాజిక న్యాయాన్ని ప్రపంచానికి అందించాడు. బలహీన కుటుంబంలో వర్గ పుట్టి 17 వ శతాబ్ది లోనే తెలంగాణ గడ్డపై పోరుబాట పట్టి, రాచరిక పునాదులను కదిలించిన ధీరోధాత్తుడు సర్వాయి పాపన్న. పాపన్న సామాన్య గీత కార్మికుడు. తన మిత్రుడి మీద కాలు లేపిన నిజాం సైనికుడిని తన వద్ద ఉన్న గీత కత్తితో తల నరికిన ధీరుడు పాపన్న. తర్వాత తన మీద దాడికి వచ్చిన 10 మంది సైనికుల్ని మట్టుపెట్టి వాళ్ళ గుర్రాలను తీసుకొని కొంతమంది మిత్రులతో, దౌర్జన్యం చేస్తున్న నిజాం సైనికులని నరకటం మొదలు పెట్టాడు. అలా 1687–1724 వరకు అప్పటి మొగల్ చక్రవర్తి ఔరంగజేబు సైన్యానికి వ్యతిరేకంగా పోరాడాడు. పాపన్న ఒక్కో ప్రాంతాన్ని ఆక్రమించి విజయ దుర్గాలు నిర్మించాడు. 1678 వరకు తాటి కొండ, వేములకొండలను తన ఆధీనంలోకి తెచ్చుకొని దుర్గాలను నిర్మించాడు. ధూల్మిట్ట శాసనం ప్రకారం ఆగస్టు 18, 1650 నాడు పాపయ్య, గౌడ్ కులంలో సర్వాయి పాపన్న నేటి వరంగల్ జిల్లా, జనగాం మండలం ఖిలాషాపూర్ గ్రామంలో జన్మించాడు. తండ్రి ధర్మన్నగౌడ్ ను చుట్టు పక్కల వారు గౌరవంతో ధర్మన్న దొర అనేవారు. తండ్రి చిన్నతనం లోనే చనిపోగా, తల్లి సర్వమ్మ కోరిక అతన్ని మేరకు గౌడ వృత్తిని స్వీకరించాడు. స్నేహితులైన చాకలి సర్వన్న, మంగలి మాసన్న,



కుమ్మరి గోవిందు, జక్కుల పెరుమాండ్లు, దూదేకుల పీర్ మహ్మద్, కొత్వాల్ మీర్ సాహెబ్ తో గెరిల్లా సైన్యాన్ని తయారు చేశాడు. అగ్రకుల భూస్వాములు, వ్యాపారుల గడీలపై, కోటల పై దాడి చేశాడు. సంపదను బహుజన పేదలకు పంచాడు. గడీల్లో బందీలుగా మగ్గుతున్న అణగారిన కులాల ప్రజలను విడిపించాడు. బాల్యంలో పశువులను కాస్తూ ఆనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు గమనించాడు. తల్లి సర్వమ్మ పెంపకంలో గారాబంగా పెరిగాడు. పాపన్న వంశం శైవ మతస్థులు కాగా, యుక్త వయసు వచ్చే నాటికి క్రమ క్రమంగా వ్యతిరేకించాడు. గోల్కొండ కుతుబ్ షాహి రాజవంశం నియంత్రణ లోకి రాగా, తురుష్క సైనికులు వివిధ పన్నులు, శిస్తులను ప్రజలను హింసలకు, ఇబ్బందులకు గురిచేస్తూ, కులాల, మతాల పేర్లతో పీడించి వసూలు చేసేవారు. అలాగే గౌడ కులం వారికి తాటి చెట్లకు పన్ను వేశారు. తురుష్క సైనికులు శిస్తులు వసూలు చేసుకొని వెళ్లేదారిలో, పాపన్న కల్లు అమ్ముకొనే మండువాలో, కల్లు తాగి డబ్బులు ఇవ్వకపోగా, పాపన్న స్నేహితుడు ఒకరు ధనరాసులు ఉన్నా, కల్లు తాగి డబ్బులు ఇవ్వలేని నిరుపేద తురుష్క సైనికులు వెళ్లిపోవుటకు సిద్ధం అయ్యారా అని సరసంగా అన్నాడు. తురుష్క సైనికుల్లో ఒకడు కోపంతో పాపన్న స్నేహితున్ని తన్నుటకు కాలు ఎత్తాడు. అది చూసిన ఆ క్షణంలో కోపోద్రిక్తుడైన పాపన్న తన వద్ద కల్లు గీయడానికి ఉపయోగించే గీత కత్తి, మారు కత్తిలో ప్రాణ స్నేహితున్ని తన్నుటకు కాలు ఎత్తిన సైనికున్ని మెడ నరికాడు, మిగతా సైనికులు తన మీదికి రాగా, బలవంతుడైన పాపన్న వారిని కూడా హత మార్చాడు. మెల్లగా తురుష్క రాజ్యంలో విప్లవకారుడు అయ్యాడు. పాపన్న, అతని స్నేహితులతో కలసి తిరుగు బాట్లు ప్రారంభించాడు. అలా మొదలైన తిరుగు బాటుతో ఆయుధాలు, గుర్రాలు, డబ్బులు కూడా సమకూర్చు కున్నాడు. యుద్ధ విద్యలు నేర్చు కున్నాడు. పేదవారికి డబ్బులు సహాయం చేయడంతో పాపన్న పేరు జనగాం ఏరియాలో మారు మ్రోగింది. యువకులు పెద్ద సంఖ్యలో పాపన్న వద్ద సైనికులుగా చేరారు. వారికి యుద్ధ విద్యలు నేర్పించి, అతి తొందరలోనే 3 వేల మందిని సొంతంగా సైనికులగా సమకూ ర్చుకున్నాడు. బహదూర్ షా గోల్కొండ కోట ముట్టడి చేయడానికి అనేక వేల మంది బలగాలను పంపగా, మార్చి 1710 వరకు కొనసాగిన సుదీర్ఘమైన యుద్ధం జరుగుచున్న రోజుల్లోనే ఓ రాత్రి పాపన్న బావమరిది చేత పట్టుబడ్డాడు. కొద్ది రోజుల తరువాత హతమార్చ బడ్డాడు. తలను నరికి బహదూర్ షాకు బహుమానంగా పంపారు. మొండాన్ని గోల్కొండ కోట గుమ్మానికి వేలాడ దీశారు. పాపన్న రాజ్యంలో పన్నులు లేవు. ఆయన అనేక ప్రజామోద యోగ్య పనులు చేశాడు. ఆయన రాజ్యంలో సామాజిక న్యాయం పాటించేవాడు. తాటికొండలో చెక్ డాం నిర్మించాడు. ఎల్లమ్మకు పరమ భక్తుడై, హుజురాబాద్ లో ఎల్లమ్మగుడి కట్టిం చాడు. పాపన్న గొప్పతనాన్ని తెలుసు కున్న బ్రిటిష్ వారు లండన్ మ్యూజియంలో ఆయన ఫోటోను పెట్టుకున్నారు.ఆదిలాబాదు జిల్లా, నిర్మల్లో 2012 జూలై 30 నాడు సర్వాయి పాపన్న విగ్రహం ప్రతిష్ఠించ బడింది. 2012 ఆగస్టు 18 నాడు కరీంనగర్ జిల్లా సర్వాయిపేట గ్రామంలో సర్వాయి పాపన్న విగ్రహం నాటి కరీంనగర్ లోకసభ సభ్యుడు పొన్నం ప్రభాకర్ చే ఆవిష్కరించ బడింది. ఇటీవలి కాలంలో పాపన్న గొప్పతనానికి క్రమంగా గుర్తింపు వస్తోంది. తెలంగాణ ప్రాంతంలో పరాయి పాలకుల దాష్టీకానికి వ్యతిరేకంగా, అన్యాయానికి ధిక్కారంగా, ఆత్మగౌరవ నినాదంతో అధికారం చేపట్టిన తెరాస ప్రభుత్వ హయాంలో సర్దార్ పాపన్నకు సముచిత స్థానం, గౌరవం కల్పించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

–రామ కిష్టయ్య సంగన భట్ల

# ఆంగ్లాంధ్ర కవితారీతుల్లో సవ్యసాచి గోదావరి శర్మ

ఇటు తెలుగు భాషలో, అటు ఆంగ్ల భాషలో ఒకే రీతిలో కవిత్వం రాసే సవ్యసాచి డా.కె.గోదావరి శర్మ నవీన కవులలో తొలి పంక్తిలో ఉంటారు.ఆయన వర్ధమానుడు.పరిపూర్ణంగా వికసించక ముందే అభ్యుదయ కవి అలిశెట్టి ప్రభాకర్‌లా రాలిపోయాడు. సంపూర్ణ ఆయుష్మంతుడైతే ఏమేమి సాధించేవాడో మనం అస్పష్టంగా ఊహించుకోగలం. ప్రగతిశీల కవిగా ప్రవర్ధమానమవుతూ కేవలం 35 ఏళ్ల వయసులోనే ఈ సుందర, సువిశాల సాహిత్య ప్రపంచం నుంచి నిష్క్రమించాడు. 'అంతర్వాహిని' కవితా సంపుటి ముందు మాటలో ఇస్మాయిల్ 'రెండు కన్నీటి చుక్కలు' శీర్షికన కవిత్వానికి లయ ప్రాణమని శర్మకు బాగా తెలుసు. లయని ఊదకపోతే కవిత్వం చచ్చి వచనమైపోతుందని అతడు గ్రహించాడు.అక్షరమైత్రి లేనిది తెలుగు తెలుగు కాదని అతనికి బాగా తెలుసునని కితాబిచ్చాడు.ఇక శర్మ కవితా వైవిధ్యాన్ని పరిశీలిస్తే..'నున్నగా గుండ్రంగా బంతిలా ఉండే/కవిత్వాన్ని ఏ మూల మొదలు పెట్టాలో భూ ప్రదక్షిణం చేసినా తెలియదు.'గుట్టు చెప్పకుండా బెట్టుగా మూతి బిగించుకొని, పసుపు మచ్చులు చీర, ఆకుపచ్చ జాకెట్టుతో ఆకర్షిస్తుంది ఆధునిక కవిత' అని వర్ణిస్తాడు.పందొమ్మిదో శతాబ్దంలో రొమాంటిక్ కవులు తెచ్చిన సమగ్ర విప్లవ ఫలితం జీవితాన్ని, ఆలోచనలను రెండింటిని కలిపి వత్తిచుట్టి చేతన జ్వాలలను రగిలించాడు. ఎలాంటి ఇజాలకు అంతగా ప్రభావితుడు కాలేదు. తన అంతరంగంలోని ఆలోచనలకు మాత్రమే పెద్ద పీట వేసి అక్షరరూపమిచ్చిన కవితా ప్రవీణుడు. శ్రీకాకుళం జిల్లా చాపర గ్రామంలో 1954 ఆగస్టు 18న లలితాంబ, సూర్యనారాయణ దంపతులకు జన్మించిన శర్మ 'గోదావరి గలగలలు'పుస్తకంతో కవిగా సుపరిచితులయ్యారు."ఆన్ ది బ్యాంక్స్ ఆఫ్ ది నాగావళి' ఆంగ్ల కవితా సంపుటి కూడా ఈయన కలం నుంచి జాలువారిందే.మరో కవితా సంపుటి 'అంతర్వాహిని కవితా సంపుటి తెలుగు నాట పెను ప్రభంజనమే సృష్టించింది. ఈ గొప్ప రచన ఆయన మరణానంతరం విడుదలైంది.ఈ కవితా సంపుటికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం లభించింది.అర్థంతరంగా ఆయన జీవితం ముగిసిపోవడంతో ఈయన మూడు పుస్తకాలు మాత్రమే వెలువరించారు.ఇవన్నీ ఆణిముత్యాలే.కాకినాడ పి.జి.సెంటర్ (ఎ.యు అనుబంధం)లో ఆంగ్లోపన్యాసకునిగా పనిచేసిన శర్మ విసుగు విరామం లేకుండా కవితా స్రవంతిలోనే ఓలలాడారు. కాకినాడలో గోదావరి శర్మ ఇల్లు సాహితీ ప్రియులతో, సాహిత్యాభిమానులతో ఓ దర్బారులా కళకళలాడుతుండేది. అద్దేపల్లి రామ్మోహనరావు, ఇస్మాయిల్,డా.కె.శివారెడ్డి, సిరివెన్నెల సీతారామశాస్త్రి, ఆకెళ్ళ వంటి ఎందరో సాహితీ ఉద్దండులు ఎంతో అత్యుత్సాహంగా పాల్గొనేవారు.దేవులపల్లి కృష్ణశాస్త్రితో గోదావరిశర్మకు మంచి పరిచయం ఉండేది.ఓ సందర్భంలో కృష్ణశాస్త్రిని కలిసినప్పుడు"మీ కవితల్లో మీ సొంత గొంతు బాగా పలుకుతోందని ప్రశంసించారు."మీరు గోదావరి, నేను కృష్ణ" అంటూ రసరమ్యంగా దేవులపల్లి వర్ణించారు."అంతర్వాహిని'




కవితా సంపుటిలో ఆయన రాసిన ప్రతి పదం కూడా డమరుక ధ్వనిని తలపిస్తాయి.ఇందులోని 'దేశభక్తి' కవితలో 'దేశభక్తి నిండిన గుండెలలో...జండా వందనాలు చేస్తూ పాడినా... ఎవడిక్కావాలి బ్రదర్ ఓ పక్క నా దేశంలో... బాల్యం వీధుల్లో తిరిగి ముష్టెత్తుకుంటే ఉంటే' అంటూ నేటి భారతంలో బాలల దైన్యస్థితిని పదునైన మాటల మంటలతో ఆవిష్కరించాడు.'అర చేతికి ఆరోవేలు కవితలో 'ఏమో ఎవరికి తెలుసు.. ఎపుడొస్తుందో...దీని అవసరం మనిషికి సిక్స్త్ సెన్స్ లాగా... కుంతికి కర్ణుడి లాగా.ఇందులో ఆయన ప్రయోగించిన ఉపమానం కవితకే ఓ ఆభరణం.'తాబేటి తత్వం' కవితలో 'గూట్లో గువ్వలా వెచ్చగా.. కదలకుండా కూచోవాలని ఉంటుంది. ఎగిరే పిట్టలా.. స్వేచ్ఛగా బయట తిరగాలని ఉంటుంది.. ఒకేసారి రెండూ ఎలా సాధ్యం... కనీసం తాబేలు నైనా కాను' అంటాడు కవి.జీవితంలోని ఇరు పార్శ్వాలను చిత్రీకరించిన తీరు మనసును దోచుకుంటుంది.'పడమటి కాపీరాగం' కవితలో 'గణపతి మొండేనికి.. గజముఖం అమర్చారంటే..అది కట్టుకథ: నాన్సెన్స్ నమ్మం: ఏనుగు దుప్పట్లో కొచ్చి..కథలూ కబుర్లూ చెప్పాయంటే..అది ఆధునిక ఊహ..ఆహ్వానిస్తాం'అంటాడు.ఇందులో రచయిత కవితా వైచిత్రి, వర్తమాన చిత్రం,భావనా పటిమ ప్రతిబింబిస్తోంది.'నగరం' కవితలో 'కుడి చేత్తో అడవుల్లో వృక్షాలను పడగొట్టి...ఎడమ చేత్తో పార్కుల్లో మొక్కలు పెంచుతూ.. ప్రకృతిని పరిహసిస్తున్నావు..ఓ నగరమా,వీళ్లు నీ పిల్లలు.. ఖరీదైన హోటళ్లలో కేబరే వేదికల మీద..బార్లలో తాగి,తూగి,వాగే మత్తులో మధ్యతరగతి హిపోక్రసీ నీడల్లో .. వైతరణిని మరిపించే మురికి వాడల్లో.. ఆకలితో, అజ్ఞానంతో.. నిన్ను నీవు చంపుకు తింటున్నావు.. అంటూ నగరిశైలిపై విరుచుకుపడ్డాడు శర్మ."దృక్కోణం"కవితలో హోరు గాలి వీస్తుంటే.. ఈ భూమి...ఎవరో ఎగరేసిన గాలి పటం..ఫెళ ఫెళ పిడుగులు పడుతుంటే..ఈ ప్రపంచం..ఎవరో పగలేసిన మృత్యు మృదంగం...అంతా అయిపోయాక...ఈ జీవితం..ఎవర్నో తగలేసిన నిశా స్మశానం"అని తన భావనలకు అక్షర రూపమిచ్చిన తీరు పాఠకుల మనసులను దోచుకుంటుంది. 'గోదావరి గలగలలు' కావ్యంలో 'వెన్నెల్లో గోదావరి హిందోళపు విందు.. ఉరుకులతో పరుగులతో ఉద్ధృతంగా కదిలి.. విలయతాండవం చేసే విశ్వరూపిణి... వరదల్లో గోదావరి వికటానంద భైరవి' అంటూ రాసిన ఈ కవితాఝరి పాఠకులను ఆకట్టుకుంటుంది.'ఆన్ ది బ్యాంక్స్ ఆఫ్ ది నాగావళి' ఆంగ్ల కవితా సంపుటి ఆయన కలం నుంచి జాలువారిందే.ఆయన శ్రీకాకు ళం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బి.ఎ చదువుతున్నప్పుడు తరచుగా ఒడ్డునే ఉన్న నాగావళి నదీ తీరంలో వ్యాహ్యాళికి వెళ్ళేవారు.అక్కడి శివాలయం వెనుకనగల నంది ఘాట్ పై గల చింతచెట్టు కింద తోటి స్నేహితులతో కలిసి ఆడుకునే అందమైన అనుభ వాలతో "ఆన్ ది బ్యాంకు ఆఫ్ ది నాగావళి" అనే కవితా సంపుటిని వెలువరించారు.ఇదే సంపుటిలో మార్నింగ్ సాంగ్, వాకింగ్ ఇన్ ది రెయిన్, వెల్కమ్ సాంగ్,కేచ్ ది సన్ వంటి 74 సానెట్సును రాశారు. ఇక అన్నింటికి మించి శర్మ రాసిన పిహెచ్.డి కోసం సమర్పించిన సిద్ధాంత గ్రంథం 'ట్రెండ్స్ ఇన్ పోస్ట్ ఇండిపెండెన్స్ ఇండో–ఆంగ్లియన్ పోయిట్రీ' ఎంతో ప్రామాణికమైందని ఆంగ్ల భాషా సాహితీవేత్తలు పేర్కొంటారు.ఈ సిద్ధాంత గ్రంథాన్ని విశాఖపట్నం ఎ.యు ఆంగ్ల విభాగాధిపతి ఆచార్య ఎల్.ఎస్.ఆర్. కృష్ణశాస్త్రి పర్యవేక్షణలో చేశారు. వీణాధరి,ఈ అబ్బాయికి పెళ్లవుతుందా?, సరికొత్త సరిగమ–వరుసగా ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆంధ్రపత్రిక వారపత్రిక, స్వాతి మాసపత్రికలలో అచ్చయిన వీరి నవలలు.విశాఖపట్నంలో ఉన్నప్పుడు విశాఖసాహితి సంస్థతో ఏర్పడిన అనుబంధం అతని జీవితం కొనసాగింది.విశాఖ సాహితి సంస్థతో పాటు వి.ఎస్.కృష్ణాగ్రంథాలయం(ఎయు),సాగరతీరం ఆయనను ఎంతగానో ప్రభావితం చేసాయి.అన్నింటికి మించి ఆయన సతీమణి శ్యామల కూడా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆంగ్లంలో పిహె.డి చేసి రాజాం జి.ఎం.ఆర్.ఐ.టిలో ఆంగ్ల విభాగంలో లెక్చరర్ గా, అసోసియేట్ ప్రొఫెసర్ గా 18 ఏళ్లపాటు పనిచేశారు.ఈ ఇద్దరు దంపతులు తెలుగు భాషా ప్రేమికులే కావడం గొప్ప విశేషం.గోదావరి శర్మ తాను రాసిన ప్రతి కవితను భార్యకు చూపించి ఆమె సలహాలకు తగు ప్రాధాన్యతనిచ్చేవారు. ఇద్దరూ ఆదర్శ దంపతులు. నవయువ కవులకు క్రాంతదర్శి అయిన గోదావరి శర్మ ఈ విశాల ప్రపంచం నుంచి 1990 ఫిబ్రవరి 8న నిష్క్రమించాడు. రాజమండ్రి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తుది శ్వాసను విడిచారు."నవరసాలు నాకవసరమేనని" విశ్వసించిన శర్మ సాహితీ వాహిని నిత్యం నిండుగా, వయ్యారంగా ప్రవహిస్తునే ఉంటుంది.తెలుగు కవిత్వం బతికి ఉన్నంతకాలం ఆయన సాహితీ ప్రేమికుల హృదయాల్లో శాశ్వతంగా నిలుస్తారు.

–వాండ్రంగి కొండలరావు

# స్త్రీల వైద్యానికి కేసరి పెట్టిందిపేరు

గుంటూరు జిల్లా ఒంగోలు తాలూకా ఐన మనమెళ్ళూరు గ్రామంలో ఒక పేద బ్రాహ్మణ కుటుంబంలో పుట్టారు కేసరి గారు. పుట్టిన కొద్ది మాసాలకే తండ్రి మరణించారు. కష్టపడి పెంచి పెద్ద చేసింది తల్లి. డబ్బు లేక, ఉన్న ఊళ్ళో జీవిక సాగలేదు. వీధి బడి దాటి చదువూ సాగలేదు. ఆ పరిస్థితుల్లో స్వగ్రామంలో ఉండలేక కేసరిగారు తల్లితో కూడా చెప్పకుండా ఇల్లు, ఊరు వదిలిపెట్టి కాలి నడకన చెన్నపట్నం చేరుకున్నారు. చెన్నపట్నం ఒకప్పుడు దక్షిణ భారత దేశాని కంతటికీ ఉమ్మడి రాజధాని. పెద్ద వ్యాపార కేంద్రం. విద్యాకేంద్రం సాంస్కృతిక కేంద్రం. అన్ని ప్రాంతాల నుంచీ బతికి చెడినవారు చెన్నపట్నం చేరి ఉపాధి సంపాదించుకుని కష్టపడి పని చేసి బతుకులో నిలదొక్కుకుని వృద్ధిలోకి వచ్చి, తన వెంట తన వారిని పదిమందిని తీసుకు వచ్చి వృద్ధిలోకి తీసుకురావటం ఆ రోజుల్లో సర్వసామాన్యమైన విషయం. చిన్న వయసులో చెన్నపట్నం చేరిన కేసరికి అంత తొందరగా మంచి రోజులు రాలేదు. రెండు పూటలా కడుపు నిండే ఉపాయమే దొరకలేదు. వారాలు చేసుకుని కొన్నాళ్ళు గడిపారు. పల్లెలో తాను నేర్చిన చదువుతో ఇద్దరు పిల్లలకు పాఠాలు చెప్తూ, వాళ్ళు ఇచ్చిన డబ్బుతో తాను చదువుకుంటూ కాలం గడిపారు. ధర్మ సత్రంలో పెట్టే ఒక పూట అన్నంతో అర్ధాకలితో గడిపారు. రాత్రి వేళ ఆకలి వేస్తే దమ్మిడీ పెట్టి మొక్క జొన్న పేలాలు కొనుక్కుని తిని నీళ్ళు తాగి పడుకునేవారు. చెన్నపట్నంలో కొత్వాల్ చావడి వద్ద రావిచెట్టు అగ్రహారంలో రావిచెట్టు కింద ఆయన జీవనం. రామానుజాచారి గారి బడిలో చదువుకున్న గజేంద్రమోక్షం, రుక్మిణీ కల్యాణం బతుకు తెరువుకు పనికిరావని ఆ బడి వదిలివేశారు. స్వంతంగా ఇంగ్లీషు నేర్చుకున్నారు. హిందూ థియొలాజికల్ హైస్కూలులో పేద పిల్లవాడినని చెప్పి స్కాలర్ షిప్ సంపాదించి కొంతకాలం అక్కడ చదువుకున్నారు. ఆ స్కూల్లో చదువుకుంటున్న రోజుల్లోనే ఆయన పేరు కె (కోట) నరకేసరి నుంచి కె.ఎన్. కేసరిగా మారింది. స్కాలర్ షిప్పుతో స్కూలులో జీతం లేకుండా సరిపోయింది గాని తిండికి, బట్టలకు, పుస్తకాలకు ఇబ్బందిపడుతూ–అక్కడ సంపన్న వైశ్య గృహస్థుల వద్ద నెలకి నాలుగణాలు ఇచ్చే ఏర్పాటు మీద మరికొంతకాలం గడిచింది. ఇన్ని కష్టాలతో ఇక చదువు సాగడం అసాధ్యం అని విసుగుపుట్టి చదువు మానేశారు. ఏదైనా చిన్న ఉద్యోగం చేసి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. కొన్నాళ్ళు ఒక వకీలు వద్ద పని చేశారు. ఆ తరువాత ఒక ఆయుర్వేద వైద్యుడి వద్ద మందులు నూరే పనికి కుదరి, అదీ నచ్చక, ఆ పనీ వదిలిపెట్టరు. మహాదేవ శాస్త్రిగారని మరొక ఆయుర్వేద వైద్యుడి దగ్గర చేరి కొంత వరకు శాస్త్ర పద్ధతిలో విద్య నేర్చుకున్నారు. వైద్య గ్రంథాలు చదివి వైద్య రహస్యాలు బోధపరచుకున్నారు.



స్వంతంగా కొన్ని మందులు తయారు చేసి ఆ చుట్టుపక్కల.. వైశ్యుల ఇళ్ళలో వైద్యం చేసేవారు. పాలూరి రాజంశెట్టిగారని నీలి మందు వర్తకులు– కన్యకా పరమేశ్వరీ దేవాలయం ఆస్తికి ట్రస్టీ. ఆయన ఆ రోజుల్లో కన్యకా పరమేశ్వరీ ఆయుర్వేద ధర్మవైద్యశాల ప్రారంభించారు. పండిత డి.గోపాలాచార్యులు గారిని అందులో వైద్యులుగా నియమించారు. రాజంశెట్టి గారి సిఫారసుతో కేసరిగారు కూడా ఆ వైద్యశాలలో గోపాలాచార్యులు గారికి సహాయ వైద్యులుగా నియమించబడ్డారు. ఆచార్యులుగారితో కలిసి ఆ వైద్యాశాలలో నాలుగేళ్ళు పనిచేశారు. కాని గోపాలా చార్యులు గారికీ కేసరి గారికీ అంతగా సఖ్యత కుదరలేదు. ఆ వైద్యశాలలో కూడా పనికి రాజీనామా చేసి కేసరిగారు బయటికి వచ్చేశారు. ఇక పైన స్వంతం గానే వైద్యశాల ఏర్పాటు చేసుకోదలిచారు కేసరిగారు. ఆ ధర్మ వైద్యశాల ఉన్న నారాయణ మొదలి వీధి లోనే ఒక ఇల్లు నెలకి రూపాయి ఆరణాలకి అద్దెకు తీసుకుని అక్కడ వైద్యం ఆరంభించారు. ఆ ఇంటి బయటి గోడ మీద 'కేసరి కుటీరం–ఆయుర్వేద ఔషధశాల' అని బొగ్గుతో రాసుకున్నారు. అదే ఆయనకి అదృష్టాన్ని తోడు తీసుకువచ్చిన మొదటి సైన్ బోర్డు. కేసరిగారు చిన్నతనంలో చెన్నపట్నం వచ్చిన కొద్ది రోజులకే వారి తల్లి కూడా కొడుకు కోసం చెన్నపట్నం వచ్చి చేరారు. ఆ రోజుల్లో తమ ఇద్దరి బతుకుతెరువు కోసం ఆ తల్లి కొంతమంది వైశ్యుల ఇళ్ళ లో వంట చేసిపెడుతూ ఉండేది. చదువు కోసం చెన్న పట్నం వచ్చి చేరిన విద్యార్థు లకు డబ్బు తీసుకుని భోజనం పెడుతూ ఉండేది. కొడుకు వృద్ధిలోకి రావడం కళ్ళారా చూడకుండానే ఆమె స్వల్ప అనారోగ్యంతో మరణించింది. కన్యకా పరమేశ్వరీ ధర్మ వైద్యశాలలో నేర్చుకున్న అనుభవంతో కేసరిగారు లోధ్ర, అమృత, అర్క మొదలైన మందులు తయారు చేశారు. స్త్రీలకు విద్య అంతంత మాత్రంగా ఉండే ఆ రోజుల్లో వారికి తమ ఆరోగ్యం పట్ల, తమ పిల్లల ఆరోగ్యం పట్ల అవగాహన, శ్రద్ధ అంతంత మాత్రంగానే ఉండేది. దానికి తోడు ఆ రోజుల్లో మూఢనమ్మకాలు, చాదస్తాలు ఎక్కువ.. చేతబడులను, మంత్రాలను ఎక్కువ నమ్మేవారు. స్త్రీల అకాల మరణాలు, ప్రసూతి మరణాలు, శిశు మరణాలు ఎక్కువగా ఉండేవి. కేసరి కుటీరం వారి లోధ్ర, అమృత, అర్క ఆయుర్వేదం మందులు ఈ ప్రమాదాలను నివారించటానికి బాగా పనిచేసేవి. కేసరిగారు ఈ మందులకు జనంలో ఎక్కువగా ప్రచారం కలిగించేటందుకు ఆ రోజుల్లోనే ఆంధ్ర ప్రకాశిక అనే పత్రికలో ప్రకటనలు ఇస్తూ ఉండేవారు. ఇద్దరు స్త్రీలు తమ ఇంటి సమస్యల గురించి, ఒంటి సమస్యల గురించి మాట్లాడుకుంటూ ఈ మందుల గురించి చర్చించుకుంటున్నట్టుగా ఉండే ఆ ప్రకటనలు ఆసక్తి కలిగించేవి. మందులు కూడా తక్కువ ధరలకే లభిస్తుండటం వల్ల స్త్రీలు ఆ మందులు తెప్పించుకుని వాటిని ఉపయోగించి సత్ఫలితాన్ని పొందేవారు. కేసరిగారు ఆశించిన ఫలితం లభించేది. ఆయన వ్యాపారం కూడా వృద్ధి చెందింది. తన వ్యాపారానికి మూల ధనం స్త్రీ ధనమే అని కేసరిగారు గర్వంగా చెప్పుకునేవారు.

– సేనాధిపత్యం రమేష్

### అన్నార్తుల ఆకలి నింపడమే

# అన్న క్యాంటీన్ల లక్ష్యం

- రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి
- అన్న క్యాంటిన్‌లో అల్పాహారాన్ని ప్రజలకు వడ్డించి, వారితో కలిసి భుజించిన మంత్రి పార్ధసారధి





**నూజివీడు, ఆగష్టు, 17 (ఆంధ్రపత్రిక) :** అన్నార్తుల ఆకలి నింపడమే 'అన్న క్యాంటిన్ల' ఏర్పాటు లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. నూజివీడు పట్టణంలోని రామాయమ్మారావు పేటలో 'అన్న క్యాంటిన్‌ను మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించారు. ప్రజలకు దగ్గరుండి అల్పాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ కార్మికులు, ప్రజలు ఎన్నో పనులమీద పట్టణాలకు వస్తుంటారని, అల్పాహారం, భోజనానికి వందల రూపాయలు ఖర్చు అవుతుంటాయన్నారు. అలాంటి పేదలకు 5 రూపాయలకే కడుపునిండా భోజనం అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ప్రజలను సంతోషపరిచేలా వారి ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందించడం కూటమి ప్రభుత్వం బాధ్యతన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధితోపాటు అన్ని రంగాలను అభివృద్ధి బాట పట్టించి, యువతకు, రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఇచ్చిన హామీలలో ప్రధానమైన 5 హామీలకు సంతకాలు చేశారన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మందికి ప్రతీ నెలా ఒకటవ తేదీ ఉదయం 6 గంటలకే వారి ఇంటివద్దే అందిస్తున్నామన్నారు. వృద్ధులు, వితంతువులకు 3 వేల నుండి 4వేల రూపాయలకు పెంచడంతోపాటు 3 నెలల బకాయిలతో కలిపి 7 వేల రూపాయలను ఒకేసారి చెల్లించామన్నారు. దివ్యంగులకు 3 వేల నుండి 6 రూపాయలకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి 5 వేల నుండి 10 వేల రూపాయలకు పెన్షన్ పెంచామన్నారు. 16 వేల 700 పోస్టులతో మెగా డీఎస్సీ కి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. పారిశ్రామికరంగంలో నైపుణ్యం కలిగిన వారికి డిమాండ్ ఉందని, అందుకే యువతకు అభిరుచి కలిగిన రంగంలో నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నామన్నారు. నిరుపేదల ఆకలిని తీర్చేందుకు అన్న క్యాంటిన్లను ఆగష్టు,15వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంబిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల నిధులను వారి అనుమతి లేకుండా, వారికి తెలియకుండా పూర్తిగా మళ్లించిన ఘనత గత ప్రభుత్వానిదన్నారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం, రాష్ట్రానికి చేసిన నష్టాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కూటమి నేతలకు ఉందన్నారు. అన్ని రంగాలలో నష్టపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని మంత్రి పార్ధసారథి చెప్పారు. అనంతరం అన్న క్యాంటీన్లో అల్పాహారాన్ని మంత్రి ప్రజలతో కలిసి రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, డిఈ లక్ష్మి నారాయణ, వార్డ్ కౌన్సిలర్ చెరుకూరి దుర్గా ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి సమిష్టి బాధ్యత..!

### కృష్ణా జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి చిన్నం శెట్టి రాజు





**మచిలీపట్నం ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** మారుతున్న నేటి సమాజంలో మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సమిష్టిగామనందరిపై ఉందని కృష్ణా జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ 67వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శనివారం మచిలీపట్నం లేడీ యాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జడ్జి రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కళాశాల ప్రాంగణంలో న్యాయమూర్తి మొక్కలు నాటి," నేటి సమాజంలో జర్నలిస్టుల పాత్ర "పై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ దేశంలో ఉద్యోగ నిర్వహణలో మహిళల పాత్ర కీలకంగా మారిందని ఆడపిల్లలు అందరూ చదువుకుని ఎదగాలన్నారు. ప్రతి విద్యార్థిని దిశా నిర్దేశం చేసుకుని చదువు కొనసాగించాలని అన్నారు. ప్రతి విద్యార్థిని చదువుతోపాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ మహిళల హక్కుల పరిరక్షణ కోసం పలు చట్టాలు అమల్లోకి వచ్చాయని ప్రత్యేక మహిళా న్యాయస్థానాలు ఏర్పాటు చేశారని తెలియజేశారు. ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సెల్ఫోన్ లో ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థినికి రాష్ట్ర లా సెట్ లో 81 వ ర్యాంకు రావడం ఆనందదాయకమని అన్నారు. జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర నాయకులు చందమామ బాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ కాపాడడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు. జర్నలిస్టులు 24 గంటలు తమ విధి నిర్వహణలో ఉన్నారని ఆ విధి నిర్వహణలో కొంతమంది మిత్రులు ప్రాణాలు కూడా కోల్పోవడం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థిని ప్రతిరోజు దినపత్రికలు చదివి సమాజం పై అవగాహన పెంచుకోవాలని అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ వి. సుందర లక్ష్మి కళాశాల అధ్యాపకులు పలువురు జర్నలిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ కారుమూరి రాజేంద్రప్రసాద్ ను న్యాయమూర్తి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు టి. ప్రేమనాథ్, సద్గుణ రావు, వేణు కుమార్, ముదిగొండ శాస్త్రి, దాసరి వినయ్, రామకృష్ణ, షేక్ షరీఫ్, కే సతీష్, బి శంకర్ నాగరాజు, లాజర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

### ఆదోని ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా జీ తెలుగు మెగా ఈవెంట్ 'శ్రావణలక్ష్మి', ప్రేమలు వరల్డ్

## టెలివిజన్ ప్రీమియర్ ఈ ఆదివారం మీ జీ తెలుగులో!







**కర్నూలు, 15 ఆగస్ట్ (ఆంధ్రపత్రిక) :** ఆరంభం నుంచే అంతులేని వినోదం అందించడమే లక్ష్యంగా రియాలిటీ షోలు, సీరియల్స్, సూపర్ హిట్ సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తోన్న ఛానల్ జీ తెలుగు. ప్రేక్షకులకు మరింత వినోదం అందించేందుకు నేరుగా తమ అభిమాన బుల్లితెర నటీనటులను కలిసే అవకాశం అందిస్తూ ఆదోనిలో ఆగస్ట్ 10 శనివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించింది. శ్రావణమాసం ప్రత్యేకంగా ఆదోని వేదికగా నిర్వహించిన జీ తెలుగు మెగా ఈవెంట్ 'శ్రావణలక్ష్మి'ని ఆగస్ట్ 18, ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రసారం చేయనుంది. అంతేకాదు! వారం వారం సరికొత్త సినిమాలతో అలరించే జీ తెలుగు ఈ వారం మరో సూపర్ హిట్ సినిమా ప్రేమలుని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా అందించేందుకు సిద్ధమైంది. నస్లెన్ కె గఫూర్, మమితా బైజు నటించిన ప్రేమలు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ ఆగస్టు 18 ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు జీ తెలుగులో మాత్రమే! జీ తెలుగు ఇటీవల ఆదోనిలో ప్రముఖ నటీనటులతో శ్రావణమాసం ప్రత్యేక కార్యక్రమం 'శ్రావణలక్ష్మి' మెగా ఈవెంట్ని నిర్వహించి వీక్షకులకు ఆహ్లాదకరమైన అనుభవాన్ని అందించింది. ఈ కార్యక్రమం ఆదివారం జీ తెలుగులో ప్రసారం కానుంది. మీ అభిమాన యాంకర్ లాస్య వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమం ఆద్యంతం ప్రేక్షకులకు వినోదం పంచింది. జీ తెలుగు ప్రేక్షకులను మెప్పిస్తూ విజయవంతంగా కొనసాగుతున్న జాబిల్లికోసం ఆకాశమల్లే, మా అన్నయ్య సీరియల్స్ నటీనటులు ఈ వేదికపై నుంచి తమ అభిమానులతో సంభాషించి వారి సంతోషంలో పాలుపంచుకున్నారు. అభిమానుల కోలాహలంతో నిండిన ఈ వేదికపై మా అన్నయ్య సీరియల్ జంట గంగ(గోకుల్ మీనన్)-శివ(స్మృతి కశ్యప్) వివాహతంతు ఘనంగా జరిగింది. ఈ వివాహానికి లాస్య పురోహితుడి పాత్ర పోషించి అందరినీ కడుపుబ్బా నవ్వించింది. అంతేకాదు, ఈ వేదికపై నటీనటులంతా రక్షాబంధన్ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఇక, ఎవర్గ్రీన్ సరిగమప గాయకులైన లక్ష్మీగాయత్రి, సమీర ప్రత్యేక ప్రదర్శన వీక్షకుల హృదయాలను హత్తుకుంది. జీ తెలుగు తారలు, అభిమానులతో సంగ్రామంలా సాగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదోని శాసనసభ సభ్యులు పీ.వీ. పార్థసారథి హాజరై అందరిలో మరింత ఉత్సాహం నింపారు. ఈ వేదికపై నిరుపేదల కోసం సోషల్ వెల్ఫేర్ సొసైటీని నిర్వహిస్తూ ప్రజాసంక్షేమం, సేవ కోసం పాటుపడుతున్న సునీతను సన్మానించారు.

అంతేకాదు.. వీకెండ్ వినోదాన్ని రెట్టింపు చేసేందుకు ప్రేమలు సినిమాని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా అందిస్తోంది జీ తెలుగు. గిరీష్ ఎ.డి దర్శకత్వం వహించిన ప్రేమలు సినిమా కథ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అయిన సచిన్ (నస్లెన్ కె. గఫూర్) చుట్టూ తిరుగుతుంది. వెళ్ళాలకున్న సచిన్ వీసా దరఖాస్తు తిరస్కరించబడుతుంది. సచిన్ తన స్వగ్రామంలో ఉండటం ఇష్టంలేక తన స్నేహితుడు అమల్ డేవిస్ (సంగీత్ ప్రతాప్) సహాయం కోరతాడు. హైదరాబాద్ లో గేట్ కోచింగ్ తీసుకోవాలనుకున్న అమల్ సచిన్ ను వెంట తీసుకెళ్తాడు. ఓ పెళ్లిలో రీను (మమితా బైజు)ను కలిసిన సచిన్ వెంటనే ఆమెతో ప్రేమలో పడతాడు. ఆ తర్వాత ఏం జరుగుతుందనేది తెలియాలంటే ప్రేమలు సినిమా చూడాల్సిందే!

నస్లెన్ కె.గఫూర్, మమితా బైజు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో సంగీత్ ప్రతాప్, శ్యామ్ మోహన్, అఖిల భార్గవన్, మీనాక్షి రవీంద్రన్, అల్తాఫ్ సలీం తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. ఈ సినిమాలో ప్రతి ఒక్కరి నటన అందరినీ ఆకట్టుకుంటుంది. కామెడీ, సెంటిమెంట్ మేళవింపుతో ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. మనసుని తాకే సన్నివేశాలు, ఉత్కంఠరేపే ట్విస్టులతో ప్రేమలు సినిమా ఉద్వేగభరిత అనుభూతిని ఇస్తుంది. మరి మీరూ ఈ వీకెండ్ ధమాకా డబుల్ వినోదాన్ని మిస్సవకుండా ఉండాలంటే మీ అభిమాన తారలు సందడి చేసిన 'శ్రావణలక్ష్మి' మెగా ఈవెంట్తోపాటు, హృదయాన్ని హత్తుకునే కథతో సాగే ప్రేమలు సినిమాని తప్పక చూడండి!

### శనగపాడు అంగన్వాడీ కేంద్రం-3లో

## తల్లుల సమావేశం



**పెనుగంచిప్రోలు, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** చిల్లకల్లు చిల్లకల్లు ఐసిడిఎస్ సిడిపిఓ లక్ష్మీ భార్గవి ఆదేశాలకు అనుగుణంగా సూపర్వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో శనగపాడు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం -3 లో తల్లుల సమావేశం ప్రీస్కూలు ఆవశ్యకత గురించి వివరించారు.పిల్లలు తయారు చేసే వస్తువులు అంటే స్కూల్లో వారు చేసే ఆక్టివిటీస్ అవన్నీ తల్లులకి చూపించడము మరియు వారు ఇంటి దగ్గర కూడా యాక్టివిటీస్ చేయించాలని, పిల్లలకి నేర్పే విధంగా ఉండాలనికోరారు.ప్రీస్కూల్ కి పిల్లలు రావడం వల్ల వారికి మేధో శక్తి పెరుగుతుందని ఆటపాటల వల్ల వారు చాలా చురుకుగా ఉంటారని మూడు నుంచి ఐదు సంవత్సరాల వయసులో పిల్లలకి మెదడు ఎదిగే సమయం ఇదే కాబట్టి అందరూ అంగన్వాడీ కేంద్రానికి పిల్లల్ని పంపించాలని, వారికి కావలసిన పోషక ఆహారం కూడా అంగన్వాడీ సెంటర్లో అందుతుంది కాబట్టి అందరూ అంగన్వాడీ సదుపాయాలు ఉపయోగించుకోవాలని తెలియజేస్తూ తల్లులకు అవగాహన కల్పించడం అయినది ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సీతారావమ్మ ,దుర్గ మరియు ఆయాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### గుర్తుతెలియని మహిళా మృతి దేహం



**గరికపాడు, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో గరికపాడు పాలేరు వద్ద గుర్తుతెలియని మహిళా మృతి దేహం సుమారు45-55 మధ్యలో ఉంటుంది. పై ఫోటోలో ఉన్న ఆమెను ఎవరికైనా తెలిసిన యెడల చిల్లకల్లు ఎస్సైగారుని సంప్రదించగలరు .9440796465

### ఆటలు ఆడటం వలన

## మానసిక ఉల్లాసం





**నూజివీడు, ఆగష్టు 17, (ఆంధ్రపత్రిక) :** నూజివీడు నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ యస్ ఆర్ ఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్ లో పాఠశాల ఇన్ ఛార్జి ప్రధానోపాధ్యాయుని వల్లభనేని పద్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో ఆర్డినేటర్ రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహిం చడం జరిగినది. పద్మమాట్లాడుతూ ఒక వ్యక్తి మరొక వ్యక్తి ఆలోచనలు పంచుకోవడం. ప్రతివ్యక్తి ఆటలు ఆడాలని కోరారు. ఆటలు ఆడటం వలన మానసిక వికాసం కలుగును అని తెలిపారు.ముసునూరు ,నూజివీడు, ఆగిరిపల్లి ,చాట్రాయి మండల వ్యాయామ ఉపాధ్యాయలు పాల్గొని ఉదయం నుంచి మోడల్ కండక్ట్ ఆఫ్ స్కూల్ అసెంబ్లీ మరియు స్కూల్ గేమ్స్ గ్రూప్ ల వారి వయస్సు హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మరియు ఫిట్ నెస్ మరియు ఇండోర్ గేమ్స్ చెస్ నియమ నిభందనలు, యోగాసన మరియు ఫుడ్ అండ్ న్యు ట్రేషియన్ మరియు వ్యాధులు మరియు కబడ్డీ మరియు అద్లెటిక్స్ ట్రాక్ ఈ వింట్స్ గూర్చి స్కూల్ కాంప్లెక్స్ లో నిర్వహించడ0 జరిగినది. వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మి, అన్నామణి, వనజ, సుగుణరావు, హర్ష, నాగరాజు, సుకుమార్ స్వప్న ,సతీష్ ,రాణి, నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, హారతి, నాగమణి, రాజేశ్వరి, హేమ, శివనాగేంద్రరావు, ఉమామహేశ్వరి, సరళ, ప్రభాకర్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

### విద్యార్థి దశలోనే న్యాయవిజ్ఞానం పెంపొందాలి




**నూజివీడు, ఆగష్టు 17, (ఆంధ్రపత్రిక) :** నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ బాయ్స్ హైస్కూల్ ఆవరణములో శనివా రం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్ కె పెద ఖాసీం మాట్లాడుతూ విద్యార్థి దశలో న్యాయ విజ్ఞానం పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పేదలకు ఉచిత న్యాయ సలహాలు, సేవలు అందించేందుకు కోర్టులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటా యన్నారు. ఈ అవకాశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కామ్రేడ్ దుర్గారావు మరణం తీరని లోటు



**నూజివీడు, ఆగష్టు 17, (ఆంధ్రపత్రిక) :** సిపిఎం సీనియర్ నేత కామ్రేడ్ దుర్గా రావు అంత్యక్రియలో భాగం గా రాష్ట్ర జిల్లాస్థాయి సిపి ఎం నాయకులు, పట్టణం లోని వర్తక వాణిజ్య సంఘ నాయకులు అంతిమ అంత్య క్రియలో పాల్గొని నివాళి అర్పించారు, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం కుటుంబానికి ఫోన్లో సంతాపాన్ని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు సిపిఎం రాష్ట్ర నాయకులు బిఆర్ తులసి రావు రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై కేశవరావు సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రవి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి రాజు రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్ష .కార్యదర్శి ఎన్ నరసింహ కే శ్రీనివాస్ సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్ ఆర్ హనుమాన్లు, సిపిఎం నాయకులు పద్మాంజలి,శోభనాద్రి ,మరియదాస్, నాగ రాజు,సత్తు కోటేశ్వరరావు, ప్రసాద్,బోస్, ప్రసాద్,పాపారావు, భాషా, రాజారావు,శ్రీనివాస్, ఆంజనే యులు,అబ్దుల్ బారి ,యేసు పాదం, ప్రజా సంఘాల నాయకులు ప్రసాద్ సుబ్బారావు కృష్ణారెడ్డి, సిపిఐ నాయకులు సరసాని వెంకట రామారావు, కొమ్మన నాగేశ్వరరావు, సిహెచ్ పుల్లారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బీడీ రవికుమార్ తెలుగుదేశం పార్టీ నాయకులు నూతక్కి వేణుగోపాల్, తదితర ప్రముఖులు అంతా కామ్రేడ్ యెలినేని దుర్గారావు కుటుంబానికి సంతాపం తెలియజేశారు.

### అగ్ని ప్రమాద బాధితులకు అండగా నిలిచిన టిడిపి నేతలు..!



**మచిలీపట్నం ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** రుద్రవరం లో అగ్ని ప్రమాదం వల్ల సర్వం కో ల్పోయిన వారికి అండగా నిలిచి నిత్యావసర సరు కులను అందించిన టిడి పి నేతలు.అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పో యిన కుటుంబానికి అండగా నిలవాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు టిడిపి నేత గుమ్మడి అశ్విని వితరణ అందించారు.బుధవారం అర్ధరాత్రి రుద్రవరం గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో నిలిచిన కుటుంబానికి చలించిన టిడిపి నేత అశ్విని సంఘటన సమాచారాన్ని మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి ప్రమాద బాధిత కుటుంబానికి అండగా నిలవాలని ఆదేశించగా పార్టీ ఆదేశాల మేరకు కుటుంబాన్ని పరామర్శించి పరిస్థితిని తెలుసుకొని నిత్యావసర సరుకులు అందించారు. ఏ సహాయం కావాలన్నఎల్లవేళలా అండగా ఉంటానని, అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. అశ్వినికి సీనియర్ నేతలకు అగ్ని ప్రమాద బాధితులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు మాజీ సర్పంచ్ నీలం వెంకట రామ కృష్ణ, గుమ్మడి కిరణ్ కుమార్, గోట్రు శ్రీను తదితరులు పాల్గొన్నారు

ఆంధ్రపత్రిక

జిల్లాలకు విలేఖరులు కావలెను

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం - 1914

గుంటూరు, బాపట్ల, ఒంగోలు జిల్లాలోని పొన్నూరు, చీరాల, వేటపాలెం, చెరుకుపల్లి నియోజకవర్గాలకు మరియు మండలాల వారిగా విలేఖర్లు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
9849998069, 8639287624

# రాష్ట్రంలో వండర్స్ సృష్టించనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

**అన్న క్యాంటీన్ల పునఃప్రారంభంతో సంతోషంలో ప్రజలు**
**12వ డివిజన్ పర్యటనలో ఎమ్మెల్యే గద్దె రామమోహన్**





**విజయవాడ, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వ సహాకారంతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం చేసి వండర్స్ సృష్టించనున్నారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటుగా అమరావతిని అభివృద్ధి చేస్తారని చెప్పారు. శనివారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 12వ డివిజన్ అయ్యప్ప నగర్ ట్రెజరీ ఎంప్లాయిస్ కాలనీ ఏరియాలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించి స్థానికంగా ఉన్న డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్లను ప్రారంభించడంతో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. వైఎస్. జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్లను రద్దు చేసిన తర్వాత అన్న క్యాంటీన్ల విలువ, అవసరం ప్రజలకు బాగా తెలిసిందన్నారు. కూలీలు, పేదలు, ఆటో డ్రైవర్లకు అన్న క్యాంటీన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. రోజుకు పదిహేను రూపాయలతో ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం పూర్తి అవుతున్నాయని, మిగిలిన డబ్బులను కుటుంబ అభివృద్ధికి కూలీలు ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని చెప్పారు. అన్న క్యాంటీన్లలో పూటకు రూ.5తో భోజనం పెట్టె విధానాన్ని కూడా కొంత మంది వైకాపా వారు సోషల్ మీడియాలో విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. నెలకు రూ.450లతో చంద్రబాబునాయుడు పేదలకు నెలంతా ఆకలిని తీరుస్తున్నారన్నారు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధిని ప్రజలు గుర్తు చేసుకున్నారని, అందువల్లనే 2024లో జరిగిన ఎన్నికల్లో జగన్కు బుద్ధి చెప్పి చంద్రబాబునాయుడుకు అధికారం అప్పగించారన్నారు. జగన్మోహన్రెడ్డికి ఎన్నికల్లో 11 సీట్లతో ప్రతిపక్ష హెూదా కూడా లేకుండా చేశారన్నారు. జగన్, చంద్రబాబు పాలనను చూసిన ప్రజలు ఇద్దరిలో చంద్రబాబునాయుడు పాలనే తమకు కావాలని ప్రజలు నిర్ణయించుకుని జగన్కు కనీసం ప్రతిపక్ష హెూదా కూడా రాకుండా చేశారన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క సారిగా రూ.3వేలు ఉన్న ఫించను రూ.4 వేలకు పెంచారని చెప్పారు. గతంలో రూ.2 వేలు ఉన్న పింఛను రూ.3 వేలు చేయడానికి జగన్కు ఐదు సంవత్సరాలు పట్టిందన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావడం చూసి చాలా విదేశాల నుంచి పారిశ్రామిక వేత్తలు రాష్ట్రానికి వచ్చి పరిశ్రమలు స్థాపించడానికి ఆసక్తి కనబరుస్తున్నారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటుగా అమరావతిని అభివృద్ధి చేసి చూపిస్తారని చెప్పారు. చంద్రబాబు నాయుడు చేసే ప్రతి పనిని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని చెప్పారు. కార్పొరేటర్ పొట్లూరి సాయి బాబు మాట్లాడుతూ అన్న క్యాంటీన్లలో ఇచ్చే ఆహారాన్ని కూడా విరాళాల ద్వారా నిర్వహించాలని చంద్రబాబునాయుడు నిర్ణయించుకున్నారని, చాలా మంది అన్న క్యాంటీన్లకు విరాళాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉండి ముందుకు వస్తున్నారన్నారు. సంకల్పం ఉంటే చేయలేని పని ఏదీ ఉండదని, చంద్రబాబు నాయుడు మంచి పనులు చేయాలని సంకల్పించుకున్నారని ఆ పనులను ఎవ్వరూ ఆపలేరని చెప్పారు. మంచి చేయాలనే ఆలోచన మార్గంలోని మనం దరం వెళ్ళాళని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, నడకుదిటి సూర్యనారాయణ, మోటూరి బుచ్చిబాబు, పఠాన్ హయ్యాన్, కొండవీటి లక్ష్మీప్రసాద్, యలమంచలి రవీంద్ర, కోడే సాంబశివరావు, యలమద్ది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కేరళ వయనాడు బాధితులకు విరాళాలు అందించడం అభినందనీయం

**కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



**మచిలీపట్నం ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** కేరళ వయనాడు బాధితులను ఆదుకునేందుకు, స్వచ్ఛంద సంస్థల హాస్టల్ల నిర్వహణకు విరాళాలు అందజేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. శనివారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో సిరి పబ్లికేషన్స్ అధినేత, స్టార్ విద్యాసంస్థల మెంటర్ శ్రీరామ్ తన పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులతో కలిసి 50 వేల రూపాయల బ్యాంకు చెక్కును వయనాడు బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం జిల్లా కలెక్టరుకు అందజేశారు. దీంతో జిల్లా కలెక్టర్ సిరి పబ్లికేషన్స్ అధినేత శ్రీరాములు ను అభినందించారు.సరిగ్గా ఇక్కడ ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. జిల్లా కలెక్టర్ బాలాజీ సన్ స్టార్ స్కూల్ విద్యార్థిని అయిన పి.హర్షితా ( గ్రేడ్-8) వయనాడులో ప్రకృతి విలయం ఎందుకు జరిగింది, "ల్యాండ్ స్లైడ్స్" ఎందుకు జరుగుతాయి" అని అడగడం జరిగింది.దానికి జవాబుగా డిఫోరేస్ట్రేషన్ అని పాప జవాబు చెప్పింది.దానికి కలెక్టర్ డిఫోరేస్ట్రేషన్ వల్ల ఎందుకు అలా అవుతుందని మరో ప్రశ్న వేయగా చెట్లు వాటి యొక్క వేళ్ళు మట్టిని హెూల్డ్ చేస్తాయి అని పాప జవాబు చెప్పడంతో అక్కడున్న అధికారులతో సహా కలెక్టర్ ఆ విద్యార్థినిని చప్పట్లతో అభినందించారు.సన్ స్టార్ స్కూల్, సన్ స్టార్ కళాశాల, విద్యార్థులు అందరు కలిసి ఎవరికి తోచినంతగా వారు ఆర్థిక సాయం చేయాలని ఆశయంతో ఆగస్టు 15 సందర్భంగా చేపట్టిన ఫండ్ రైజింగ్ కార్యక్రమం ద్వారా వచ్చిన 2,50,000 రూపాయల విరాళాన్ని హాస్టల్ విద్యార్థులకు భోజనము పాలు దుస్తులు వైద్య సేవలు అందించటానికి మానవతా స్వచ్ఛంద సంస్థకు కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ పిల్లలతో కలిసి మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు శ్రీరామ్ కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డిఆర్ఓ శ్రీదేవి, స్టార్ అకడమిక్ డైరెక్టర్ అయ్యప్ప స్వామి , మానవతా స్వచ్ఛంద సంస్థ కో చైర్మన్ ముదిగొండ శాస్త్రి ,స్టార్ కాలేజ్ ప్రిన్సిపల్ ఎం. ఎల్. ఆదిత్య , సన్ స్టార్ స్కూలు ప్రిన్సిపల్స్ , స్టార్ కాలేజ్ ప్రిన్సిపల్స్ ,ఉపాధ్యాయ , ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాంస్కృతిక కార్యక్రమాలులో ప్రతిభ కనబరిచిన కలిదిండి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు



**కలిదిండి, ఆగస్టు 17, ఆంధ్రపత్రిక) :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని ఏలూరు డిస్టిక్ హెడ్ క్వార్టర్స్, ఏలూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలలో కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరిచి తృతీయ బహుమతి సాధించి ప్రశ్నాపత్రం అందుకున్నట్లు కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ సాన వెంకట రామారావు, చైర్మన్ సానా మీనా సరస్వతి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సానా వెంకట రామారావు, చైర్మన్ సానా మీనా సరస్వతి మాట్లాడుతూ గృహ నిర్మాణ శాఖ, సమాచార శాఖ మాత్యులు కొలుసు పార్థసారథి, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రీ సెల్వి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. అబ్రహం చేతుల మీదగా గురువారం ప్రశ్నాపత్రం, షీల్డ్ విద్యార్థులు అందుకున్నట్లు వారు తెలిపారు.

విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందానికి, కర్ర సాము కోచ్ మధులుకు కరస్పాండెంట్ సానా వెంకట రామా రావు, చైర్మన్ సానా మీనా సరస్వతి, ప్రిన్సిపాల్ పాండురంగారావుకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# జెమినీ టీవీలో ఈనెల 19 నుంచి 'అమ్మకు ప్రేమతో' సరికొత్త ధారావాహిక ప్రారంభం







అమ్మ అంటే దైవం. అమ్మ అంటే ఈ సృష్టికి మూలం. అలాంటి అమ్మ, తాను చేయని తప్పుకి తన పిల్లలని కోల్పోతే? అసలు తన పిల్లల్ని ఎందుకు కోల్పోయింది? మళ్ళీ ఆ తల్లీ పిల్లలు కలుస్తారా? ఇదే "అమ్మకు ప్రేమతో" సీరియల్ కథ. ఇది బంధాలు, అనుబంధాల కోసం పరితపించిపోయే మనుషుల కథ. నిజమైన కుటుంబం అంటే ఏంటో, నిజమైన ప్రేమ అంటే ఏంటో ఈ సీరియల్ లోని సన్నివేశాలు మనసుకి హత్తుకునేలా చెబుతాయి. ఎంత కఠినమైన మనసునైనా కరిగించే బలం ప్రేమకు మాత్రమే ఉంది అని ఈ కథనం నిరూపిస్తుంది.అన్విక ఆర్ట్స్ సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సరికొత్త 'అమ్మకు ప్రేమతో ' డెయిలీ సీరియల్ఆగస్టు 19 నుంచి , ప్రతి రోజూ అంటే , సోమవారం నుంచి శనివారం వరకు మధ్యాహ్నం 12:30 నిమిషములకు, మళ్ళీ తిరిగి రాత్రి 09:30 నిమిషములకు ప్రసారం అవుతుంది. మీకు ఎప్పటికప్పుడు వినూత్నమైన సీరియల్స్ అందిస్తున్న మీ జెమిని టీవీ లో ప్రారంభం కానున్న ఈ ధారావాహికలో హీరోగా శ్రవణ్ కుమార్ (మగువ మగువ ఫేమ్) , హీరోయిన్స్గా హన్సిత విజయన్, కశ్వి నటిస్తుండగా, రాజేశ్వరి నాయర్, శిరీష్ సౌగంధ్, సురేష్(ముద్ద మందారం), రాఘవ, విజయ్ రెడ్డి, రోజా భారతి, జ్యోతి పూర్ణిమ, దేవి శ్రీ ప్రభు, రాజేంద్ర కుమార్, చిన్ని కృష్ణ, విజయ, యశ్వంత్ సూర్య, మహతి, బి.ఎన్ శర్మ, శ్రీ రామ్ రమేష్, నిర్మలమ్మ, పుష్ప, ఆర్.కె నాయుడు, నేత్ర రెడ్డి, మాధవ సాయి తదితరులు సపోర్టింగ్ క్యారెక్టర్స్ పోషిస్తున్నారు. నిర్మాణ సంస్థ: అన్విక ఆర్ట్స్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ : ప్రకాష్ రెడ్డి , ప్రొడక్షన్ కంట్రోలర్ : కొల్ల గంగాధరంకాస్ట్యూమ్స్: సతీష్ , మేకప్ బీ శ్రీను, డిఓపి: చేగు మురళి కృష్ణ, ప్రత్తిపాటి విజయ్ కుమార్, మ్యూజిక్ : సాయి మధుకర్ఎడిటర్ : దొండపాటి రాజేష్ చౌదరి, కథ: గాంధీ మనోహర్, స్క్రీన్-ప్లే, డైలాగ్స్: సంజీవ్ మేగోటిసహదర్శకులు: బుర్రి ప్రశాంత్, ఆయన్ష్ రెడ్డి , సహ-నిర్మాతలు: బోదంగి మురళీ కృష్ణ, అంజు ఫిల్మ్స్ నారాయణ మూర్తి , నిర్మాత: సంజీవ్ మేగోటి , ఎపిసోడ్ దర్శకుడు: సుభాష్. ఆర్, దర్శకుడు: వర ముళ్ళపూడి (ప్రముఖ సినీ దర్శకుడు)

## టీడీపీ నేత రమేష్ మృతి, నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



**మైలవరం, (ఇబ్రహీంపట్నం), ఆగస్టు 17: (ఆంధ్రపత్రిక):** ఇబ్రహీంపట్నం మండలం కొటికలపూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు జొన్నలగడ్డ రమేష్ (52) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పశ్చిమ ఇబ్రహీం పట్నంకు విచ్చేసి ఆయన పార్థీవదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. స్థానిక ఎన్డీఏ మహాకూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రేపే ప్రజా దర్బార్



**మచిలీపట్నం ఆగస్ట్ 27 (ఆంధ్రపత్రిక) :** రాష్ట్ర గనులు ఆబ్కారి,మైనింగ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమం రేపే అనగా సోమవారం ఉదయం 9 గంటలకు బందరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నిర్వహించడం జరుగుతుందని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. ప్రజలు తమ సమస్యలు అర్జీ రూపంలో సమర్పించాలని తెలియజేసింది.

## లజ్జ బండ కాలువలో పూడికతీత పనులు వెంటనే పూర్తి చేయాలి

**కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**





**మచిలీపట్నం ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** లజ్జబండ మురికి కాలువలో పూడిక తీత పనులు వెంటనే పూర్తిచేసి వరద నీరు ప్రవాహం సజావుగా సాగేలా చూడాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం పెడన మండలంలోని లజ్జబండ మురికి కాలువలో 7 కోట్ల రూపాయల వ్యయంతో జరుగుతున్న పూడిక తీత పనులను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.కొంకేపూడి లోని లజ్జబండ మురికి కాలువ 15 వ కిలో మీటర్ల వద్ద పంటు మీద ప్రోక్లైనరుతో జరుగుతున్న పూడికతీత పనులను కలెక్టర్ పరిశీలించారు.రేఖా చిత్రం పరిశీలించి లజ్జబండ మురికి కాలువలో పూడిక తీత పనుల వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూడిక తీత లెవలింగ్ పరికరాలను కూడా స్వయంగా పరిశీలించి ఎలా నీటి లోతు వివరాలను చూస్తారో వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం నందమూరు లోని లజ్జబండ మురికి కాలువ 7 వ కిలోమీటర్ వద్ద ఇదివరకే జరిగిన పూడిక తీత పనులను కలెక్టర్ పరిశీలించారు. కాలువ గట్టు పైన వేసిన పూడికను గమనించారు.అక్కడ ఉన్న పూడికను బయటికి తోడే రెండు డ్రెడ్జర్ వాహనాలను కూడా కలెక్టర్ పరిశీలించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట డ్రైనేజీ ఈ ఈ విజయలక్ష్మి, డిఈ ఈ మురళి పాల్గొన్నారు.

## విజయవాడ విమానాశ్రయానికి ఎన్టీఆర్-రామోజి విమానాశ్రయంగా నామకరణం చేయండి

**పాత్రికేయుల సమస్యలను పరిష్కరించండి**
**ముఖ్యమంత్రికి ఎడిటర్సిల్డ్ ఆఫ్సౌత్ ఇండియా అభ్యర్థన**

**విజయవాడ, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** పాత్రికేయుల సమస్యలను పరిష్కరించాలని, విజయవాడ విమానాశ్రయానికి ఎన్టీఆర్-రామోజీ విమానాశ్రయంగ నామకరణం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి ఎడిటర్సిల్డ్ ఆఫ్సౌత్ ఇండియా అభ్యర్థించింది. ఈ మేరకు ఈజిఎస్ అధ్యక్షుడు దీక్ష ప్రసాద్శుక్రవారం, ముఖ్యమంత్రికి ఓలేఖ వ్రాసారు. "ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో, రాష్ట్రంలో మీరు సాధించిన అద్భుతమైన విజయానికి మేము హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తున్నాము. నాలుగోసారి ముఖ్యమంత్రి పదవిని దక్కించుకున్న మీ అచంచలమైన సంకల్పం అందరికి ప్రేరణ గాని లుస్తుంది. పాత్రికేయుల అత్యవసర సమస్యలను పరిష్కరించటానికి మీతో చర్చలు జరపాలని మేము ఆసక్తిగా ఎదురుచూస్తున్నాము. ఈ సమస్యలలో, పాత్రికేయులకు సొంత నివాసంలేకపోవడం ప్రధానమైనది. వీరిలో చాలా మంది తమజీవితాలను తమవృత్తికి అంకితం చేస్తున్నారు. తరచుగా వృత్తిపరమైన వివిధ ప్రమాదాలను ఎదురుకుంటున్నారు. దురదృష్టవశాత్తు, కొంతమంది విధినిర్వాహణలో తమప్రాణాలను కోల్పోయారు. వారిపై ఆధారపడిన వారికీ భద్రతలేకుండా పోతోంది. గృహపట్టాలు అందిస్తామని గతప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, ఈ వాగ్దానాలు నెరవేరలేదు. మీ సమర్ధ నాయకత్వంపై పూర్తినమ్మకంతో ఉన్నాము. ఈవాగ్దానంత్వరలో కార్యరూపందాల్చుతుందని మేము నమ్ముతున్నాము. ఈ విషయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని మేము మిమ్మల్ని కోరుతున్నాము. గన్నవరం విమానాశ్రయం స్థాపించడంలో కీలకపాత్ర పోషించిన దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్, దేశానికి తనకలం ద్వారా సేవలు అందించిన దివంగత ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావుకు నివాళిగా గన్నవరం విమానాశ్రయానికి ఎన్టీఆర్ రామోజీ అంతర్జాతీయ విమానాశ్రేయంగా పేరుమార్చాలని మేము ప్రతిపాదిస్తున్నాము. ఈ అభ్యర్ధనలకు అనుకూలమైన ప్రతిస్పందన కోసం మేము ఆసక్తిగా ఎదురుచూస్తున్నాము. ఈ ప్రతిపాదనను మేము పౌరవిమానయాన మంత్రి కింజరాపు రామ్మోహననాయుడుకు అందించటం జరిగింది"అనిపేర్కొన్నారు.

## చంద్రబాబు లోకేష్ను కలిసిన టీడీపీ బీసీ నాయకుడు బొర్రా కాశి



**బంటుమిల్లి ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** పెడన నియోజకవర్గం టిడిపి నాయకుడు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నేత బొర్రా కాశీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర మంత్రి లోకేష్ లను కలిశారు. పలు విషయాలను వారికి వివరించారు. ప్రధానంగా అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఘన విజయం గురించి వివరించారు.

## గంగానమ్మ గుడి ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న కాగిత....



**గూడూరు ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** గూడూరు మండలం తరకటూరు శివారు, మాకువానిపా లెంలో నూతనంగా నిర్మించిన గంగానమ్మ గుడి ప్రతి ష్ట కార్యక్రమంలో పాల్గొ న్నా పెడన నియోజకవర్గం శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్. ఈ కార్యక్రమంలో గూడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతన స్వామి, నాయకులు, శయన సోమయ్య,ఎన్ ఏ బేగ్,కాట్రగడ్డ సత్య నారాయణ, రత్న బాబు, కృష్ణ, రాంబాబు, గళ్ళ అంజనేయులు, తమన్నా శ్రీను, గ్రామస్తులు కొలుసు ప్రేమ్, తాతమూరి రామకృష్ణ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు...

# ప్రాణం పోసే వైద్యురాలి ప్రాణం తీయడం సిగ్గుచేటు



**మైలవరం, ఆగస్టు 17: (ఆంధ్రపత్రిక):** మైలవరం ప్రభుత్వ ఆస్పటల్ మరియు మదర్ థెరీసా చారిటబుల్,ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మైలవరం బ్రాంచ్, హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో కలకత్తా ఆర్.జి.కర్ మెడికల్ కలేజ్ లో మెడికల్ విద్యార్ధిని డాక్టర్ మౌమితదెబ్నాబ్ పై జరిగిన హత్యను ఖండిస్తూ ప్రభుత్వ ఆస్పటల్ నుండి భారీ ర్యాలీ మరియు మానవహారం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం మైలవరం ప్రభుత్వ ఆస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ జయప్రకాష్ మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ ఆధ్వర్యంలో జరుగగా మైలవరం బ్రాంచ్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారు,ప్రవేటు డాక్టర్లు,వివిధ స్వచ్ఛంద సంస్థలు, హ్యూమన్ రైట్స్, గవర్నమెంటు కాలేజ్ విద్యార్థులు, ఆశావర్కర్లు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ జయప్రకాశ్ మట్లాడుతూ వైద్య వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరికీ సరైన ప్రొటెక్షన్ ఇవ్వాలని, రాత్రిడ్యూటీలో ఉన్న మహిళా వైద్యుల పరస్థితి ఇబ్బందికరంగా ఉందని,డాక్టర్ మౌమితకి వెంటనే న్యాయం జరగాలని అన్నారు. మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో తల్లిదండ్రులు ఆడపిల్లలకు నేర్పినట్లే చిన వయస్సు నుండే మగపిల్లలు కూడా సమజంలో ఆడపిల్లల పట్ల ఎలా ప్రవర్తించాలో నేర్పాలి.తల్లి ముఖ్యంగా భాద్యత తీసుకోవాలని,డ్రగ్స్ అండ్ సెక్స్ రాకెట్ రహిత సమాజంలో మార్పు రావాలన్నారు.ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ పాస్ట్ కోర్టులు ద్వారా వెంటనే న్యాయం జరిగేలా చట్టాలు మార్పురావాలని డిమాండ్ చేసారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కి వినతి పత్రాన్ని అందిచారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం ఆస్పటల్ మహిళా వైద్యులు డాక్టర్ నిహిత, డా.అమర్,డాక్టర్ సూర్య, సిబ్బంది,ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ నిమ్మగడ్డ పూర్ణచంద్రరావు, కార్యదర్శి డా సాగం దినేష్ రెడ్డి,డా.బి శిరీష,డా ఇందిరా సతీష్ బాబు,డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు. వైద్యులు, సిఐటియు కార్యదర్శి చాట్ల సుధాకర్, బొడ్డపాటి దాసు,ఇంటర్ గవర్నమెంట్ కాలేజ్ అధ్యాపకులు రాధాకృష్ణ, సిబ్బంది విద్యార్ధులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న తిరువూరు ఆర్యవైశ్యులు



**తిరువూరు ఆగస్టు 17(ఆంధ్రపత్రిక) : తిరువూరు** పట్టణ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో రాజుపేట లోశ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహ స్థలం విషయమై గతంలో ఆ స్థలము మిట్టపల్లి రంగయ్య గుప్తా శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహాలు మరియు శృతి వనం ఏర్పాటు నిమిత్తం ప్రస్తుతం అక్కడ ఉన్న స్థలాన్ని కేటాయించారని ఆక్రమణకు గురైందని అది తొలగించి ఆ స్థలంలో పొట్టి శ్రీరాములు విగ్రహం, గాంధీ విగ్రహ ఏర్పాటు చేయుటకు శాఖ పరమైన ఆదేశాలను కోరుతూ తిరువురు పట్టణ ఆర్యవైశ్యులు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కు శనివారం వినతిపత్రం అందజేశారు.ఆర్యవైశ్య వినతిపై ఎమ్మెల్యే తక్షణ స్పందనగా తగిన న్యాయం చేస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ నాళ్లా సురేంద్ర తిరువూరు నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు గుడిమెట్ల వెంకట రామారావు మిట్టపల్లి రంగనాథ గుప్తా స్థల దాత ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు గుడిమెట్ల మురళి, ఇతర ఆర్య వైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## తిరువూరులో ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**తిరువూరు ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్క రించుకొని శనివారం తిరువూరులో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిం చారు. యూనియన్ నాయకులు. సభ్యు లు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తిరువూరు సిఐకె.గిరిబాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రాలలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేసి తమ హక్కులను సాధించుకున్న ఘనత ఏపీయూడబ్ల్యూజే కే దక్కుతుందని పేర్కొన్నారు. తిరువూరు ఏరియా ఆసుపత్రిలో రోగులకు సిఐ కె గిరిబాబు. ఆసుపత్రి సూపరింటెండెంట్ గార్గేయి జర్నలిస్టుల చేతుల మీదగా పండ్లు బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు

## డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య



**జగ్గయ్యపేట ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** జగ్గయ్యపేట పట్టణంలోని 31 వ వార్డు శాంతినగర్‌లో 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు వార్డు కౌన్సిలర్స్ మరియు స్థానిక నాయకులతో కలిసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసిన శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వార్డు కౌన్సిలర్స్, నాయకులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి కోడింగ్ హాకతాన్

**ఆగిరిపల్లి ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** ఆగిరిపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఎన్.ఆర్.ఐ. ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సి.యస్.ఇ. విభాగం ఆధ్వార్యంలో మరియు కోడ్ గ్నాన్ డెస్టినేషన్ ఐ.టి. సొల్యూషన్స్ సౌజన్యంతో రెండు రోజుల జాతీయస్థాయి కోడింగ్ కాంపటేషన్స్ అయినటువంటి హాకతాన్ 4.0 సెప్టెంబర్ 20, 21వ తేదీన కళాశాల అవరణలో నిర్వహించబోతున్నట్లు కళాశాల ఛైర్మన్ ఆర్. వెంట్రావు తెలియజేసారు.రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా జాతీయ స్థాయిలో ఇంజనీరింగ్ మరియు డిగ్రీ విద్యార్థులు బృందాలుగా ఏర్పడి ఆర్టిఫిషియల్ ఇంటిలిజన్స్, డేటా సైన్స్, ఐ.ఓ.టి. మరియు వేస్ట్ మానేజ్మెంట్స్ వంటి అంశాలపై కోడింగ్ చేసి సమాజంలో ఉన్న సమస్యలకు పరిష్కారం అన్వేషించవచ్చునని ప్రిన్సిపాల్ సి భాస్కర్ తెలియజేశారు. ఈ కోడింగ్ హక తాన్ లో పాల్గొన్న విద్యార్థులకు తగిన బహుమతులు ఉంటాయని వి సురేంద్రబాబు తెలియజేశారు

## వత్సవాయి మండలం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పిక్కి ఉమామహేశ్వరరావు




## తండాలను పర్యటించి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

**తిరువూరు ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** విస్సన్నపేట మండలం చంద్రుపట్ల కొర్ర తండాలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావు శనివారం పర్యటించారు. తండా వాసులు తమ సమస్యలను చెప్పుకోవడా నికి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు స్వగృహానికి వస్తే నేనే సమస్య ఉన్న చోటకు వస్తానని గతంలో చెప్పారు. చెప్పి న మాట ప్రకారం తండాకు వెళ్లడంతో





తండావాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. తండావాసుల సమస్యలను ఓపిగ్గా వింటూ తండాలో,ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ చుట్టుపక్కల తండాల్లో ఏ ఏ అవసరాలు ఉన్నాయో లిస్ట్ తయారుచేసి తన దృష్టికి తీసుకురావాలని వారానికి ఒకసారి తండాలో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు అలాగే తిరువూరులో ఉచిత అంబేద్కర్ స్టడీ సర్కిల్ కు తండావాసుల పిల్లలను పంపించాలని ఈ ఐదేళ్లలో తిరువూరు నియోజకవర్గంలోని తండాల నుంచి 50 నుంచి 100మంది యువత ఎస్సైగా కానిస్టేబుల్ గా ఎంపిక కావాలని ఆకాంక్షించారు.ఒక విశాలవంతమైన స్థలాన్ని చూడాలని అక్కడ సేవాలాల్,అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తానని తండావాసులకు హామీ ఇచ్చారు.

## శాంతి కళ్యాణం





**ఆగిరిపల్లి ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** ఆగిరిపల్లి స్థానిక శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మి నరసింహ స్వామి వార్ల పవిత్రోత్సవముల ఆఖరి రోజు లో భాగంగా ఈరోజు స్వామివార్లకు విశేష అర్చన, నిత్య హెూమము, సుదర్శన మూల మంత్ర హెూమము, పవిత్రముల విసర్జన, మహా పూర్ణాహుతి, శ్రీ భూనిశా సమేత శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామివార్లకు శాంతి కళ్యాణం, దాతలకు ఆశీర్వచనం, పవిత్రముల వితరణ నీరాజనం మంత్రపుష్ప తీర్ధ ప్రసాదం వినియోగం అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగిందని, ఆలయ అర్చకులు వేదాంతం శేషబాబు, గుడిపూడి రామ అనంత కృష్ణ ఇరువురు పూజా కార్యక్రమాలు నిర్వహించారని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి డి సురేష్ బాబు తెలిపారు.

## ఈనెల 24న తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయండి



**ఎ.కొండూరు ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** ఈ నెల 24 న ఎ కొండూరు తహశీల్దార్ కార్యాలయంవద్ద జరిగే ధర్నా ను జయప్రదం చేయండి. సిపిఎంపార్టీ మండల కమిటీ సమావేశం శనివారంఎ. కొండూరు సుందరయ్య భవన్ లో జరిగింది. ఈ సమావేశం లో సిపిఎం పార్టీ ఎన్టీఆర్.జిల్లా కార్యదర్శి కామ్రేడ్ డివి కృష్ణ పాల్గొనిమాట్లాడుతూ ఎ. కొండూరు మండలం లో కిడ్నీ వ్యాధి చాప కింద నీరు లాగా విస్త రిస్తుంది. వ్యాధి భారిన పడి వందలాది మంది చనిపోతున్నారు. అప్పులు చేసి వైద్యం చేయించుకొని భూములు అమ్ముకొంటున్నారని అన్నారు. వ్యాధి ని అరికట్టటానికి చర్యలు తీసుకోవాలని, ఈ ప్రాంతం లో కిడ్నీ హాస్పిటల్ నిర్మించాలి, శుద్ధి చేసిన కృష్ణా జలాలు కుళాయి ద్వారా ప్రతిఇంటింటికి అందించాలని, ఈ లోగా ట్యాంకర్ల ద్వారా ప్రతి రోజు పంపిణీ చేయాలి, క్రియాటిన్ 2 పాయింట్లు దాటిన వారందరికీ నెలకు 5 వేలు పెన్షన్,ఇవ్వాలి. డయాలసిస్ పెషేంట్ లకిరూ 15 వేలు పెన్షన్ ఇవ్వాలి. కిడ్నీ పెషేంట్ లకి అన్ని రకాల మందులు ఉచితంగా అందించాలి. కొత్తగా డయాలసిస్ చేయించు కుంటున్న వారికీ పెన్షన్ వెంటనే మంజూరు చేయాలి. కిడ్నీ వ్యాధి తో మరణించిన కుటుంబాలకు 1 ఎకరం భూమి పంపిణీ చేయాలి. మట్టి ఖర్చులకి రూ25 వేలు ఇవ్వాలి. వ్యాధి గ్రస్తులందరికి పౌష్టికా హారం ఇవ్వాలి, విష జ్వరాలనుండి ప్రజలను కాపాడేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని తదితర డిమాండ్ ల తో ధర్నా జరుగుతుంది.ఈ ధర్నా ను జయప్రదం చేయాలని మండల ప్రాంతప్రజలకు విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమం లో సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేంద్ర ప్రసాద్, సిపిఎం పార్టీ ఎ.కొండూరు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరావు, పానెంఆనందరావు, ఎస్ రామకృష్ణారెడ్డి, బి వెంకటేశ్వరావు, ఎస్ వెంకటేశ్వరావు, వి.నాగరాజు, జ్ఞాన రత్నం, ఏ. రవి తదితరులు పాల్గొన్నారు

## వత్సవాయి గ్రామంలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య కృషి

**వత్సవాయి, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** వత్సవాయి మండలం వత్సవాయి గ్రామంలో త్రాగునీటి సమస్య ఉండటం వలన గ్రామ ప్రజలు శాసనసభ్యులు శ్రీరాం తాతయ్య దృష్టికి తీసుకురాగా ఈరోజు తాతయ్య వత్సవాయి గ్రామం లో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి లింగాల వద్దనున్న కొత్త పైపులైనుకు



గతంలో వత్సవాయి గ్రామానికి ఉన్నటువంటి పాత పైపులైను ను జాయింట్ చేసి గ్రామ ప్రజలకు త్రాగునీరు అందించి నీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు , గ్రామ సర్పంచ్ భూక్య సీతమ్మ మరియు అధికారులు నాయకులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్ గ్రేషియో మంజూరు

### చెక్కు అందజేసిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు



**మైలవరం, (ఇబ్రహీంపట్నం), ఆగస్టు17: (ఆంధ్రపత్రిక) :** బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన ఆర్ధిక సాయాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ శనివారం అందజేశా రు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్ర హీంపట్నం మండలం తుమ్మల పాలెం గ్రామానికి చెందిన లంకె అన్నవరం ఇటీవల కృష్ణానదిలో జరిగిన పడవ ప్రమాదంలో మృతి చెందారు. ఆయన మృతికి సంభందించి రాష్ట్రప్రభుత్వం నుంచి రూ.5లక్షల ఎక్స్ గ్రేషియో మంజూరైంది. దీనికి సంబంధించిన చెక్కును మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యు లకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కృష్ణప్రసాదుకి ప్ర త్యేకంగా కృతజ్ఞతలు తెలియచేశారు. స్థానిక ఎన్డీఏ మహాకూటమి నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు శానిటరీపాడ్‌ల పంపిణీ



**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 17, (ఆంధ్రపత్రిక):** స్థానిక శ్చిమ నియోజకవర్గం నందు ఉన్న పాదుర్తి సుందరమ్మ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు శానిటరీపాడ్స్ పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లితెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్. బేగ్ చేతుల మీదుగా 242 మంది విద్యార్థినులకు సానిటరీ పాడ్స్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శానిటరీ కిట్‌లు స్పాన్సర్ చేసిన బివిడిపి గ్రూప్స్ ఛైర్మన్ బి.ఎన్.వి. రాఘవ్ – రఘువర్ , మాపిల్‌బియర్ కెనడియన్ ప్రీ–స్కూల్ కరస్పాండెంట్ భార్గవి రాఘవ తదితరులు పాల్గొన్నారు. న్యూ స్టార్ మోడరన్ థియేటర్ గ్రూప్ దిలీప్ అండ్ టీమ్, వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం గురుజీ దుర్గాభవాని ,వారి బృందం, డాక్టర్ రబియా బాస్రీ,రాయన అరుణ్‌కుమార్, సుందరమ్మ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు డి.రత్న కుమారి, విద్యాదాత ఫౌండేషన్ చైర్మన్ తమ్మిన రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ డాక్టర్ హత్యాచారంలో నిందితులను కఠినంగా శిక్షించాలి

### వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ డిమాండ్

**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 17, (ఆంధ్రపత్రిక) :** కలకత్తాలోని ప్రభుత్వ వైద్యశాలలో జూనియర్ డాక్టర్ హత్యాచారం సంఘటనలో సామూహిక అత్యాచారానికి తెగబడిన దోషులను కఠినంగా శిక్షించాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ నిర్వహణలోని ఆర్జీకర్ హాస్పిటల్‌లో ఈ సంఘటన జరగడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనలో అత్యాచారానికి తెగబడ్డ నిందితులను వెంటనే అరెస్టు చేసి ఉరితీయాలని డిమాండ్ చేశారు. వైద్యులపై దాడులను, ఇటువంటి దుష్ట




సంఘటనలను యావత్తు దేశ ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని ఆకుల శ్రీనివాస్ కోరారు. వైద్యుల పట్ల ఎవరూ ఎటువంటి దుర్ఘటనలకి పాల్పడకుండా ఉండేలా చట్టంలో కఠినమైన మార్పులు తేవాలని ఆకుల శ్రీనివాస్ కోరారు. ఈ కేసును త్వరితగతిన విచారించి నిందితులకు ఉరిశిక్ష వేసేలా చూడాలని సిబిఐ యంత్రాంగానికి ఆకుల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

## కలకత్తాలో వైద్యురాలి హత్యపై అనురాగ్ హాస్పిటల్ సిబ్బంది నిరసన



**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 17, (ఆంధ్రపత్రిక) :** అత్యంత క్రూరం గా అమానుష పద్ధతిలో కోల్ కత్తా లో జూనియర్ వైద్యురాలును మాన భంగం చేసి హత్య చేసినవారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ 53వ డివిజన్ లో డాక్టర్ మాజేటి మాధవి ఆధ్వర్యంలో అనురాగ్ హాస్పిటల్ సిబ్బంది ధర్నా కార్యక్ర మము నిర్వహించి,తమ నిరసన తెలియచేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న 53వ డివిజన్ కార్పొరేటర్ మహదేవు అప్పాజీరావు మాట్లాడుతు కలకత్తాలో జరిగిన ఈ దుస్సంఘనపై దేశవ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఈ హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేసారు.

## కలకత్తా వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ ఎ.కొండూరు వైద్య సిబ్బంది ర్యాలీ




**ఎ.కొండూరు ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** ఇటీవల కలకత్తాలో వైద్యురాలిపై హత్యాచారాని ఖండిస్తూ నిరసనగా ఎ. కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మరియు కేజీబీవీ విద్యార్థులు కలిసి శనివారం స్థానిక ఆరోగ్య కేంద్రం నుంచి ఎ.కొండూరు సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రాథమిక వైద్యఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు వి స్వాతి, పి దివ్య మాట్లాడుతూ వైద్య వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరికి సరైన భద్రత కల్పించాలని ముఖ్యంగా రాత్రిపూట విధులు నిర్వహించే మహిళ వైద్యు లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు కలకత్తా లో వైద్యురాలిపై హత్యాచారా ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. వెంటనే నిందితులను కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఏఎన్‌ఎం లు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థ అధికారుల్లో జవాబుదారి తనం ఎక్కడ

## కౌన్సిల్ సమావేశంలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్



గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) : గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో అధికారులపై గళం ఎత్తి ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే నసీర్ ప్రశ్నించారు. శనివారం ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటిసారి గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో మేయర్ సమక్షంలో సంజీవ్ నగర్ శివ నాగరాజు కాలనీలో క్రమంగా ఇష్టం వచ్చినట్టు గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్ తన కుటుంబీకుల ఫోటోలతో నిర్మించిన శిలాఫల కాలను అధికారులను తొలగించమని పలుసార్లు ఆదేశిం చిన అధికారాలు పట్టించుకోలేదని ఆ అధికారులపై తక్షణం చర్యలు తీసుకొని వారిని విధుల నుండి తొలగించాలని ఎమ్మెల్యే నసీర్ కోరారు. అలాగే గత ప్రభుత్వంలో అండర్ డ్రైనేజ్ పనులను నిలుపేసారని, మంచినీటి సరఫరా, విద్యుత్ దీపాలను ప్రతి వీధిలో ఏర్పాటు చేయాలని కోరారు. అదనపు విద్యుత్ స్టేషన్లో ఏర్పాటుకు గవర్నమెంట్ భూమిని సేకరించి విద్యుత్ స్టేషన్లు ఏర్పాటు చేసి కరెంట్ కష్టాలను లేకుండా చేయాలన్నారు. అలాగే గత ప్రభుత్వంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు ఇవ్వకుండా ఇచ్చినట్టు చూపించి విత్డ్రా చేసుకుని ఆ డబ్బులు ఎటు పంపించారని అధికారులను ప్రశ్నించారు. గాంధీ పార్క్ అభివృద్ధిలో 3.5 కోట్లకు ఎస్టిమేషన్ తయారుచేసి 8 కోట్లకు పెంచి గాంధీ పార్క్ పనులు పూర్తి చేశారని గాంధీ పార్క్ అభివృద్ధిలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని గత ప్రభుత్వ ఎమ్మెల్యే ముస్తఫా కుటుంబ సభ్యులకు కాంట్రాక్ట్ అప్పగించి పెద్ద ఎత్తున కుంభకోణం చేశాడన్నారు. గత ప్రభుత్వంలో ఎన్ని e-bus bay లు శాంక్షన్ అయినాయో వాటి పనులు ఇప్పటిదాకా ఎందుకు మొదలు పెట్టలేదని ఎమ్మెల్యే నసీర్ ప్రశ్నించారు. స్మశాన వాటిక లలో పెద్ద ఎత్తున అసాంఘిక కార్యకరా పాలు జరుగుతున్నాయని వాటిపై అధికారులు చర్యలు తీసుకుని వాటి అభివృద్ధికి ప్రతి సంవత్సరం నిధులు కేటాయించి వాటి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అలాగే గుంటూరు నగరంలో కుక్కల సమస్య అధికంగా ఉందని దానివల్ల జనాలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వాటికి ఒక సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేసి అక్కడికి తరలించి కుక్కల సమస్యను పరిష్కరించాలని మేయర్ ను మున్సిపల్ కమిషనర్ ను కోరారు. ఆటోనగర్ మంచినీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు.

---

### ప్రెస్ క్లబ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో ఘనంగా ఏపీయూడబ్ల్యూజే

# 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**ముఖ్య అతిధులుగా హాజరైన, తహశీల్దార్ హెస్సేన్, అర్బన్ సీఐ రమేష్ - ఏపీయూడబ్ల్యూజే సేవలు అభినందనీయం - యువ జర్నలిస్టులు ఏపీయూడబ్ల్యూజే పోరాట చరిత్రను అధ్యయం చేయాలి-యూనియన్ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ, కాంగ్రెస్, సీపీఐ నాయకులు**

చిలకలూరిపేట, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక): కలం యోధులకు అండగా నిలిచి వారి సమస్యలపై పోరాటాలు చేసే ఏకైక యూనియన్ ఏపీయూడబ్ల్యూజే అని పలువురు కొనియాడారు. పల్నాడు జిల్లా ఏపీయూడబ్ల్యూజే ఎగ్జిక్యూటివ్ మెంబర్, ప్రెస్ క్లబ్ చిలకలూరిపేట అధ్యక్షులు అడపా అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఏపీడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ముందుగా ఎన్ఆర్టీ సెంటర్లో ఏపీడబ్ల్యూజే జండాను సీపీఐ ఇన్చార్జి కార్యదర్శి నాగభైరు సుబ్బాయమ్మ ముఖ్య అతిధిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనియన్ స్థాపించినప్పటి నుంచి ఇప్పటివరకు జర్నలిస్టుల సమస్యలపై యూనియన్ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర ఉందని తెలిపారు. పాత్రికేయులకు ఏ సమస్య వచ్చిన సరే నేనున్నానంటూ మనకు హామీ ఇచ్చే ఏకైక యూనియన్ ఏపీయుడబ్ల్యూజే అని వివరించారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు.

**సమాజాభివృద్ధిలో విలేకరుల పాత్ర ఎంతో కీలకమం... తహశీల్దార్ హెస్సేన్, అర్బన్సీఐ రమేష్**

అనంతరం ప్రశాంతి వృద్ధుల ఆశ్రమం లో జరిగిన అన్నదాన కార్యక్రమం లో తహసీల్దార్ షేక్ హుస్సేన్. అర్బన్ సీఐ రమేష్ లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలేకర్లు సమాజంలో నిర్మాణాత్మక పాత్ర పోషించాలని కోరారు. సమాజాభివృద్ధిలో విలేకరుల పాత్ర ఎంతో కీలకమని, సమాజంలో ప్రజలను చైతన్యం చేసేది విలేకర్లు అని తెలిపారు. యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మార్కెట్ ప్రాంతం లోని గాంధీ పార్కు లో ప్రెస్ క్లబ్ సభ్యులు తో కలసి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఎం రాధాకృష్ణ, పల్నాడు జిల్లా బీసీ సెల్ తెలుగుదేశం పార్టీ ఉపాధ్య క్షులు గుంజి వీరాంజనేయులు వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి మరియు ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ, ప్రజా శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఏపీయూడబ్ల్యూజే యూనియన్ సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ తనదైన శైలిలో పేదలకు సేవా కార్యక్రమాలను నిర్వహించడం హర్షణీయమన్నారు.

**ప్రతి జర్నలిస్టుకు యూనియన్ అండ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అడపా అశోక్ కుమార్, షేక్ దరియావలి**

ఏపీయూడబ్ల్యూజే ఎగ్జిక్యూటివ్ మెంబర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అడపా అశోక్ కుమార్, కార్యదర్శి షేక్ దరియావలి సభ్యులతో కలసి దింతెనపాడు ప్రభుత్వపాఠశాల విద్యార్థులకు నోట్ బుక్కులు,ప్యాడ్ లు, పెన్సిల్, జామింట్రి బాక్సులు, బిస్కెట్ ప్యాకెట్స్, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టుకు అండగా నిలబడే యూనియన్ ఏపీయూడబ్ల్యూజే అని తెలిపారు. విలేకర్లు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపిన ఘనత యూనియన్కే దక్కుతుందన్నారు. ఎక్కడ ఏ విలేకరిగా సమస్య వచ్చినా యూనియన్ బాసటా నిలిచి న్యాయం జరిగే వరకు పోరాడుతుందన్నారు. యువ జర్నలిస్టులు ఏపీయూడబ్ల్యూజే పోరాట చరిత్రను అధ్యయం చేయాలని, సంఘ నాయకుల పోరాటాలో స్ఫూర్తి పోందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి సాతులూరి కోటేశ్వరరావు( బెంజిమెన్), ఉపాధ్యక్షులు కొచ్చర్ల చందు, జాయింట్ సెక్రెటరీ నాదెండ్ల సుందర్ బాబు, సభ్యులు పెనుమల మనోహర్, కొనికి సాంబశివరావు, కొండపాటిరమేష్, బండారు పెద్ద వీరయ్య, పొన్నూరు శివ, షేక్ కరిముల్లా, షేక్ మహమ్మద్ రఫీ, మహమ్మద్ మాలిక్, సాధిక్, బషీర్, కరుణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

---

# రాజకీయ పార్టీల మధ్య కక్షలకు దళితులను గురి చేయటం తగదు

### ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి





గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) : ఆధిపత్య కుల రాజకీయ పార్టీల తో ఎస్సీ ఎస్టీలకు ఎటువంటి లాభం లేదని, ఇటువంటి పరిస్థితులలో రాజకీయ పార్టీల కక్షలకు కార్పన్యాలకు దళితులను బలి చేయటం తగదని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజసుందర్ బాబు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక అంకమ నగర్ ఇద్వా కార్యాలయం నుంచి వందలాది మంది దళిత బాధితులు జిల్లా ఎస్పీ కార్యాలయం వద్దకి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. జిల్లా ఎస్పీ సతీష్ తో సమావేశం అయిన తర్వాత జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా జరిపారు. ధర్నా శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సామాజికవేత్త డాక్టర్ గోళ్ళ మూడి రాజసుందర్ బాబు మాట్లాడుతూ ఆదిపత్య కులాల వారి పొలాల్లోకి దిగి, సమాజంలో అన్ని వర్గాల వారు తిని జీవించే పంటను పండించి, అదే భూస్వాముల చేతుల్లో దాడులు గురవు తున్నారని సాంఘిక బహిష్కరణ లకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గెలిచినవారు ప్రజలకు స్వీట్లు పంచాలి గాని ఓట్లు వేయలేదని కక్షతో దాడులు సాంఘిక బహిష్కరణలు కుల దూషణలకు పాల్పడటం సరైనది కాదని అది సత్ సాంప్రదాయం కాదని డాక్టర్ గోళ్ళమూడి తీవ్ర ఆందోళన వెలుగుచ్చారు. ఫిరంగి పురం గరుడ చల్లపాలెంలో ఒక్క నెలలోనే నాలుగు సంఘటనలు జరిగితే అత్యాచారాలు జరిగితే ఒక్క సంఘటన మాత్రమే నమోదు చేశారని, వట్టిచెరుకూరు మండలం గారపాడులో ఎనిమిది సంఘటనలు జరిగితే ప్రతి సంఘటనకు మెడికల్ రిపోర్టులు, వుండ్ సర్టిఫికెట్లు ఉన్నా కూడా ఒక్క సంఘటనలో కూడా పోలీసులు కేసులు నమోదు చేయకపోవడం దారుణమని డాక్టర్ గోళ్ళమూడి తీవ్రంగా విమర్శించారు. గారపాడు గ్రామంలో 50 కుటుంబాలు నేటికి కూడా ఇల్లు వదిలి ప్రక్క గ్రామాల్లో నివసిస్తున్నారని ఆ గ్రామ దళితుల యొక్క హక్కులను పోలీసు శాఖ కాపాడలేక పోవటం సరైనది కాదని డాక్టర్ గొల్లమూడి అన్నారు. డాక్టర్ గొల్లమూడి బాధితులతో బాధితులతో కలిసి జిల్లా సతీష్ తో సమావేశమై దాడులను అరికట్టాలని దాడులకు గురైన సంఘటనలో పోలీస్ కేసులు నమోదు చేయాలని, శాంతి చర్యల కు తాము పూర్తిగా సహకరిస్తామని జిల్లా ఎస్పీ కి డాక్టర్ గోళ్ళ మూడి తెలిపారు. ఆగస్టు 2వ తారీఖున హైకోర్టు కూడా జిల్లా కలెక్టర్ ని ఎస్పీ ఆ గ్రామాలకు వెళ్లి విషయాలు తెలుసుకునే చర్యలు తీసుకున్న నివేదికను కోర్టుకు సమర్పించాలని ఆదేశించి ఒదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దాడులకు గురైన ఎస్సీ ఎస్టీల పట్ల చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తమైన ఉద్యమానికి దళితులు నడుం కడతారని డాక్టర్ గొల్లమూడి హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ఆర్డిఓ కి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గారపాడు బాధితులు కూరపాటి కిషోర్, కరుణాచలపాలెం గ్రామ దళిత బాధితులు వేల్పుల మరీ రాణి కొరబండి కేజియా జోత్స్న తదితరులు వందలాదిమంది బాధితులు పాల్గొని పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

---

కలకత్తా అత్యాచార సంఘటనకు నిరసనగా

## సిబార్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో ర్యాలీ

**ప్రాణాలు కాపాడే వైద్యుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని నిరసన ప్రదర్శన**




గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :ఆర్.జి. కార్ మెడికల్ కాలేజ్, కోల్కత్తా నందు జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా సిబార్ దంత వైద్య కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు మరియు అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. కళాశాలలో ప్రారంభమై ర్యాలీ తక్కెళ్ళపాడు గ్రామ పంచాయితీ ఆఫీసు వరకు కొనసాగినది. ర్యాలీ ప్రారంభానికి ముందు విద్యార్థినీ, విద్యార్థులు మాట్లాడుతూ ఇది అమానవీయమైన, కరమైన చర్య అని, దీనిని అందరూ ముక్త కంఠంతో ఖండించాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే చట్టాలకు పదును పెట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. స్వతంత్ర భారత దేశంలో ఇలాంటి సంఘటనలు ఇంకా జరగడం చాలా భాధకర విషయమని స్త్రీని శక్తిగా పూజించే ఈ దేశంలో ఇలాంటి సంఘటనలు జరగడం సిగ్గుచేటని తెలిపారు. ముఖ్యంగా కరోనా వంటి విపత్కర పరిస్థితులలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అనేక మందికి వైద్య సేవలు అందించి ప్రపంచ చరిత్రలోనే ఒక ప్రత్యేక గుర్తింపుతో పనిచేసిన డాక్టర్లపై ఈ రోజు మృగాలు చేసిన సంఘటన సభ్యసమాజం తలదించుకునే స్థాయిలో ఉందని ఇటువంటి సంఘటనలపై ప్రతి ఒక్కరు మానవతా దృక్పథంతో స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డా ఎల్. కృష్ణ ప్రసాద్, డైరెక్టర్ డా టి. కృష్ణ మోహన్, ప్రిన్సిపాల్ డా.ఎబి.వి.రమణా రెడ్డి ఇతర అధ్యాపకులు, స్టూడెంట్ కౌన్సిల్ ప్రతినిధులు మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

### మారుతున్న కాలానికి అనుగుణంగా

## విద్యాబోధన అందించాలి



గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) : గుంటూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉర్దూ పాఠశాలల సముదాయ శిక్షణా కార్యక్రమమును సమగ్ర శిక్ష సహాయ ప్రాజెక్టు అధికారి జి. విజయలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధన చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని, అందువల్ల ఉపాధ్యాయులు డిజిటల్ బోధన పట్ల అవగాహన కలిగి ఉండాలని, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి డిజిటల్ బోధన ద్వారా కృషి చేయాలని అన్నారు. గుంటూరు ఉర్దూ పాఠశాలల ఉపతనిఖీ అధికారి యమ్. డి. ఖాసిం మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ ఈ శిక్షణ ద్వారా తమ బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, విద్యార్థులందరికీ అర్థమయ్యే విధంగా వినూత్న తరహాలో బోధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సిద్దిక్, సెక్రటరీ షాజహాన్, సమగ్ర శిక్ష ఏ.యస్.ఓ జయశంకర్, సి.ఆర్.పి కీర్తి మరియు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కలకత్తా సంఘటనపై పేటలో నిరసన




జగ్గయ్యపేట,ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) : ఆగస్టు 15వ తేదీన కలకత్తాలో జరిగిన ఒక దారుణమైన సంఘటన ,ఒక హాస్పిటల్లో ట్రైనీ డాక్టర్ మౌమిత దెబ్నత్ ని హత్యాచారం చేసి హత్య చేసిన సంఘటనకు నిరసనగా న్యాయం జరగాలని కోరుతూ వాగ్దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ జగ్గయ్యపేట ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన మార్గాల లో నిరసన కార్యక్రమం ర్యాలీ నిర్వహించటము జరిగింది .ఈ కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థినిలు ,ట్యూటర్స్ ప్రభుత్వ డాక్టర్ అనిల్ కుమార్ నర్సింగ్ సిబ్బంది వాగ్దేవి నర్సింగ్ కళాశాల డైరెక్టర్ బుస్స సురేష్ ఫ్యాకల్టీ ఈశ్వరి బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినిలు ఎం పి హెచ్ డబ్ల్యు విద్యార్థులు పాల్గొని ఈ ట్రైనింగ్ డాక్టర్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఈ కార్యక్రమం జరిగింది. మౌనంగా ఉండకుండా అందరూ మాట్లాడండి న్యాయం జరిగే వరకూ పోరాడండి.

---

### గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్లో ప్రజా సమస్యలపై

# గళం ఎత్తిన గళ్ళా మాధవి

**నియోజకవర్గంలో పారిశుద్ధ్య నిర్వహణ తీరు పై మండిపాటు**

**మంచినీటి సరఫరా, వీధి దీపాల విషయంలో అధికారులను నిలదీత**



గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) : గుంటూరు కార్పొరేషన్ లో కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి పలు ప్రజా సమస్యలపై గళమెత్తి అధికారుల తీరును నిరసించారు. ప్రధానంగా నియోజకవర్గంలో పారిశుద్ధ్య నిర్వహణ తీరుపై అసహనం వ్యక్తం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ మున్సిపల్ కార్పొరేషన్ లలో ప్రజా సమస్యలపై మరియు అభివృద్ధి పై చర్చలు జరుగుతుంటే గుంటూరు కార్పొరేషన్ లో మాత్రం పారిశుద్ధ్యం గురించి ప్రస్తావన చేయటం బాధాకరంగా ఉన్నదని, అధికారుల తీరు మాత్రం ఆక్షేపణీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ కి రాజధాని అయిన అమరావతిలో భాగయ్యిన గుంటూరు నగరంలో చెత్త, పారిశుద్ధ్య నిర్వహణ మాత్రం దారుణం. కనీసం ఇంటి వద్ద చెత్త కూడా ఎత్తలేని పరిస్థితిలో మున్సిపల్ అధికారులు ఉన్నారు. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి నియోజకవర్గ పరిధిలో పర్యటిస్తున్నాను ప్రధానంగా నాకు చెత్త సమస్య అధికంగా కనబడింది.

దీని గురించి అధికారులను వద్ద ప్రస్తావన చేయగా సరైన సిబ్బంది, యంత్రాలు లేవని సాకుగా చెప్పారు తప్ప దానికి సరైన పరిష్కార దిశగా అధికారులు ఎందుకు ముందడుగు వేయలేదు. నియోజకవర్గంలో మంచినీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని అదేవిధంగా పలు సమస్యల గురించి అధికారులను పరిష్కరించమని కోరితే “చేస్తాము చూస్తాము” అని సమాధానం ఇస్తున్నారు. తప్ప ఎప్పటి లోగా చేస్తామని చెప్పటం లేదు చిన్న సమస్యల పరిష్కారం కోసం ఎన్ని వినతి పత్రాలు ఇచ్చినా కూడా ప్రయోజనాలు లేవు. అనేక డివిజన్లో చెత్త వేయడానికి కూడా బిన్లు లేవు. అలాగే కాలువలో పేరుకుపోయిన సిల్ట్ తొలగించడానికి అనేక కారణాలు చెబుతు న్నారు. ఇలా ప్రతి సమస్యకు కారణాలు చెబితే పరిష్కారం దొరకదు కాబట్టి ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన సిబ్బందిని నియమించుకొని పారిశుధ్యన్ని మెరుగుపరచాలని కోరుతున్నాను. అదేవిధంగా పలు డివిజన్లలో స్ట్రీట్ లైట్ ల విషయంలో కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. వీధి దీపాలను పాడైపోయిన వాటిలో కొత్తవి పెట్టమని కోరిన కూడా అవి కూడా చేయలేని నిస్సహాయ స్థితిలో అధికారులు ఉన్నా రు. నగరంలో ఇళ్ల మధ్యన మున్సిపల్, ప్రైవేట్ స్థలాల్లో విపరీతంగా పిచ్చి మొక్కలు పెరిగి, చిట్టడ వులను తలపిస్తున్నాయి. ఇందులో విషసర్పాలు చేరి ప్రజలకు హాని గురిచేస్తున్నాయి. అని నా దృష్టికి ప్రజలు తీసుకురావడం జరిగింది. నా దృష్టికి వచ్చిన కొన్నిచోట్ల వీటి మీద చర్యలు తీసుకోవడం జరిగింది. కావున మీరు ప్రైవేట్ స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వాలి కఠిన చర్యలు తీసుకోవాలి. లేకపోతే ఇవి డంపింగ్ యార్డ్ మాదిరిగా తయారవుతాయని మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

### 24న విజ్ఞాన్స్ యూనివర్సిటీ

# 12వ స్నాతకోత్సవం

**ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహా**

**ముగ్గురికి గౌరవ డాక్టరేట్లు ప్రధానం 1526 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు**




గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) : ఆగస్టు 24వ తేదీ శనివారం విజ్ఞాన్స్ యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ శనివారం తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ 24న జరిగే 12వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ, గౌరవ అతిథులుగా హైదరాబాద్లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ఫౌండర్ అండ్ చైర్మన్ దొంతినేని శేషగిరి రావు, హైదరాబాద్లోని లోకేష్ మెషీన్స్ ఫౌండర్ ముల్లపూడి లోకేశ్వర రావు, ఇండియన్ కంపోజర్ అండ్ సింగర్ సాలూరి కోటేశ్వర రావు (కోటి) హాజరవుతున్నారని పేర్కొన్నారు. 12వ స్నాతకోత్సవం సందర్భంగా తమ యూనివర్సిటీ 1526 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనుందని వైస్ చాన్సలర్ తెలిపారు. 12వ స్నాతకోత్సవం సందర్భంగా 26 మంది విద్యార్థులకు బ్రాంచ్ల వారీగా అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికి బంగారు పతకాలు అందజేస్తామన్నారు. వీటితో పాటు బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ మెడల్, ఎండోమెంట్ అవార్డులు, బహుముఖ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి చైర్మన్ బంగారు పతకం, బెస్ట్ ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ, సోషల్ ఎంగేజ్మెంట్ అవార్డు, బెస్ట్ లీడర్ మెడల్స్ ఉంటాయన్నారు. వివిధ విభాగాలలో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులకు కూడా ప్రత్యేక బహుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. 12 స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వివిధ రంగాలలో వారు అందించిన సేవలు, కృషికు గాను ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లను ప్రధానం చేయనుందని తెలిపారు. హైదరాబాద్లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ఫౌండర్ అండ్ చైర్మన్ దొంతినేని శేషగిరి రావు, హైదరాబాద్లోని లోకేష్ మెషీన్స్ ఫౌండర్ ముల్లపూడి లోకేశ్వర రావు, ఇండియన్ కంపోజర్ అండ్ సింగర్ సాలూరి కోటేశ్వర రావు (కోటి)లు గౌరవ డాక్టరేట్లు అందుకోనున్నారు. 24 న జరిగే స్నాతకోత్సవ కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్, చాన్సలర్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, అకడమిక్ కౌన్సిల్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొంటారని పేర్కొన్నారు.

## బి ఎల్ వోలు ఇంటింటి సర్వే నిర్వహించాలి

**తహసిల్దార్ జి శ్రీ చరణ్**



అద్దంకి,ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) : శనివారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మండల స్థాయి బూత్ లెవెల్ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సమీక్ష సమావేశాన్ని ఉద్దేశించి తహసిల్దార్ శ్రీ చరణ్ మాట్లాడుతూ ప్రతి బూత్ లెవెల్ అధికారి ఆయా గ్రామాలలో ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు ఓటర్ల జాబితాలోని నూతన పేర్ల నమోదు తొలగింపులు మార్పులు చేర్పులను ప్రజల నుంచి ఫామ్6 7 8 లోని వినతల ద్వారానే జరగాలన్నారు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమీక్ష సమావేశాలు నిర్వహించాలని అందులో భాగంగా నిర్వహించామని ఇప్పటికి వచ్చిన వినతలను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఈనెల 20వ తేదీ నుండి ఇంటింటి సర్వే ప్రారంభించాలని అన్నారు.

ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ బి వి భాస్కర్ రెడ్డి రెవెన్యూ అధికారి కె.వి.ఆర్ శంకర్ సీనియర్ అధికారి రమణ వీఆర్వోలు బి ఎల్ ఓ లు తదితరులు పాల్గొన్నారు .

# రాష్ట్రానికి మరిన్ని ఎయిర్ పోర్టులు తీసుకొస్తాం..

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:**ఆంధ్రప్రదేశ్‌లో విమానయాన సేవలపై పౌర విమానయాన శాఖ దృష్టిసారించింది. రాష్ట్రానికి మరిన్ని ఎయిర్ పోర్టులు తీసుకొస్తామని కేంద్రమంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. కేంద్రమంత్రి పదవి చేపట్టిన తర్వాత తొలిసారి టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో సమావేశం అయ్యారు. మంత్రి తన కార్యాలయానికి చంద్రబాబును సాదరంగా ఆహ్వానించారు. తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో విమానయాన రంగం కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఏపీలో విమానయాన రంగ అభివృద్ధిపై విమానయాన శాఖ అధికారులతో చంద్రబాబు, రామ్మోహన్ నాయుడు సుధీర్గంగా సమీక్ష నిర్వహించారు. దాదాపు రెండున్నర గంటలపాటు ఆ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో నూతన ఎయిర్ పోర్టుల నిర్మాణం గురించి అధికారులతో చర్చించారు. ఎయిర్ పోర్టుల అభివృద్ధి, హెలికాప్టర్, డ్రోన్ సేవలు, సి ప్లెయిన్, విమాన సేవల పెంపు అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. విమానయాన రంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చంద్రబాబు పలు సూచనలు చేశారు. ఏపీలో 14 ఎయిర్ పోర్టులను అభివృద్ధి చేస్తాం. నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉండడానికి ప్రధాన కారణం చంద్రబాబు. కృతజ్ఞతలు తెలియజేస్తూ నా కార్యాలయానికి ఆహ్వానించా. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఏడు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు జరుగుతున్నాయి. విశాఖపట్టణం, విజయవాడ, రాజమండ్రి, తిరుపతి, కర్నూలు, కడప విమానాశ్రయాల్లో రాకపోకలు సాగుతున్నాయి. టెర్మినల్ భవనాల విషయంలో



అవసరాల మేర ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై చర్చించాం. కొత్త విమానాశ్రయాల ఏర్పాటు గురించి మాట్లాడాను. రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయిస్తే విమానయాన శాఖ తరపు నుంచి వెంటనే చర్యలు చేపడతాం అని' కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. కుప్పం, దగదర్తి (నెల్లూరు), నాగార్జున సాగర్, తునిలో కొత్త విమానాశ్రయాల అభివృద్ధి కోసం పలు ప్రతిపాదనలు ఉన్నాయి. తాడేపల్లిగూడెంలో ఉన్న ఎయిర్ స్ట్రిప్ డెవలప్ చేసే అంశం గురించి ఆలోచన చేస్తాం. సీఎం చంద్రబాబు నుంచి వచ్చిన ప్రతిపాదనలకు మా శాఖ నుంచి పూర్తిస్థాయిలో సహకారం ఉంటుంది. పుట్టపర్తిలో ఉన్న ప్రైవేటు విమానాశ్రయాన్ని పబ్లిక్ విమానాశ్రయంగా మార్చే అంశం గురించి చర్చించాం. తూర్పు తీర ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్‌ను లాజిస్టిక్ హబ్‌గా మార్చాలన్నది చంద్రబాబు నాయుడు విజన్. అందుకు విమానాశ్రయాల పాత్ర ప్రధానంగా ఉంటుంది. 30 ఏళ్ల తర్వాత ఏర్పడబోయే పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఇప్పుడే ఆలోచన చేశాం. ఒక్కో విమానాశ్రయానికి వందల ఎకరాల భూమి కావాలి. భవిష్యత్తులో భూములు లభ్యత తక్కువగా ఉంటుంది. భవిష్యత్తు అవసరాల మేరకు కొత్త విమానాశ్రయాల నిర్మాణం చేపట్టాలన్నది సీఎం చంద్రబాబు ఆలోచన. చిన్న విమానాశ్రయాల కనెక్టివిటీ పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వంలో ఉడాన్ పథకం ఉంది. ఆ పథకం ఉపయోగించుకుని రాష్ట్రంలో విమానాశ్రయాల కనెక్టివిటీని మరింత పెంచాలని చూస్తున్నాం. సి-ప్లేన్ పాలసీ ప్రకారం ప్రకాశం బ్యారేజ్ బ్యాక్ వాటర్‌లో వాటర్ ఏరో డ్రోమ్ ఏర్పాటు గురించి చర్చించాం. నాగార్జునసాగర్, కోస్తా తీరంలో చాలా చోట్ల సీ ప్లేన్ సామర్థ్యాన్ని పెంపొందిస్తాం. ప్రతి జిల్లాకు ఒక హెలిపోర్టు ఏర్పాటు చేసి పర్యాటకం, మెడికల్ ఎమర్జెన్సీ సందర్భాల్లో ఆ సేవలు వినియోగించుకునేలా ప్రతిపాదనలు ఉన్నాయి అని' కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వివరించారు

# ఐక్యతతో కొత్త దిశలో పయనిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితిలో, గ్లోబల్ సౌత్ దేశాలు ఈ ప్రాథమిక సమస్యలపై తీవ్రంగా దృష్టి పెట్టాలన్నారు ప్రధాని మోదీ. మూడవ వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్ సమ్మిట్ ప్రారంభ సెషన్‌ను ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడారు. అయా దేశాల మధ్య పరస్పర వాణిజ్యం, సమ్మిళిత వృద్ధి అవసరమన్నారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను, సామర్థ్యం మేరకు ముందుకు తీసుకెళ్లడానికి గ్లోబల్ సౌత్‌తో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నామన్నారు ప్రధాని. సోషల్ ఇంపాక్ట్ ఫండ్‌కు భారతదేశం 25 మిలియన్ డాలర్ల తొలి విరాళాన్ని ఇస్తుందని ఆయన చెప్పారు. ''గ్లోబల్ సౌత్‌లోని దేశాలు ఐక్యంగా ఉండాలని, ముఖ్యమైన సమస్యలపై ఏకతాటిపై నిలవాల్సిన అవసరం నేటి కాలానికి ఉందని ప్రధాని మోదీ అన్నారు. ఈ దేశాలు పరస్పరం శక్తిగా మారాలి. ఒకరి అనుభవాల నుండి మరొకరు నేర్చుకుందాం. మన సామర్థ్యాలను పంచుకుందాం. ఇండియా స్టాక్ లేదా డిజిటల్ ఐడీ, చెల్లింపులు వంటి వాటిని పంచుకునేందుకు గ్లోబల్ సౌత్‌కు చెందిన 12 మంది భాగస్వాములతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు'' ప్రధాని మోదీ తెలిపారు. ఈ సమయంలో, ఉగ్రవాదం, తీవ్రవాదం మరియు వేర్పాటువాద సవాళ్లను కూడా ప్రధాని వివరంగా ప్రస్తావించారు. అవన్నీ మనకు ముప్పుగా మిగిలిపోతున్నాయని అన్నారు. ఐక్యత ద్వారానే వీటిని ఎదుర్కోగలమన్న ఆయన, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించేందుకు వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్ సదస్సు వేదికగా మారిందన్నారు. జీ20కి భారత నాయకత్వంలో, గ్లోబల్ సౌత్ అంచనాలు, ఆకాంక్షలు, ప్రాధాన్యతల ఆధారంగా ఒక ఎజెండాను రూపొందించామని ప్రధాని మోదీ అన్నారు. అభివృద్ధి-ఆధారిత దృక్పథం నుండి భారతదేశం జీ20ని ముందుకు తీసుకువెళ్లింది. గ్లోబల్ సౌత్ బలం దాని ఐక్యతలో ఉంది. ఈ ఐక్యత, బలంతో కొత్త దిశలో పయనిస్తామని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తంచేశారు. కోవిడ్-19 ప్రభావం నుంచి ప్రపంచం ఇంకా పూర్తిగా బయటపడలేదని ప్రధాని మోదీ గుర్తు చేశారు. మరోవైపు, యుద్ధాలు మన అభివృద్ధి ప్రయాణాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. సవాళ్లను సృష్టించాయి. అలాగే వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కోవడమే ఆందోళన చెందుతున్నామని ఆయన అన్నారు.

# ఆర్థిక అంశాలపైనే చర్చ

న్యూఢిల్లీ, ఆగస్టు 17: ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రధానితో చర్చించినట్టు సమాచారం. ముఖ్యంగా రుణాలు రీ షెడ్యూల్ చేయాలని కోరినట్లు తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును భరిస్తామని కేంద్రం హామీ ఇచ్చిన నేపథ్యంలో.. ఆయా నిధుల మంజూరుపై ప్రధానితో మాట్లాడినట్లు తెలుస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం చేయనున్నట్లు ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఈ నిధుల విడుదలపైనా చంద్రబాబు వాకబు చేసినట్లు సమాచారం. అంతేకాకుండా వెనకబడిన జిల్లాల జాబితాలో ఉన్న 8 జిల్లాలకు ఆర్థికసాయం కింద నిధులు విడుదల చేయాలని ప్రధాని మోదీని చంద్రబాబు కోరినట్లు తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్టు విషయంలో వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకుని నిధులు విడుదల చేయాలని ప్రధానమంత్రి మోదీని చంద్రబాబు కోరినట్లుగా తెలుస్తోంది. ప్రధానితో ఆయన సుదీర్ఘంగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరిపారు. ముఖ్యంగా రాష్ట్రానికి రుణ పరిమితి పెంచడంతో పాటు రాజధానికి ఇప్పిస్తామన్న పదిహేను వేల కోట్ల నిధుల గురించి.. ఇతర గ్రాంట్ల గురించి చర్చించినట్లుగా తెలుస్తోంది. జగన్మోహన్ రెడ్డి హయాంలో చేసిన అప్పులను రీషెడ్యూల్ చేయాలని ఏపీ ప్రభుత్వం ఇటీవలి కాలంలో ప్రధానంగా కోరుతోంది. ఈ అంశంపైనా ప్రధాని మోదీకి నివేదిక ఇచ్చినట్లుగా చెబుతున్నారు. గత ఐదేళ్ల కాలంలో జరిగిన ఆర్థిక విధ్వంసం వల్ల ఏపీ ఆర్థిక పరిస్థితి అత్యంత ఘోరంగా మారింది. ఈ క్రమంలో ఆర్థిక వ్యవస్థను దారిలో పెట్టుకోవాలంటే కేంద్ర సాయం అవసరమని భావిస్తున్నారు. ఈ క్రమంలో పలు



ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ముందు పెట్టింది. కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ కీలక పాత్ర పోషిస్తోంది . బీజేపీకి పూర్తి మెజార్టీ లేకపోవడంతో టీడీపీ మద్దతు కీలకం. అందుకే టీడీపీ కీలక ప్రయోజనాలను సాధించుకుంటోందన్న అభిప్రాయం జాతీయ రాజకీయాల్లో ఉంది. చంద్రబాబు పర్యటనలో రాజకీయ చర్చలు కూడా చోటు చేసుకున్నాయని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవలి కాలంలో బయటపడుతున్న స్కాములు.. జగన్ పాలనలో చేసిన దోపిడీ గురించి పూర్తి స్థాయిలో ప్రధాని మోదీతో చంద్రబాబు చర్చించినట్లుగా చెబుతున్నారు. లిక్కర్ స్కామ్‌లో సీఐడీ దర్యాప్తుతో పాటు వేల కోట్ల నగదు లావాదేవీలు జరిగినందున ఈడీ విచారణకు సిఫారసు చేస్తామని స్వయంగా అసెంబ్లీలో ప్రకటించారు. ఈ విషయాన్ని మోదీ దృష్టికి తీసుకెళ్లినట్లుగా చెబుతున్నారు. అలాగే బయటపడిన అనేక స్కాముల విషయంలో.. తీసుకోవాల్సిన చర్యల విషయంలోనూ.. కేంద్ర దర్యాప్తు సంస్థల జోక్యం అవసరమని అడిగినట్లుగా భావిస్తున్నారు. మరో వైపు జాతీయ రాజకీయాలపైనా చర్చించినట్లుగా తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాల రాజకీయంలో ఇటీవల కీలక మార్పులు వస్తున్నాయి. కొన్ని పార్టీల విలీనం.. మరికొన్ని పార్టీల పొత్తుల వ్యవహారాలు హాట్ టాపిక్ అవుతున్నాయి. అలాగే రాజ్యసభలో ఉపఎన్నికల తర్వాత ఎన్డీఏ మెజార్టీ సాధించనుంది. ఆ క్రమంలో ఎన్డీఏ అనుసరించాల్సిన వ్యూహంపైనా ప్రధాని మోదీతో చంద్రబాబు చర్చించినట్లుగా తెలుస్తోంది. చంద్రబాబు నాయు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానితో పాటు, పలువురు కేంద్ర మంత్రులను శనివారం సాయంత్రం కలిశారు. ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన చంద్రబాబు మోదీని సన్మానించి రాష్ట్రంలో చేపట్టిన పనుల పురోగతిని, అందుకు కేంద్రం నుంచి కావాల్సిన సహాయాన్ని కోరారు. ఈ సందర్భంగా ప్రధానికి వినతి పత్రం అందజేశారు.రాజధాని అమరావతి నిర్మాణం పూర్తికి, పోలవరం ప్రాజెక్టుకు ఇదివరకే ప్రకటించిన విధంగా ఆర్థిక సహాయాన్ని వెంటనే విడుదల చేయాలని చంద్రబాబు కోరారు. దాదాపు గంటపాటు ఇద్దరి మధ్య చర్చలు జరిగినట్లు సమాచారం. అనంతరం చంద్రబాబు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. వీరి మధ్య 40 నిమిషాల పాటు సమావేశం కాగా రాష్ట్రానికి అభివృద్ధి, సంక్షేమానికి భారీగా నిధులు కేటాయించాలని కోరారు. అక్కడే ఉన్న ఉక్కు, గనుల శాఖ మంత్రి కుమారస్వామితో చంద్రబాబు సమావేశమయ్యారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో అమరావతికి ప్రత్యేక సహాయంగా రూ.15 వేల కోట్లను ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# గాజాపై భీకర దాడులు

**న్యూఢిల్లీ,ఆగస్టు 17:** కాల్పుల విరమణ ఒప్పందంపై ఇజ్రాయెల్, హమాస్‌ల మధ్య చర్చలు అసంపూర్తిగా ముగిసిన వేళ.. గాజాపై మరోసారి భీకర దాడులు జరిగాయి. జవైదా పట్టణంపై టెల్ అవీవ్ జరిపిన వైమానిక దాడిలో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి చెందారు. అల్- అక్సా ఆసుపత్రి ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ఈ దాడిలో వ్యాపారి సమీ జవాద్ అల్-ఎజ్జా, అతడి ఇద్దరు భార్యలు, 11 మంది పిల్లలు, వారి అమ్మమ్మ, మరో ముగ్గురు బంధువులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. లెబనాన్‌లోని నాబాలీహ్ ప్రావిన్స్‌లో జరిపిన దాడిలో ఓ మహిళ, ఆమె ఇద్దరు పిల్లలు సహా 10 మంది మరణించారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. హెజ్‌బొల్లాకు చెందిన ఆయుధ నిల్వ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిపినట్లు ఇజ్రాయెల్ ప్రతినిధి తెలిపారు. తీరప్రాంత టైర్ నగరంలో జరిపిన ప్రత్యేక దాడిలో ఓ హెజ్‌బొల్లా కమాండర్ను హతమార్చినట్లు వెల్లడించారు. అయితే.. అతడి వివరాలు వెల్లడి కాలేదు. సెంట్రల్ గాజాలోని మాఘాజీ శరణార్థి శిబిరం, పరిసర ప్రాంతాల్లోని పాలస్తీనీయన్లు వెంటనే అక్కడినుంచి సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లాలని ఆదేశించారు.

# ఉత్తరాంధ్రలో వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

నంద్యాల జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. సోమవారం.. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ప్రకాశం, నంద్యాల, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, నెల్లూరు, కర్నూలు, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు చెట్ల కింద, పోల్స్, టవర్స్ కింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించారు.

# పార్టీలోకి చేరిన వారు మరల టికెట్ తెచ్చుకోగలరా?

**-విలేకరుల సమావేశంలో**
**వైసిపి నాయకులు**

**హిందూపురం, ఆగస్టు 18 (ఆంధ్రపత్రిక):** అడ్డదారిన అధికారం కోసం అభివృద్ధికి వచ్చే నిధులను దిగమింగడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతలో పశువులను కొన్నట్లు నాడు ఎమ్మెల్యేలను కొంటే.. బామ్మర్ది హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చైర్పర్సన్తో పాటు కౌన్సిలర్లను కొన్నారని వైసిపి నాయకులు ఆరోపించారు. రెండు రోజుల క్రితం హిందూపురం మున్సిపల్ చై ర్ పర్సన్‌తో సహా 9 మంది కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. దీనిపై శనివారం వైసిపి కార్యలయంలో వైసిపి నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు హిందూపురం పురపాలక సంఘ చైర్మేన్ పదవి జనరల్ క్యాటగిరిలో ఉన్నప్పటికి నాడు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి బిసిలకు ప్రాధన్యత ఇవ్వాలని ఒక వాల్మికి బిసి మహిళకు కేటాయించి అందలం ఎక్కించారు. టిడిపిలో చేరి బిసి వాల్మికులను నమ్మక



ద్రోహం చేసిందని చైర్పర్సన్ ఇంద్రజను ఉద్దేశించి అన్నారు. కేవలం కరువు నిధులతో పాటు డీ సిల్టేషన్ కు వచ్చిన అడ్డంగా దోచుకోవడంతో పాటు అభివృద్ధి కోసం వచ్చే నిధులను దిగమింగడానికి చైర్పర్సన్తో పాటు కౌన్సిలర్లను సంతలో పశువులను కొన్నట్లు బాలకృష్ణ కొన్నారన్నారు. ఈ సాంప్రదాయం టిడిపి నుంచే ప్రారంభం అయిందన్నారు. వేసవి ముగిసిన అనంతరం వచ్చే వేసవి పేరుతో రూ.3.50 కోట్లతో మోటార్ల రిపేరితో పేరుతో ఎస్టిమేషన్ వేశారు. దీనిని కౌన్సిల్ అడ్డు కోవడం జరిగింది. దీంతో పాటు మురుగు కాలువల శుభ్రం చేయడానికి రూ.1.13 కోట్లు నిధులు వచ్చాయి. ఈ నిధులను పక్కదారి పట్టకుండా చూస్తారని, పురపాలక సంఘంలో వైసిపి అధికారంలో ఉంటే పురపాలక సంఘంలో నిధులను దోచుకోవడానికి సాధ్యం కాదని తెలిసి కోట్లు కొల్లగొట్టేందుకు ఫిరాయింపు రాజకీయాలను హిందూ పురం నుంచే టిడిపి నాంది పలకిందన్నారు. బాలకృష్ణకు పార్టీలో చేరిన వారందరి ని రాజీనామాలు చేయించి, మరల వారిని గెలిపించుకునే దమ్ము ఉందన్నారు. అదే విధంగా పార్టీలో చేరిన చైర్పర్సన్, కౌన్సిలర్లను ఉద్దేశించి మాట్లాడుతు వచ్చే ఎన్నికల్లో టిడిపిలో మరల టికెట్ తెచ్చుకోగలరా, మిమ్మల్ని ఎవరైనా నమ్మి ఓట్లు వేస్తారా అన్నారు. నమ్మకం అమ్మ వంటిదని, ఆ నమ్మకాన్ని కోల్పోతే జీవితమే ఉండద న్నారు. ఈ సమావేశంలో వైస్సార్సీపీ నాయకులు వేణు రెడ్డి, బాలాజీ మనోహర్,శివ, ఆసిఫ్, జయప్ప, భాషా, నాగేంద్రప్రసాద్,రూరల్ మండల కన్వీనర్ రాము, శ్రీరామ్ రెడ్డి,వెంకట్ రెడ్డితో పాటు వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు

**అమరావతి, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక):**ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఏపీ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. మొత్తం 12 శాఖల్లో బదిలీలకు ఆమోదం తెలిపింది. ఆగస్టు 19 నుంచి 31వ తేదీ వరకు ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని తాత్కాలికంగా నిలివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. రెవెన్యూ, పంచాయితీ రాజ్, పురపాలక, గ్రామ వార్డు సచివాలయలు, గనులు, పౌర సరఫరాలు, అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఇంజినీరింగ్ ఉద్యోగులు, దేవాదాయ, అటవీ, రవాణా, పరిశ్రమలు, విద్యుత్, వాణిజ్య పన్నులు, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖలోని ఉద్యోగుల బదిలీలకు అనుమతిచ్చింది. మరోవైపు ఉపాధ్యాయులు, వైద్యారోగ్య సిబ్బంది బదిలీలకు దూరంగా ఉన్నారు. ప్రజా సంబంధిత సేవల్లో ఉండే శాఖల్లో మాత్రమే బదిలీలకు అనుమతించినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ నెలాఖరు లోగా ఈ పక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎక్సైజ్ శాఖలో బదిలీలకు సెప్టెంబర్ 5 నుంచి 15వరకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# పోలవరం కాలువ దస్త్రాల దహనం

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తమవుతున్నాయి. ఘటనా స్థలంలో సగం కాలిపోయిన దస్త్రాలను ధవళేశ్వరం పోలీసుల స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. కాల్చివేసిన దస్త్రాలను ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ శివజ్యోతి, డీఎస్పీ భవ్య కిషోర్, స్పెసల్ డిప్యూటీ కలెక్టర్ పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు అందజేసిన పరిహారానికి సంబంధించిన దస్త్రాలుగా ప్రాథమికంగా నిర్ధరించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనుమతి తీసుకోకుండానే శుక్రవారం రాత్రి దస్త్రాలను దగ్ధం చేసిన కార్యాలయ సిబ్బందిని అధికారుల బృందం విచారిస్తోంది.

## నాగ్‌పూర్‌లో విషాద ఘటన: ప్రాణాలు తీసిన రీల్స్ సరదా..

**నాగ్‌పూర్,ఆగస్టు 17:**రీల్స్ సరదాతోనే లేదా ఫేమస్ అయ్యేందుకు ఈ మధ్య కొందరు ప్రమాదకర రీతిలో స్టంట్‌లు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఎన్ని సంఘటనలు జరిగినా యువతలో ఈ వైరల్ పిచ్చి మాత్రం వదలట్లేదు. తాజాగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లోనూ ఇలాంటి విషాదకర ఘటనే చోటు చేసుకుంది. సెలవు రోజున స్నేహితులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన ఓ యువకుడు.. ప్రమాదకర స్టంట్ చేసి మృత్యువును కోరితెచ్చుకున్నాడు. పొంగిపొర్లుతున్న డ్యామ్ గోడపైకి ఎక్కి ప్రమాదవశాత్తూ నీటిలో కొట్టుకుపోయాడు. నాగ్‌పూర్‌లోకి కాలామ్న ప్రాంతానికి చెందిన 23 ఏళ్ల ఆకాశ్ చకోలే.. స్వాతంత్య్ర దినోత్సవం రోజున స్నేహితులతో కలిసి స్థానిక పర్యటక ప్రాంతమైన మకర్‌ధోక్డా డ్యామ్‌కు వెళ్లాడు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ డ్యామ్ నిండి అలుగుపారు తోంది. దీంతో టూరిస్టులను ఆకర్షిస్తోంది.

దీన్ని చూసేందుకు వెళ్లిన ఆకాశ్.. మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ప్రమాదకర స్టంట్‌కు యత్నించాడు.ఈ ముగ్గురు నీరు పారుతున్న డ్యామ్ గోడను ఎక్కేందుకు ప్రయత్నించారు. వీరిలో ఆకాశ్ ఒక్కడే డ్యామ్ పైకి చేరగలిగాడు. మిగతా ఇద్దరు అతడిని కిందకు తీసుకొచ్చేందుకు చేయందించగా.. బ్యాలెన్స్ కోల్పోయి ప్రమాదవశాత్తూ అతడు డ్యామ్‌లో పడిపోయాడు.

అప్రమత్తమైన రెస్క్యూ బృందాలు గాలింపు చేపట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కొన్ని గంటల తర్వాత అతడి మృతదేహాన్ని గుర్తించారు. ఇందుకు సంబంధించిన భయానక దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

# పోలవరాన్ని గోదావరిలో ముంచేశారు

**న్యూఢిల్లీ, ఆగస్టు 17 :** పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఐదేళ్లపాటు అధికారంలో ఉండి పోలవరాన్ని గోదావరిలో ముంచేసిన వాళ్లు ఇప్పుడు మాట్లాడుతున్నారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ తీరు చూస్తుంటే దొంగే.. దొంగా దొంగా అని అరచినట్లు ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టు నిధుల విడుదల కోసం ఢిల్లీ వెళ్లిన మంత్రి నిమ్మల ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 2014-19 మధ్య గత టీడీపీ ప్రభుత్వం పోలవరానికి రూ.11,500 కోట్లకు పైగా ఖర్చు పెట్టిందని, ఆ సమయంలో కేంద్రం రీయింబర్స్‌మెంట్ ద్వారా రూ.6వేల కోట్లు మాత్రమే ఇచ్చిందని మంత్రి వెల్లడించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రూ.4,167కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని, కానీ మా హయాంలో జరిగిన పనితో కలుపుకుని రీయింబర్స్‌మెంట్ కింద రూ.8,382కోట్లు వచ్చాయని గుర్తు చేశారు. అలా వచ్చిన పోలవరం నిధులను ప్రాజెక్టు కోసం ఖర్చుపెట్టకుండా దారి మళ్లించిన ఘటన వైసీపీదే అంటూ మంత్రి ఆగ్రహించారు. కేంద్రం నిధుల కోసం ఎదురు చూడకుండా రాష్ట్ర ఖజానా నుంచే ఖర్చు చేసిన చరిత్ర టీడీపీది అని చెప్పుకొచ్చారు. పోలవరం ప్రాజెక్టు గైడ్ బండ్ కుంగిపోవడం సహా అంచనాలు పెంచి టెండర్లు పిలిచిన అంశాలన్నీ ఒక్కొక్కటిగా బయటికొస్తున్నట్లు మంత్రి తెలిపారు.

శాఖాపరంగా దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. వైసీపీ హయాంలో ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మాణం పూర్తికాకపోవడం వల్ల 2020 భారీ వరదలకు డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నమాట వాస్తవం కాదా అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను మంత్రి నిమ్మల ప్రశ్నించారు. దీనిపై ఐఐటీ హైదరాబాద్ నిపుణులు ఇచ్చిన నివేదిక వాస్తవం కాదా అంటూ ఆగ్రహించారు. 2014-19మధ్య ఉన్న ఏజెన్సీలను రద్దు చేయడం వల్లే కొత్త ఏజెన్సీ పనులు చేపట్టడానికి 13నెలల సమయం పట్టిందని మంత్రి చెప్పారు. వైసీపీ తీరు వల్ల ఆ 13నెలల సమయమంతా వృథా అయ్యిందని ధ్వజమెత్తారు. ఒకే పనిని రెండు ఏజెన్సీలతో చేయిస్తే ఎవరు బాధ్యత వహిస్తారంటూ పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) లేఖ రాయడం నిజం కాదా జగన్ అంటూ మంత్రి ధ్వజమెత్తారు. ఏజెన్సీలను మార్చడం సరికాదంటూ పీపీఏ మినట్స్‌లో నమోదు చేసిన విషయం నిజమా.. కాదా?. ఈ ప్రశ్నలన్నింటికీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలంటూ మంత్రి నిమ్మల సవాల్ విసిరారు.

# రాజీనామా చేసేంత తప్పేం చేసా?

**బెంగళూరు, ఆగస్టు 17:** కన్నడ రాజకీయాల్లో కలకలం సృష్టిస్తోన్న 'ముడా' స్కామ్ కేసులో సీఎం సిద్ధరామయ్యను విచారించేందుకు గవర్నర్ అనుమతించడం సంచలనంగా మారింది. దీనిపై సిద్ధా స్పందించారు. తాను రాజీనామా చేసేంత తప్పేం చేయలేదన్నారు. గవర్నర్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని, చట్టవ్యతిరేకమని ఆక్షేపించారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోసేందుకు భాజపా, జేడీఎస్ చేస్తోన్న కుట్ర అని ఆరోపించారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. "క్యాబినెట్, పార్టీ అధిష్ఠానం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు అంతా నాకు అండగా ఉన్నారు". అని సీఎం మీడియాతో పేర్కొన్నారు. "గవర్నర్ తన సెక్రటరీ ద్వారా రాజ్యాంగ విరుద్ధమైన లేఖను పంపారు. ఈ రాష్ట్రం, కాంగ్రెస్ పార్టీ సిద్ధరామయ్యకు అండగా ఉంది. ఆయన నా సీఎం. ఆయనే సీఎంగా ఉంటారు. అసలు కేసే లేని చోట వివాదం చేస్తున్నారు. దీనిపై మేం న్యాయపరంగా ముందుకు వెళ్తాం. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి రాజకీయంగా పోరాడతాం" అని శివకుమార్ మీడియాతో అన్నారు.

# డాక్టర్లు ఆందోళన విరమించాలని కేంద్రం విజ్ఞప్తి

(మొదటిపేజీ తరువాయి)

చర్యలపై కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రకటన చేసింది. దేశంలో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే విధుల్లో చేరాలని విజ్ఞప్తి చేసింది. జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా భారత వైద్య సంఘం (ఐఎంఏ) సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. అత్యవసరం కాని వైద్య సేవలను 24 గంటల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ఆస్పత్రులలో ఓపీ సేవలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో కమిటీ ఏర్పాటు చేస్తామని వైద్యులకు కేంద్రం హామీ ఇచ్చింది. వైద్యవృత్తిలో ఉన్నవారి భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరింది.

# సిఎం పదవికి రాజీనామా చేయాలి

**న్యూఢిల్లీ,ఆగస్టు 17:**కోల్‌కతా ట్రైనీ డాక్టర్ పాశవిక అత్యాచారం, హత్య కేసుపై 2012 ఢిల్లీ గ్యాంగ్ రేప్ కేసు బాధితురాలు 'నిర్భయ' తల్లి ఆశా దేవి ఘాటుగా స్పందించారు. కేసును సమర్థవంతంగా పరిష్కరించడం, చర్యలు తీసుకోవడంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విఫలమయ్యారని, ఆమె తక్షణం సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీఎంకు ఉన్న అధికారులతో తక్షణ చర్యలు తీసుకోవడానికి బదులుగా నిరసనల పేరుతో ప్రజల దృష్టి మరలిచేందుకు మమత ప్రయత్నిస్తున్నారని తప్పుపట్టారు. ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో విధి నిర్వహణలో ఉన్న 31 ఏళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ వైద్యురాలు ఆగస్టు 9న అత్యంత దారుణంగా హత్యకు గురయ్యారు. హత్యకు ముందు అత్యాచారానికి గురైనట్టు పోస్ట్‌మార్టం నివేదిక వెల్లడించింది. ఈ ఘటనపై మెడికల్ కాలేజీ విద్యార్థినులు, డాక్టర్లతో పాటు దేశవ్యాప్తంగా నిరసనలకు దిగారు. బాధితురాలికి న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు కొనసాగిస్తున్నారు. మమతా బెనర్జీ స్వయంగా మహిళ అయి ఉండి, అందునా రాష్ట్ర ముఖ్యమంత్రిగా తక్షణ కఠిన చర్యలు తీసుకుని ఉండాల్సిందని, దీనికి బదులుగా నిరసనల పేరుతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆశాదేవి విమర్శించారు. పరిస్థితిని హ్యాండిల్ చేయడంలో విఫలమైన మమతా బెనర్జీ రాజీనామా చేయాలన్నారు. రేపిస్టులపై కోర్టులు తక్షణ చర్యలు తీసుకునేలా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా కదలకుంటే దేశంలోని ఏదో ఒక చోట ప్రతిరోజూ ఇలాంటి ఘటనలే పునరావృతమవుతాయని అన్నారు. కోల్‌కతా మెడికల్ కాలేజీలో మహిళకు రక్షణ లేకపోవడం, వారిపై అత్యంత పాశవికంగా దాడులు జరుగుతుండటం చూస్తే దేశంలోని మహిళలకు ఎలాంటి భద్రత ఉందో అర్థం చేసుకోవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటన జరిగిన మరుసటి రోజే ఈ నేరంతో సంబంధం ఉన్న ఒక వ్యక్తిని బెంగాల్ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. అనంతరం పోలీసు విచారణలో లోపాలని కోల్‌కతా హైకోర్టు తప్పుపడుతూ కేసును సీబీఐకి అప్పగించింది.

# ఇదేనా నివాళి....గన్ని రూటే సెపరేట్....





**రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు బంద్‌లో పాల్గొంటే...జిఎస్ఎల్ అధినేత గన్ని మాత్రం వార్షికోత్సవ సంబరాల్లో మునిగితేలారు...ఒకవైపు కొవ్వొత్తులతో ర్యాలీలు...మరొకవైపు వైద్యురాలు హత్యకు నిరసనలు...**

**తూర్పు గోదావరి జిల్లా, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక ) :** కల్‌కత్తా వైద్యురాలి హత్యకు నిరసనగా దేశవాప్తం గా నిరసనలు హెూరెత్తున్నాయి. దీనిలో భాగంగానే ఆంధ్రరాష్ట్రంలో శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రిల్లో వైద్య సేవల బంద్ చేసి డాక్టర్లు అందరూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయితే దీనికి భిన్నంగా రాజమండ్రి సమీపంలోని జిఎస్ఎల్ (గన్ని సుబ్బలక్ష్మి) హాస్పిటల్ అధినేత డాక్టర్ గన్ని భాస్కరావు మాత్రం తన సంస్థ వార్షికోత్సవ సంబరంలో పాల్గొని తన రూటే సెపరేట్ అనిపించుకున్నారు. అయితే ఈ ఫంక్షన్ ఏదో సాదాశీదాగా నిర్వహించిన వార్షికోత్సవం అనుకుంటే పొరపాటు, ఈ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారని చెప్పక తప్పదు...ఎందుకంటే ఈ వేడుకకు ఇటీవల విడుదలై సంచలనం సృష్టించిన యానిమల్ హిందీ చిత్రం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా పాల్గొన్నాడంటే ఏస్థాయిలో ఈ ఫంక్షన్ నిర్వహించారో స్పష్టమౌతుంది. దేశంలోని వైద్యులు అందరూ కల్‌కత్తాలో పీజీ వైద్య విద్యార్థిని అఘాయిత్యానికి నిరసనగా శుక్ర, శనివారాలు ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేస్తూ డాక్టర్లందరూ నివాళులర్పిస్తుంటే , ఎంతో ఉన్నత స్థానంలో ఉన్న డాక్టర్ గన్ని భాస్కరరావు లాంటి వ్యక్తి రాజమండ్రిలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి పెద్దన్నగా వ్యవహరించాల్సింది పోయి తన సంస్థలోని వార్షికోత్సవ సంబరాల్లో మునిగితేలడంపై పలువురు డాక్టర్లు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. వార్షికోత్సవాలు ఇవాళ కాకపోతే రేపు అయినా నిర్వహించుకోవచ్చు. అయితే ఇలాంటి ఘటన చోటుచేసుకున్నప్పుడు వార్షికోత్సవ వేడుకను పోస్ట్‌పోన్ చేయాలింది పోయి, ఘనంగా నిర్వహించడం, వాటి ఫోటోలను వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేయించడం ఏ మాత్రం తగదంటూ కొందరు డాక్టర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోల్‌కత్తా ఘటన బాధ్యులను కఠినంగా శిక్షించాలంటూ భారీ ర్యాలీలు, నిరసనలు తెలియజేస్తుంటే జిఎస్ఎల్ అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు మాత్రం సినీ ప్రముఖలను తీసుకొచ్చి వేడుకలు నిర్వహించడ ఏ మాత్రం తగదంటూ వైద్యవిద్యార్ధులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. వైద్య విద్యార్ధికి నివాళులర్పించడం ఇదేనా అంటూ గన్ని వ్యవహార శైలిపై మండిపడుతున్నారు.






# రైతులకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా మంత్రి గొట్టిపాటి



**బల్లికురవ ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** రైతులకు ఇబ్బంది లేకుండా పగటిపూట మాత్రమే నాణ్యమైన విద్యుత్ అందజేస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.కొప్పెరపాడు ఉపకేంద్రం విద్యుత్ వినియోగం పెరిగినందుకు నూతన నియంత్రతను శనివారం మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రమాదాలు లేకుండా పనులు చేసుకోవాలని రైతు సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు విద్యుత్సి సిబ్బంది అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన సందస్సు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి అన్నారు.అందుబాటులో ఉన్న సౌర శక్తిని ఉపయోగించుకొని ప్రతి ఫీడర్ కింద విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేయనన్నట్లు చెప్పారు వీటిని ఏర్పాటు చేసే వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రోత్సహకాలు అందించనున్నారు.సంస్థలు ప్రతినిధులు విద్యుత్తు వినియోగించుకున్న తరువాత మిగిలిన దాని ప్రభుత్వ సేకరించి, వారికి నగదు చెల్లిస్తుందని తెలిపారు.దీనివల్ల రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి వినియోగం సుఖమమవుతుందన్నారు.అనంతపురంలో సౌర విద్యుత్పత్తికి సహజ సిద్ధంగా మెరుగైన అవకాశాలు ఉన్నాయన్నారు. అదే తరహాలో దొనకొండ ప్రాంతాల్లో సౌర, వాయువు విద్యుత్తు యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు. వ్యవసాయానికి పగటిపూట విద్యుత్ సరఫరా చేసేందుకు కార్యవర్గం అమలు చేస్తున్నట్లు చెప్పారు.

# ప్రెస్ క్లబ్ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజును అభినందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** ది.గోకవరం ప్రెస్ క్లబ్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలను స్వీకరించిన కొంగరపు రాజును జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ శనివారం అభినందించారు.తంటికొండలో స్వయంభుగా వెలిసినటువంటి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి తంటికొండ దేవస్థానంపై రాజుకు సాలువా కప్పి, పూలమాలతో ఎమ్మెల్యే అభినందించారు. ఈసందర్భంగా ప్రెస్ క్లబ్ కు ఉన్నటువంటి అవసరాలను రాజు శాసనసభ్యులకు వివరించడం జరిగింది. ఫోర్త్ స్టేట్ గా ఉన్న మీడియా అభివృద్ధికి నేనెప్పుడూ కట్టుబడి ఉంటానని శాసనసభ్యులు నెహ్రూ తెలియజేశారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హయాంలోనే ప్రెస్ క్లబ్ కు మేలు జరిగిందని, ఇప్పుడు ఉన్నటువంటి విలేకరులందరికీ ఆయన ద్వారానే శాశ్వత లబ్ధి చేకూరుతుందని రాజు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో టిడిపి జనసేన బిజెపి నాయకులు పాల్గొనడం జరిగింది.

# 12 ఏళ్ల బాలునికి ఎక్సపాండబల్ కస్టమ్-మేడ్ మెగాప్రొస్థెసిస్ సర్జరీ విజయవంతం

## లైఫ్-సేవింగ్ సర్జరీ నిర్వహించిన అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్



**మంగళగిరి ఆగస్టు 17(ఆంధ్రపత్రిక):** మంగళగిరిలోని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఏఓఐ ), విజయవాడ 12 ఏళ్ల బాలుడికి విజయవంతంగా ప్రాణాలను రక్షించే శస్త్రచికిత్స చేయడం ద్వారా మరో మైలురాయిని చేరుకుంది. డాక్టర్ ఇషాంత్ అయినపూరి నిర్వహించిన ఈ కేసు ఏఓఐ వద్ద పీడియాట్రిక్ ఆంకాలజీ కేర్‌లో గణనీయమైన విజయానికి ప్రతీకగా నిలిచింది. అఖిల్ ఎస్ కె తొడ ఎముక యొక్క దిగువ భాగంలో, మోకాలి దగ్గర తొడ ఎముక యొక్క కుడి చివర ఆస్టియోసార్కోమాతో బాధపడుతున్నాడు. ఆస్టియోసార్కోమా అనేది ఒక రకమైన ఎముక క్యాన్సర్, ఇది సాధారణంగా ఎముకలను ఏర్పరిచే కణాలలో మొదలవుతుంది, సాధారణంగా పొడవాటి ఎముకలను ప్రధానంగా కాళ్ళలో, మరీ ముఖ్యంగా మోకాలి చుట్టూ ఇది ఎక్కువగా ప్రభావితం చేస్తుంది.

మూడు నెలల క్రితం, అఖిల్‌కు ఆస్టియోసార్కోమా ఉన్నట్లు నిర్ధారణ అయింది. వేరే చోట అతను మూడు సార్లు కీమోథెరపీ చేయించుకున్నాడు. అయితే, కేసు సంక్లిష్టత కారణంగా, అవయవాన్ని కాపాడుతూ సర్జరీ చేయటం సాధ్యం కాదని భావించి, కాలు తొలగించాల్సి ఉంటుందని అక్కడ సూచించారు. ఏఓఐ మంగళగిరికి చెందిన సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఇషాంత్ అయినపూరి మాట్లాడుతూ, "ఈ యువ రోగికి కస్టమ్-మేడ్ ప్రొస్థెసిస్‌తో లింబ్ సాల్వేజ్ సర్జరీ ఉత్తమ ఎంపిక. మేము అతని అవయవాన్ని రక్షించగలము మరి యు అతని భవిష్యత్తు ఎదుగుదలకు తగిన పరిష్కారాన్ని అందిం చగలగడం నమ్మశక్యం కానిది. ఈ ఫలితం అధునాతన వైద్య సాంకేతికతతో క్లినికల్ నైపుణ్యాన్ని కలపడం యొక్క శక్తిని ప్రదర్శిస్తుంది" అని అన్నారు.

డాక్టర్ ఇషాంత్ అయినపూరి మరియు అతని బృందం విస్తరించదగిన కస్టమ్-మేడ్ మెగా ప్రొస్థెసిస్ (టైటానియం మిశ్రమం) ఉపయోగించి శస్త్రచికిత్సను ప్లాన్ చేసారు, ఇది పిల్లల భవిష్యత్తు పెరుగుదలకు అనుగుణంగా ప్రభావితమైన భాగాన్ని భర్తీ చేయడానికి రూపొందించబడింది. ప్రొస్థెసిస్ కోసం వేచి ఉన్న సమయంలో రోగి ఏఓఐ మంగళగిరిలో నాల్గవ సైకిల్ కీమోథెరపీని పొందారు.

విజయవాడ, గుంటూరు, వైజాగ్ రీజియన్‌లలో 12 ఏళ్ల చిన్నారిపై 8 ఏళ్ల తర్వాత విజయ వంతమైన కేసు ఇదే. సిటిఎస్ఐ -దక్షిణాసియా సీఈఓ హరీష్ త్రివేది మాట్లాడుతూ , "ఈ శస్త్రచికిత్స విజయం పిల్లల ఆంకాల జీలో వినూత్న పరిష్కారాల యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది. ఏఓఐ వద్ద, అత్యాధునిక సాంకేతికత మరియు వ్యక్తిగతీకరించిన చికిత్స ప్రణాళికల ద్వారా క్యాన్సర్ సంరక్షణను అభివృద్ధి చేయడానికి మేము అంకితభావంతో ఉన్నాము. మా చిన్న వయసు రోగులకు కూడా సాధ్యమైనంత ఉత్తమమైన ఫలితాలను అందిస్తామనే భరోసా అందిస్తున్నాము "అని అన్నారు.

# ఈ పంట నమోదు ప్రక్రియను పరిశీలించిన జాయింట్ కలెక్టర్



**కోరుకొండ, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** రాజానగరం మండలం నరేంద్రపురం గ్రామంలో శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు ఈ పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులు వారు సాగు చేస్తున్న పంటకు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న కౌలు కార్డులను తీసుకోవాలని ఆయన తెలియజేశారు. వీటివల్ల రైతులకు ఇన్పుట్ సబ్సిడీ, ధాన్యం అమ్మకాలు, బ్యాంకు రుణాలు పొందటానికి అవకాశం ఉంటుందన్నారు. రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలియజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ మాధవరావు, తహసిల్దార్ లక్ష్మీ లావణ్య, మండల వ్యవసాయాధికారి ఎస్ కె ఇమామీఖాసీం, రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# డిబిఆర్ సి ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ బడ్జెట్ పై జిల్లా సదస్సు

**అద్దంకి ఆగస్టు17( ఆంధ్రపత్రిక):** ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ బడ్జెట్ పై దళిత బహుజన రిసోర్స్ పర్సన్ (డి బి ఆర్ సి) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సదస్సును సోమవారం మల్లం లింగయ్య భవన్ (సిపిఐ కార్యాలయం )ఒంగోలు నందు నిర్వహిస్తున్నామని ఉమ్మడి ప్రకాశం జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో నూతనంగా ఎన్నికైన ప్రభుత్వం త్వరలో అసెంబ్లీలో బడ్జెట్ ను ప్రవేశ పెడుతున్నది విషయం మన అందరికి తెలిసిన అంశమే ఈ నేపధ్యంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ బడ్జెట్ లో తీసుకురావాల్సిన మార్పులు చేర్పులు గురించి చర్చించి నిర్దిష్టమైన ప్రతిపాదనలను తయారు చేసేందుకు ఈ సదస్సు ను నిర్వహిస్తున్నామన్నారు ఈ సదస్సుకు పౌర సమాజ ప్రతినిధులు అందరూ హాజరు కావాలని కోరారు

# కళాశాలలు,స్కూల్ బస్సులను తనిఖీ చేసిన ..ఆర్టీవో

**తొమ్మిది బస్సులపై కేసు నమోదు..రూ.70,400 జరిమానా**




**శ్రీకాళహస్తి ,ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక):** గత మూడు రోజులుగా శ్రీకాళహస్తి పట్టణంలోని పాఠశాలల , కళాశాలల బస్సులను మోటర్ వాహన తనిఖీ అధికారి దామోదర్ నాయుడు తనిఖీ చేయడం జరిగింది. ఈ తనిఖీలలో 9 బస్సులపై కేసులు నమోదు చేయడం జరిగింది.ఇందులో 5 బస్సులు విద్యార్థులను పరిమితికి మించి తీసుకువెళ్లడం, 2 బస్సులు డ్రైవర్లకు సరైన లైసెన్స్ లేకుండా అంటే ఐదు సంవత్సరాల అనుభవం లేకుండా నడుపుతున్నట్లు గుర్తించడం జరిగింది. 2 బస్సులకి ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కేసుల ద్వారా టాక్స్ మరియు పెనాల్టీలు రూపేనా 70 వేల 400 రూపాయలు వసూలు చేయడం జరిగింది.ఈ తనిఖీలలో చాలా బస్సులలో విద్యార్థులను పరిమితికి మించి తరలిస్తున్నట్లు గుర్తించాము.ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు , పాఠశాలల యాజమాన్యాలు గమనించి విద్యార్థుల సంఖ్యను అనుసరించి సరిపడా బస్సులు ఏర్పాటు చేసుకోవాలని ఆర్టీవో కోరారు. ఈ తనిఖీలు ఇకముందు కూడా కొనసాగుతాయినీ,ఎవరైనా సరియైన రికార్డ్స్ లేకుండా , అనుభవం లేని డ్రైవర్లచే పాఠశాల బస్సులను నడిపినట్లు గమనించిన యెడల ఆ వాహనాలను నిర్బంధించడం జరుగుతుంది. కావున పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి వాహనాలు నడిపి విద్యార్థులను క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేర్చవలసిందిగా కోరుచున్నాను. లేనియెడల కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన తెలియజేశారు.

# జగన్, విజయసాయిరెడ్డి, మిథున్ రెడ్డి పాపాలు అన్నీఇన్నీ కావు: జీవీ ఆంజనేయులు

**డిస్టిలరీలను గుప్పిట్లో పెట్టుకుని ప్రజలతో విషం తాగించారని మండిపాటు - నాసిరకం మద్యంతో 30 వేల మందికి పైగా ప్రాణాలు తీశారని ఆరోపణ -జగన్ మూల్యం చెల్లించుకోక తప్పదని వ్యాఖ్య**



**వినుకొండ, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** వైసీపీ అధినేత జగన్, విజయసాయిరెడ్డి, మిథున్ రెడ్డిలపై వినుకొండ టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తీవ్ర విమర్శలు గుప్పించారు. వీరు చేసిన పాపాలు అన్నీఇన్నీ కావని ఆయన అన్నారు.డిస్టిలరీలను గుప్పిట్లో పెట్టుకుని ప్రజలతో విషం తాగించారని మండిపడ్డారు. కల్తీ, నాసిరకం మద్యంతో ఏపీలో 30 వేల మందికి పైగా ప్రాణాలు తీశారని దుయ్య బట్టారు.ఐదేళ్ల వైసీపీ పాలనలో రూ. 1.24 లక్షల కోట్ల మద్యాన్ని నగదు రూపంలో అమ్మారని విమర్శించారు. నాసిరకం మద్యం అక్రమాలకు జగన్ మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. కూటమి ప్రభుత్వం మద్యం విధానాన్ని సంస్కరించాలని చూస్తుంటే... వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

# ఎమ్మెల్యే చొరవతో.. మంచినీటి సరఫరా పైప్ లైన్ లీకేజీ మరమ్మత్తు పనులు



**శ్రీకాళహస్తి ,ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక):** శ్రీకాళహస్తి పట్టణం ఎన్టీఆర్ నగర్ నందు గత ఐదు సంవత్సరాలుగా గత పాలకులు పట్టించుకోని మంచినీటి సరపరా పైపు లైను లీకేజ్ ను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చొరవతో పరిష్కారం లభించింది.గత ఐదు సంవత్సరాల నుండి మంచినీటి పైపు లీకేజి కారణంగా ఎన్టీఆర్ నగర్ నందు నీరు వృథాగా పోతుండేది. పైపు లీకేజి గురించి గత ప్రభుత్వంలో అనేక సార్లు చెప్పినా పటించుకున్న పాపాన పోలేదు. తెలుగుదేశం పార్టీ అధికారం రాగానే ఎమ్మెల్యే ఆదేశాల తో ఆ వార్డు ఇంచార్జి నెమళ్ళూరు బుజ్జి , వార్డు అధ్యక్షులు పూల శేఖర్, మున్సిపల్ కమీషనర్ రమేష్ బాబు దృష్టికి తీసుకొని రాగానే వెంటనే స్పందించిన కమీషనర్ రమేష్ బాబు సంబంధించిన విభాగంలోని సిబ్బందిని ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

గత ఐదు సంవత్సరాల సమస్య ఎమ్మెల్యే చొరవతో పరిష్కారం లభించడంతో ఎన్టీఆర్ నగర్ ప్రాంతంలోని ప్రజలు ఎమ్మెల్యేకి కమీషనర్ కి, వారి సిబ్బందికి కృతజ్ఞతలతో హర్షం వ్యక్తంచేశారు.ఈ పైపు మరమ్మత్తు లో మున్సిపల్ అధికారి సుధాకర్ , సచివాలయం నుండి మౌనిక, మున్సిపల్ ఆఫీస్ నుండి ఫిట్టర్ తులసిరామ్ , సహాయకులు గురవయ్య, గిరిబాబు, మహేంద్ర, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరుస దొంగతనాల కేసులను చేదించిన బాపట్ల పోలీస్

**దేవాలయాల్లో వరుస దొంగతనాలు కు పాల్పడుతున్న ముఠా అరెస్ట్-పది దేవాలయాల్లో చోరీ చేసి వెండి ఆభరణాలు దొంగిలించిన ముఠా సభ్యులు-16,99,700/- విలువ గల 6.7 కేజీల వెండి వస్తువులు, 10 ద్విచక్ర వాహనాలు టీవీ స్వాధీనం.**



**బాపట్ల ,ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలోని దేవాలయాల్లో జరిగిన దొంగతనాల్లో ముద్దాయిలను అరెస్టు చేశామని జిల్లా ఎస్పి తుషార్ డుడి వెల్లడించారు.శనివారం వెదుళ్ళపల్లి సిసిఎస్ పోలిస్ స్టేషన్ లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.చుండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని యడ్లపల్లి గ్రామం ఆంజనేయ స్వామి, వినాయకుడి దేవాలయం, భట్టిప్రోలు గ్రామంలో, శ్రీ గుండి పార్వతి అమ్మ వారు ఆలయంలో వెండి ఆభరణములు అపహరణ.రేపల్లె మండలం పేటేరు గ్రామంలో ఆంజనేయ స్వామి గుడిలో శటగోపం,వెండి గిన్నెలుదొంగిలించడం జరిగింది.వేమూరు మండలం చావలి గ్రామంలో నాగ దేవత గుడి హుండీ దొంగిలించడం జరిగిందన్నారు.గుంటూరు జిల్లా తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో ఆంజనేయ స్వామి గుడి హుండీ, తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో రామాలయం గుడి హుండీ దొంగిలించడం జరిగింది . వేమూరు గ్రామం లో ఆంజనేయ స్వామి గుడి లో ఇత్తడి గిన్నె , కొల్లిపర మండలం బొమ్మోడివారి పాలెం గ్రామంలో ఆంజనేయ స్వామి గుడి లో వెండి గిన్నె,వెండి నామం దొంగిలించడం జరిగింది.పల్నాడు జిల్లా నరసరావు పేట లో చర్చి లో హుండీదొంగిలించడం జరిగింది .చెరుకుపల్లి మండలం కనగాల గ్రామం లో అమ్మ వారి గుడి లో హుండీ చొరికి గురైంది. పై నేరాల్లో కారంపూడి విజయ్ కుమార్ గుంటూరు జిల్లా తెనాలి సరళ , తాడిపత్రి సాయి, బండికట్ల పవన్ కళ్యాణ్ అనే ముగ్గురిని అరెస్టు చేశామన్నారు.6.7 కేజిల వెండి,10 బైక్ లు ఒక టివి మొత్తం విలువ: 16,99,700 సొత్తు రికవరి జరిగినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక్క కెమెరా కెమెరా 10 మంది పోలీసులతో సమానమని అన్నారు. రాత్రి సమయాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని 100/112 నెంబర్ కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు. ఖరీదైన వాహనాలు ఉపయోగించే వాహనదారులు తమ వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేసుకొని మరింత రక్షణ పొందాలని తెలిపారు. కేసు దర్యాప్తు లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన చీరాల డిఎస్పీ పీ.జగదీష్ నాయక్,సీఐ ప్రిమయ్య,చుండూరు సీఐ శ్రీనివాస రావు,సిబ్బందిని ఎస్పి అభినందించారు.

# ఒంటరి మహిళలే టార్గెట్..

## బైక్ పై వచ్చి మెడలో గొలుసు లాక్కెళ్ళిన చైన్ స్నాచర్స్

### సంఘటనా స్థలంకు చేరుకొని విచారణ చేసిన టూటౌన్ సిఐ రారాజు



**తొట్టంబేడు ,ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక):** జల్సాలకు అలవాటు పడిన కొందరు యువత .. ఈజీ మనీ కోసం ఇటువంటి దారులను ఎంచుకుంటున్నారు. దొరికితే దొంగ.. దొరక్కపోతే దొర అన్నట్లు సాగుతుంది చైన్ స్నాచర్స్ వ్యవహారం. ఆ క్షణానికి చేతులో డబ్బులు లేకపోతే ఇటువంటి మార్గాలను ఎంచుకొని ఎదుటివారి ప్రాణాల సైతం లెక్కచేయకుండా ఇటువంటి దారుణాలకు ఒడిగడుతున్నారు. వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. తొట్టంబేడు మండలంలోని చిన్న సింగమాల గ్రామానికి చెందిన సి. గున్నమ్మ వ్యవసాయ పొలంలో తమ ఆవులని మేతకు వదిలి తిరిగి ఇంటికి వెళ్లే మార్గంలోని నాయుడుపేట - పూతలపట్టు జాతీయ రహదారి సింగమాల కూడలి వద్ద సాయంత్రం సుమారు ఐదు గంటలు సమయంలో రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనంపై హెల్మెట్, మాస్కులు ధరించి న ఇద్దరు ఆగంతకులు ఆమె మెడలోని రూ.1.70 లక్షల విలువైన బంగారం గొలుసు లాకెళ్ళారు. ఈ చోరీ జరుగక మునుపే పెద్ద కన్నలి గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు వాకింగ్ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్ పై హెల్మెట్ ధరించి వచ్చి సూళ్లూరు పేటకు దారి ఎటు వెళ్తుందని వారితో మాటలు కలిపినట్లు సమీపంలో వాకింగ్ చేస్తున్న మహిళలు తెలిపారు. ముగ్గురు మహిళలు ఒకేచోట ఉండడంతో వారికి ఈ చోరీ చేయడం వీలుపడకపోవడంతో సుమారు అరగంట పాటు పెద్ద కన్నలి పెట్రోల్ బంకు సమీపంలో వాకింగ్ చేస్తున్న వారిలో ఒంటరిగా తిరుగుతున్న మహిళలు లక్ష్యంగా పాగా వేశారు. అరగంట పాటు పెట్రోల్ బంకు సమీపంలో చైన్ స్నాచర్స్ తిరుగుతున్నట్లు మహిళలు పోలీసులకు తెలిపారు.ఈ దొంగతనం శ్రీకాళహస్తి టూ టౌన్ స్టేషన్లో బాధితురాలు ఇచ్చిన రాజు ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి పట్టణ టూ టౌన్ సిఐ రారాజు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేశారు.

# విజన్ బాపట్ల పై సమగ్ర ప్రణాళిక రూపొందించాలి



**బాపట్ల, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** విజన్ బాపట్లపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు తెలిపారు. వికసిత్ ఆంధ్ర కార్యక్రమంపై అన్ని శాఖల జిల్లా అధికారులకు ఒక రోజు వర్క్ షాప్ శనివారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. ప్రజల తలసరి ఆదాయం పెరిగేలా సహజ వనరుల సద్వినియోగంపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. అభివృద్ధి పెరుగుదల ఉండాలని, లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. పెరుగుతున్న జనాభాకు తగినట్టుగా భవిష్యత్తులో ఉత్పత్తి రంగాల ఉత్పాదకత ఉండేలా చూడాలన్నారు. ఇందుకోసం విజన్ బాపట్ల ఉండాలని వివరించారు. భావితరాలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని వారిలో ఆయన స్ఫూర్తి నింపారు. డెవలప్ ఇండియా మిషన్ లక్ష్యంతో కేంద్ర ముందుకు వెళ్తుందన్నారు. జిడిపిలో భారత్ 3.9 ర్యాంక్ తో ప్రపంచంలో ఐదవ స్థానంలో ఉందన్నారు. జిడిపిలో ఆంధ్రప్రదేశ్ 2.19 శాతం ఉందన్నారు. 2030 నాటికి సుస్థిరాభివృద్ధి, 2047వ సంవత్సరానికి జిడిపి పెరుగుదలతో భారత మూడో స్థానానికి చేరడమే లక్ష్యమన్నారు. ఆహార కొరత ఏర్పడటంతో 1950లో ఆనాటి ప్రభుత్వం, అప్పటి అధికారులు అధికారులు కలిసి పంచవర్ష ప్రణాళికను ప్రవేశపెట్టడంతో భారత్ అభివృద్ధి బాటలోకి వచ్చిందన్నారు. గత అనుభవాలు, భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకుని భావితరాలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేయాలని మార్గ నిర్దేశం చేశారు. బాపట్ల జిల్లా జిడిపి పెరగాలంటే సాంఘిక సంస్థాగత అభివృద్ధికి సదుపాయాలు సమకూర్చాలని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. ఆర్థిక వ్యవస్థ మెరుగుపడాలంటే సమగ్ర ప్రణాళిక ఉండాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తుల భాగస్వామ్యంతో అభివృద్ధికి బాటలు వేసేలా ప్రణాళిక చర్యలు ఉండాలన్నారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా ఆదాయ వృద్ధి రూ.36,577 కోట్లు ఉందన్నారు. జిల్లా వ్యవసాయ రంగంలో ఆదాయం 56.09 శాతం కాగా, పరిశ్రమల ఆదాయ 16.10శాతం, ఉండగా సర్వీస్ సెక్టార్లలో ఆదాయం 27.81 శాతం ఉందన్నారు. మొత్తంగా బాపట్ల జిల్లా అభివృద్ధి రేటు 7.59శాతంగా ఉండగా, రాష్ట్రంలో జిల్లా ఉత్పత్తి ఆదాయం 2.81శాతంగా ఉందన్నారు. సంవత్సరంలో వృద్ధిరేటు 15శాతానికి చేరుకోవాలన్నారు. ప్రధానంగా ఆహార ఉత్పాదకత పెరగాలన్నారు. సాంఘిక సంస్థాగత అభివృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. విద్యా, వైద్యం, తాగునీరు, వసతుల కల్పనతోనే ఆదాయ వనరులు వేగంగా పెరుగుతాయని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి ఏటా జిల్లా ఆదాయం వృద్ధి 15 శాతానికి చేరుకోవాలన్నారు. ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఒక వ్యక్తి కి ఏడాది తలసరి ఆదాయం రూ.1,96,853లు ఉందన్నారు. వస్తువుల ఉత్పత్తి, ఉత్పాదకత, వనరులు, అవకాశాలపై ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తే ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగుపడుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ రచయిత హేతువాది
# కొడవటి గంటి కుటుంబరావు 45వ వర్ధంతి



**గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** చందమామ మాసపత్రిక సంపాదకులుగా, ఆంధ్ర పత్రిక, యువ పత్రికలో జర్నలిస్టుగా అవిరళ కృషి చేసిన కొడవటి గంటి కుటుంబరావు 45వ వర్ధంతి సందర్భంగా జన చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ నివాళులు అర్పిస్తుంది. 1909 అక్టోబర్ 28న సామాన్య కుటుంబంలో తెనాలిలో జన్మించిన కొడవటీగంటి కుటుంబరావు బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయి మేనమామ వద్ద పెరిగినారు. ప్రాథమిక విద్య తెనాలిలో, ఇంటర్మీడియట్ గుంటూరు ఏసీ కళాశాలలో , గ్రాడ్యుయేషన్ విజయనగరంలోని మహారాజా కళాశాలలో అభ్యసించారు. బెనారస్ హిందూ యూని వర్సిటీలో ఫిజిక్స్ చదువుతూ మద్యలోనే ఆర్థిక సమస్యలతో అర్ధంతరంగా చదువును మానేశారు. తన 13వ వయసులోనే పద్యాలు, నవల రచనకు పూనుకున్నారు. హేతువాద దృక్పథంతో శాస్త్రీయ భావ జాలాన్ని ప్రజలకు అందించారు. 1931లో వరంగల్ లో పిల్లలకు ట్యూషన్ చెప్పేవారు. చక్రపాణి, పిల్లలమర్రి బాలకృష్ణ లతో కలిసి యువ పత్రికను స్థాపించారు. 1940-42 మద్య కాలంలో ఆంధ్ర పత్రికలో పనిచేశారు. 1952 నుండి తాను చనిపోయే వరకు చందమామ సంపాదకులుగా వ్యవహ రించారు. చక్రపాణి, బి. నాగిరెడ్డిలతో కలిసి చందమామను బాలల మాసపత్రిక గా తీర్చిదిద్దారు. విద్యార్థులలో హేతువాద దృక్పథం పెంపొందించడానికి అవిరళ కృషి చేశారు. ఎన్నో నవలలు, కథలు, వ్యాసాలు, తెలుగు సమాజానికి అందించారు. కొడవటిగంటి కుటుంబరావు 45వ వర్ధంతి సందర్భంగా జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి నివాళులు తెలిపారు.

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**బాపట్ల, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో 11వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగ జ్యోతి ప్రజ్వలన చేసి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గౌరవనీయ ఉపకులపతి ప్రొఫెసర్ కె. గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరం ముగించుకొని వెళుతున్న విద్యార్థినీ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంజనీరింగ్ విద్యార్థులు తమ నైపుణ్యాలను అంతర్జాతీయ ప్రమాణాలకు మించి మరియు నేటి పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుత అధునాతన ఇంజనీరింగ్ విభాగాలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ మరియు డాటా సైన్స్ లో ఉన్న పరిశోధనా అవకాశాలను వివరించారు. ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ భవిష్యత్తులో ఈ ప్రపంచం యొక్క ముఖచిత్రాన్ని సమూలంగా మార్చబోతుందని, ఆ రంగం యొక్క ప్రాముఖ్యతని, అందులో రానున్న వేలాది ఉపాధి అవకాశాలను గురించి విశదీకరించారు. బాపట్ల ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పుల నేని శ్రీనివాసరావు మాట్లాడుతూ బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ని సివిల్ ఇంజనీరింగ్ ,కంప్యూటర్ సైన్స్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలు ఇటీవల NBA (నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్) వారిచే అత్యున్నత ప్రమాణాలు గల విభాగాలుగా గుర్తింపు పొందాయని ప్రకటించారు. భవిష్యత్తులో మిగతా అన్ని విభాగాలు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను సాధించేందుకు కృషిచేసి, బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీని దేశంలోని ప్రఖ్యాత విద్యాసంస్థల సరసన నిలిపేందుకు పరిశ్రమించాలని సలహా ఇచ్చారు. సెక్రటరీ మా నం నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కాలం విలువను తెలుసుకోవాలని, ఇతర దుర్ వ్యసనాలకు దూరంగా ఉండాలని సలహా ఇచ్చారు. సమయపాలన ద్వారా అసాధ్యమైన ఏ లక్ష్యాన్ని అయినా సాధించగలమని సూచించారు. ప్రతి విద్యార్థి సమయాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఉపాధి అవకాశాలను పొందడం ద్వారా వారి తల్లిదండ్రులు గర్వించే విధంగా నడుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్ మాట్లాడుతూ బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ పరిశోధనాశాలలు మరియు ఇతర అధునాతన సౌకర్యాలను గురించి వివరించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో క్యాంపస్ ప్లేస్మెంట్స్ లో భాగంగా ఉద్యోగ అవకాశాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. వివిధ విభాగాలలో విద్య నభ్య సించి చివరి సంవత్సరం ముగించుకొని వెళ్తున్న విద్యార్థినీ విద్యార్థులు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో తాము ఉన్నత ప్రమాణాల విద్యనభ్యసించినందుకు ఎంతో సంతోషంగా గర్వంగా ఉన్నదని పేర్కొన్నారు. ఈ వేడుకలలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ గవర్నింగ్ బాడీ మెంబర్స్, వివిధ విభాగాల డీ న్స్, అసోసియేట్ డీ న్స్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, ప్రస్తుత విద్యా సంవత్సరం ముగించుకొని వెళుతున్న విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను
# అణచివేసిందే జగన్
### ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



**చిలకలూరిపేట ,ఆగస్టు 17(ఆంధ్రపత్రిక):** రాష్ట్రంలో సివిల్ సర్వీస్ అధికారుల పేరిట వైకాపా, జగన్ దొంగ డ్రామాలు మొదలు పెట్టారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. కూటమి ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేసే ప్రయత్నం చేస్తోన్న మాజీ జగన్ రెడ్డి హయాంలోనే నిజానికి అఖిల భారత సర్వీసుల అధికారులను దారుణమైన స్థితిలో అణచివేతకు గురి చేశారని మండిపడ్డా రాయన. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో తీవ్రంగా వివాదస్పదమై, ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టడంపై వైకాపా తప్పుడు ప్రచారాలు చేస్తోందని శనివారం ప్రత్తిపాటి పత్రికా ప్రకటనలో ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఇప్పుడు ఇన్ని ధర్మ పన్నాలు చెబుతున్న జగన్, వైకాపా వాళ్లు నాటి సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం విషయంలో ఏం చేశారో గుర్తులేదా? అని ప్రశ్నించారు. సీనియర్ మోస్ట్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరావుకు ఐదేళ్ల పాటు పోస్టింగ్ ఇవ్వకుండా ఎలా వేధించింది... సస్పెన్షల మీద సస్పెన్షన్ల తో ఎలా ఎలా ఇబ్బంది పెట్టింది మరిచిపోయారా అని గుర్తుచేశారు. అంతేకాక సివిల్స్ అధికారుల సర్వీస్ రిజిస్టర్లు జగన్ వద్దే పెట్టుకుని వేధించారని ఆరోపించారు. ఒక ఎంపీని లాకప్లో హింసించిన అధికారులపై చర్యలు తీసుకోకూడదా? అని ప్రశ్నించారు. వైకాపా హయాంలో చేసిన తప్పులపై వారే సిగ్గుతో తల దించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తప్పుచేసిన అధికారులపై చర్యలు తీసుకోవడం తమ ప్రభుత్వ నిర్ణయమనీ స్పష్టం చేశారు ప్రత్తిపాటి పుల్లారావు .

# గిరిజనులకు దుస్తులు పంపిణీ



**బాపట్ల, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** పేదలకు సహాయం చేయడంలో వచ్చే సంతోషం ఎంతో సంతృప్తిని మిగులుస్తోందని ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు అన్నారు. ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బాపట్ల మండలం పడమర పిన్నిబోయినవారిపాలెం కాలువ కట్టపై నివసించే గిరిజన కుటుంబాలకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేజెండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్గనైజేషన్ రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో సుమారు 80 మంది గిరిజనులకు దుస్తులు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికి వరుకు ఆపదలలో ఉన్న బాధితులకు ఒక్కొక్క కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తూ వచ్చామని,ప్రస్తుతం అధిక సంఖ్యలో గిరిజనుల కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేపట్టామన్నారు. ఆర్గనైజేషన్ కార్యదర్శి బత్తుల సురేష్ మాట్లాడుతూ కాలవకట్టాల వెంబడి ఉండే గిరిజన కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేస్తున్నామని,రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెళ్తామని చెప్పారు. తాము నిర్వహించే కార్యక్రమాలకు సహాయ సహకారాలు చేసే ప్రతి ఒక్క సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బండ్రెడ్డి గోపి, ట్రెజరర్ జోగి సువర్ణరాజు, సభ్యులు తన్నీరు గోపి,బండి శ్రీనివాసరావు,కందుల శ్రీకాంత్, యలవల శ్రీనివాసరావు, యాసం రాజా రమేష్, విన్నకోట శ్రీనివాసరావు, నరాలశెట్టి నాగరాజు,కొక్కిరాల సతీష్,నూతి శ్రీను,సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ



**బాపట్ల, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** మహిళ శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాల భర్తీకి పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు తెలిపారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ప్రత్యేక దత్తత ఏజెన్సీ కింద ఎనిమిది ఉద్యోగాలకు, వన్ స్టాప్ సెంటర్ (సఖి) కింద ఏడు ఉద్యోగాలకు శనివారం స్థానిక కలెక్టరేట్ లో ఇంటర్వ్యూలు జరిగాయి. జిల్లాస్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలకు ప్రత్యేక దత్తత ఏజెన్సీ కింద మొత్తం 104 దరఖాస్తులురాగా, 90 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 14 మంది గైర్హాజరయ్యారన్నారు. వన్ స్టాప్ సెంటర్ (సఖి) కింద మొత్తం 69 దరఖాస్తులు రాగా, 57 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని, మిగిలిన 12 మంది గైర్హాజరు అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, మహిళా సంక్షేమశాఖ పీడీ కె. ఉమా, డీడీ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజా దిబోరా, గుంటూరు సీడబ్ల్యూసీ చైర్మన్, సీడబ్ల్యూసీ సభ్యుడు, ఒంగోలు, జేజేబీ చైర్మన్, తదితరులు పాల్గొన్నారు.

## కోల్కతా 'ఆర్జికర్ సంఘటనకు నిరసనగా గుంటూరులో
# కదం తొక్కిన వైద్యులు
### దేవుళ్ళుగా కాదు సాటి మనిషిగా గుర్తించండి అంటూ వేడుకోలు
### చట్టాలు కఠినంగా రూపొందించాలంటూ ఐఎంఎ, జూడాల డిమాండ్





**గుంటూరు ,ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** కోల్కతాలోని ఆర్జీ గర్ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థిని పై జరిగిన హత్య ఘటనకు నిరసనగా నిర్వహించిన భారీ శాంతి యుత ర్యాలీలో వైద్యులు కదం తొక్కారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు బ్రాంచ్, జూనియర్ డాక్టర్ల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన భారీ ర్యాలీకి అనూహ్య స్పందన లభించింది. ఏదైనా సమస్య వస్తే తామంతా ఏకతాటిపై నిలుస్తామని, తామంతా ఒకటే అని వైద్యులు మరోసారి నిరూపించారు. ఐఎంఏ గుంటూరు బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు (ఎలక్ట్ ) డాక్టర్ నందకిషోర్, ఐఎంఏ గుంటూరు బ్రాంచ్ మహిళ అధ్యక్షురాలు డాక్టర్ హరిత, లలిత హాస్పిటల్ అధినేత డాక్టర్ పి విజయ నేతృతంలో నిర్వహించిన భారీ ర్యాలీ శాంతియుతంగా కొనసాగింది. స్థానిక లాడ్జి సెంటర్ లోని అంబేద్కర్ సర్కిల్ నుంచి గుంటూరు సమగ్ర సర్వజన ఆసుపత్రి వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో అధ్యంతం వైద్యులపై దాడులకు, హత్య యత్నాలకు నిరసనగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. కొన్నిసార్లు రోగులకు వైద్య సేవలు అందించే క్రమంలో తమ ప్రాణాలను పణంగా పెట్టాల్సిన దుస్థితి ఏర్పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. తమను దేవుళ్ళుగా చూడాల్సిన అవసరం లేదని కనీసం సాటి మనుషులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. సమాజంలో మానవుల మధ్య మృగాల మధ్య జీవిస్తునామ అర్థం కాని పరిస్థితి నెలకొందని ముఖ్యంగా ప్రాణాలను కాపాడే డాక్టర్ల ప్రాణాలకే రక్షణ లేకపోవడం చాలా బాధాకర సంఘటనని ఇటువంటి సంఘటనలు మరోసారి పునరావడం కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను కట్టినతరం చేసి నిందితులకు కఠినంగా శిక్షించడం ద్వారానే సమాజంలో మార్పు వస్తుంది తప్ప వేరే మార్గం లేదని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీటిపై దృష్టి సారించి డాక్టర్లకు రక్షణ కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పోలీసుల సంఖ్యను పెద్ద ఎత్తున పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రధానంగా మహిళ వైద్యుల పై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడానికి ప్రభుత్వాలు కఠిన చట్టాలను రూపొందించి ఇష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిజిహెచ్ లో జూనియర్ డాక్టర్లు నిర్వహిస్తున్న న్యాయ పోరాట దీక్ష శిబిరానికి చేరుకుని వారికి పూర్తిస్థాయి మద్దతు పలికారు. జూనియర్ డాక్టర్లకు ఐఎంఏ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

కాగా జూడాల దీక్షకు రైతు కూలీ సంఘం, ఏఐవైఎఫ్ , ఏబీవీపీ, మహిళా మోర్చా, గవర్నమెంట్ నర్సుల సంఘం మద్దతు పలికాయి. ఈ కార్యక్రమంలో ఐఎం ఏ ప్రతినిధులు డాక్టర్ వెలగా మహేష్, డాక్టర్ బాలినేని సాయి కృష్ణ, డాక్టర్ సిహెచ్ విశ్వేశ్వర రావు, డాక్టర్ జి బాబురావు, డాక్టర్ పద్మాజ, డాక్టర్ రాధికా రాణి డాక్టర్ కటకం లావణ్య ,డాక్టర్ టి సేవా కుమార్, డాక్టర్ శనక్కాయల ఉదయ శంకర్, గవర్నమెంట్ డాక్టర్స్ సంఘ ప్రతినిధులు డాక్టర్ యశస్వి రమణ, డాక్టర్ వివి నారాయణ, డాక్టర్ పి అనిల్ బాబు, జూడాల సంఘం ప్రతినిధులు డాక్టర్ శ్రీనివాస్ డాక్టర్ వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బోధనలో పాఠ్య ప్రణాళికను వినియోగించాలి
### ఎంఈఓ బి సుధాకర్ రావు



**అద్దంకి ,ఆగస్టు 17(ఆంధ్రపత్రిక):** శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ధర్మవరం నందు జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మండల విద్యాశాఖధికారి బి. సుధాకర్ మాట్లాడుతూ బోధనలో ప్రతి ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల తరగతి గదుల్లో పాఠ్య ప్రణాళికను వినియోగించి మాత్రమే పాఠాలు బోధించాలని అన్నారు రిజిస్టర్ లో ఉన్న ప్రకారం విద్యార్థులందరు పాఠశాలలో ఉండునట్లు చూడవలసిన బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. అకడమిక్ తరగతుల రిజిస్టర్ ప్రతి పాఠశాలలోఉండాలన్నారు విద్యార్థుల వారి శక్తి నైపుణ్యం సామర్థ్యం ఆధారంగా గ్రూపులు గా చేసి తెలుగు గణితం బోదించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ శ్రీనివాసులు సి ఆర్ పి శంకర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## కొరిశపాడు మండల పరిషత్
# సర్వ సభ్య సమావేశం



**కొరిశపాడు ఆగస్టు17(ఆంధ్రపత్రిక):** కొరిసపాడు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశము శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశం హాలు నందు ఎంపీపీ సాదినేని ప్రసన్న కుమారి అధ్యక్షతన జరిగింది.

కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటి సమావేశం కావున అధికారులు అందరూ హాజరయ్యారు అన్ని శాఖల అధికారులు వారి శాఖ యొక్క పురోగతిని చదివి వినిపి ంచారు. ఈ సమావేశంలో జడ్పిటిసి తుళ్లూరి వెంకటరమణ ఎంపీ డీవో సురేష్ బాబు తహసిల్దార్ వెంకటేశ్వరరావు సిడిపిఓ కృష్ణకు మారి ఎంఈఓ పున్నయ్య, వెలుగు ఏపిఎం బి అనురాధ, డ్వామా ఏపీవో ఐఎన్ఎస్ కోటేశ్వరి సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## కలకత్తా లో ఆర్. జి. కర్ వైద్య కళాశాల, ఆసుపత్రి సంఘటన పై డీవీసీ హాస్పిటల్ లో వైద్యుల నిరసన




**గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** పశ్చిమ బెంగాల్ కలకత్తా ఆర్. జి. కర్ వైద్య కళాశాల, ఆసుపత్రి లో పీజీ వైద్య విద్యార్థిని పై జరిగినటువంటి దారుణమైన సంఘటనకు దేశవ్యాప్తంగా డాక్టర్లు ఆందోళనకు దిగారు ఇందులో భాగంగా ఐ.ఎం.ఏ. పిలుపుమేరకు శనివారం గుంటూరు జిల్లా వడ్లమూడి నందుగల డి.వి.సి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో పనిచేస్తున్న వైద్యులు హాస్పటల్ సేవలు నిలిపివేసి నిరసన చేపట్టారు. హాస్పిటల్ నుండి మెయిన్ రోడ్ వరకు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు అనంతరం డాక్టర్ లలిత్, డాక్టర్ రజిత, డాక్టర్ సుధా మాట్లాడుతూ డాక్టర్లపై వరుసగా జరుగుతున్న సంఘటనలు బాధ్యులైన వారిని వెంటనే శిక్షించాలని వారి వెనక ఎవరున్నా సరే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .

అలాగే దేశవ్యాప్తంగా ఉన్నటువంటి హాస్పిటల్స్ లో కాలేజీల్లో డాక్టర్లకు సరైన సదుపాయాలు కల్పించాలని లేకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ల జ్యోతిర్మయి, మెడికల్ డైరెక్టర్ చల్లగుండ్ల డాక్టర్ శ్రీనివాస్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ కరణం నవీన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అమరేంద్ర, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ సందీప్, డాక్టర్ మనోహర్, డాక్టర్ తేజశ్రీ, డాక్టర్ దివ్య, డాక్టర్ శృతి, డాక్టర్ సుష్మ మరియు హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడే ముప్పవరంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**జె. పంగులూరు, ఆగస్టు 17( ఆంధ్రపత్రిక ):** శంకర్ కంటి ఆసుపత్రి పెదకాకాని, రోటరీ క్లబ్ పంగులూరు వారి సౌజన్యంతో నేడు ముప్పవరం లోని మండల పరిషత్ ఎలిమెం టరీ పాఠశాల ( సుందర రావు మాస్టర్ బడి ) నందు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గరిమిడి జగన్మోహన్ రావు తెలిపారు.

ముప్ప వరం గ్రామం, పరిసర గ్రామీణ ప్రాంతాల వారు ఈ అవకాశం వినియోగిం చుకోవచ్చని కంటిసంబంధ సమస్యలతో బాధపడే వారు ఎవరైనా

ఈ కంటి వైద్య శిబిరానికి హాజరు కావచ్చని కంటి సమస్యలు ఉన్న వారు వచ్చేటప్పుడు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు ఓటర్ ఐడి కార్డు జిరాక్స్ తమ వెంట తెచ్చుకోవాలని. జగన్మోహన్ రావు తెలిపారు.

## మహిళా డాక్టర్లపై జరుగుతున్న

# లైంగిక దాడులను అరికట్టాలి

**తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఎస్. అమీర్ బాబు డిమాండ్ చేశారు.**



**కడప ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక):** కలకత్తా ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని రెండో రోజు కడప రిమ్స్‌లో జరుగుతున్న జూనియర్ డాక్టర్ల నిరసనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వి.ఎస్.అమీర్ బాబు మాట్లాడుతూ డాక్టర్లు దేవుళ్ళతో సమానమని అలాంటిది కలకత్తాలో డ్యూటీలో ఉన్న డాక్టరుపై ఒక కామాంధుడు అత్యాచారం చేసి దారుణంగా చంపడం సభ్య సమాజం సిగ్గుచేటుతో తలదించుకుంటుందన్నారు అక్కడి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం వెంటనే నిందితునికి కఠిన శిక్ష వేసి భవిష్యత్తులో ఇలాంటి దారుణాలు జరగకుండా పటిష్టమైన చట్టాలను తీసుకుని రావాలని చెప్పి ఎవరైనా ఇటువంటి చర్యలు పాలు పడాలని చూస్తే వాళ్ళ వెన్నులో వణుకు పుట్టే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై దాడులు అత్యాచారాలకు ప్రత్యేక చట్టాలను తీసుకొని రావాలని అన్నారు వి.ఎస్.అమీర్ బాబు అన్నారు. మనమందరం కలిసి డాక్టర్లకు మద్దతుగా ఉండాలని అమీర్ బాబు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ రెహమాన్, కడప నగర మైనార్టీ మాజీ అధ్యక్షులు ఇమ్రాన్, ఐ.టిడిపి మరియు డాక్టర్ వర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో

# వ్యాధులు నయం

**ఎండి డాక్టర్ కోరా చంద్ర ఓబుల్ రెడ్డి**



**కడప, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక):** షుగర్, థైరాయిడ్ రోగులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని ఎం.డి. డాక్టర్ కోరా చంద్ర ఓబుల్ రెడ్డి అన్నారు శనివారం నగరంలోని ఎర్రముక్కపల్లె పిఎఫ్ కార్యాలయం ఎదురుగా "భాటియా దయాబెటిస్ ఎండోకేర్ సెంటర్"ను ఆయన తన తల్లిదండ్రులు కోరా ఓబుల్ రెడ్డి, కొండమ్మల చేత లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం డాక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సుగర్ వ్యాధికి ప్రత్యేక చికిత్స చేయడం జరుగుతుందని చెప్పారు చాలా మంది షుగర్ వ్యాధిని మొదటి దశలోనే చూపించక పోవడం వల్ల కాళ్ళు, చేతులు పోగొట్టుకుంటున్నారని అన్నారు. సుగర్ థైరాయిడ్ రోగులకు సులభంగా చికిత్స అందించి నయం చేయడం జరుగుతుందని చెప్పారు ఈ సెంటర్ నందు ఆధునిక సాంకేతిక పరికరాలు ఉన్నాయని వ్యాధులకు సంబంధించిన పరీక్షలు ఇక్కడే చేసి ఎంతటి వ్యాధి నైనా చికిత్స ద్వారా తగ్గించడం జరుగుతుందని చెప్పారు అనంతరం డాక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి సతీమణి ఫెథాలజిస్ట్ డాక్టర్ అమరావతి మాట్లాడుతూ రక్తంలో ఏ సమస్య ఉన్న చికిత్స ద్వారా నయం చేయడం జరుగుతుందని చెప్పారు తల, గర్భాశయం లో రక్తం గడ్డ కట్టడం ద్వారా ఎదురయ్యే సమస్యలను నయంచేస్తామన్నారు ఎందుకంటే ఇక్కడ ఆధునిక ల్యాబ్ సౌకర్యం ఉందని చెప్పారు ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించు కోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో డాక్టర్ మహబూబ్ పీరా, డాక్టర్ గణేష్, ఫైయాజ్ నవాజ్, డాక్టర్ ఎం.వి.సుబ్బారెడ్డి, రిటైర్డ్ డిఎస్పీ రాజశేఖరరెడ్డి, మానవతా డా"ఎ.రామాంజులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బందు

# విజయవంతం: ఏఐఎస్ఎఫ్

**పార్వతి కుటుంబానికి న్యాయం చేయకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తాం**

**జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా డిమాండ్**



**మంత్రాలయం, ఆగస్టు 17 ఆంధ్రపత్రిక:** ఆగస్టు 5వ తేదీన మంత్రాలయం మండలం పరిధిలోని రచ్చుమర్రి గ్రామం ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్ లో పదవ తరగతి చదువుతున్న పార్వతి అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది దానికి నిరసనగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏ ఐ ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో మంత్రాలయం నియోజకవర్గంలో విద్యాసంస్థలు బంద్ కు పిలుపునివ్వడం జరిగింది, బందు అనంతరం మంత్రాలయం తాహసిల్దార్ కార్యాలయం ముందు వందల మంది విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షులు థామస్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, డి. సోమన్న,యస్. షాబీర్ భాషలు మాట్లాడుతూ విద్యార్థి ఆత్మహత్య జరిగి 12 రోజులు గడుస్తున్న ఆత్మహత్య గల కారణాలు ఇంతవరకు వెలికి తీయకపోవడం వెనక కారణాలు ఏమిటి అన్నారు, అదేవిధంగా హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్ పై ఎందుకు చర్యలు తీసుకోలేక పోతున్నారని పోస్టుమార్టం నివేదిక వచ్చినా పోలీస్ శాఖ ఎందుకు చొరవ తీసుకోవడం లేదని విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకోవడానికి ఇంత నిర్లక్ష్యమా అన్నారు, అసలు విద్యార్థి ఆత్మహత్యకు వెనకాల ఏం జరిగింది తెలుసుకునేంతవరకు, హాస్టల్ వార్డెన్ మరియు ప్రిన్సిపాల్ ను సస్పెండ్ చేసి వారిపై చర్యలు తీసుకునేంతవరకు అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ విద్యార్థి తల్లిదండ్రులకు అండగా ఉండి వారికి న్యాయం జరిగేంత వరకు పోరాటాలకు నాంది పలుకుతామని చెప్పారు, ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు మరియు పోలీస్ శాఖ, ప్రజా ప్రతినిధులు కుర్చీలకే పరిమితం కాకుండా నిద్రమత్తు వదిలి తక్షణమే ఆత్మహత్యకు గల కారణాలు వెలికి తీసి, దోషులను శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బందుకు పిలుపునిస్తూ, కార్యాలయం ముట్టడించడానికి కూడా ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు సిద్ధంగా ఉన్నాయని వారు హెచ్చరించారు. విద్యాసంస్థలు బంద్ కు సహకరించినటువంటి విద్యాసంస్థల యజమాన్యం ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి, వీరేష్ ,నాయకులు, దివాకర్, మైకల్ రాము వీరేష్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## కలసపాడు మండలంలో

# అల్లరి మూకలపై కేసు నమోదు



**కలసపాడు, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక):** మండలంలోని మహానంది పల్లె గ్రామా నికి చెందిన బైరెడ్డి సావిత్రి,అను మహిళా మామిళ్లపల్లెలో తమ బంధువుల పెళ్లికి వెళుతుండగా కారు ఆపి అసభ్యకరంగా దూషించారని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలసపాడు మరియు తెల్లపాడు గ్రామానికి చెందిన రాఘవ, సుధాకర్, భరత్. రంతుల్లా అను వారి పైన కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని బాధిత మహిళ కోరినారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తెల్లపాడు గ్రామానికి చెందిన రాఘవ, సుధాకర్ ,భరత్, రంతుల్లా,అను వారి పైన కేసు నమోదు చేశామని కలసపాడు ఎస్సై చిరంజీవి తెలిపారు.

# మంత్రాలయంలో ఘనంగా ఎరుకల హక్కుల పోరాట సమితి నియోజీకవర్గ మహాసభలు



**మంత్రాలయం: ఆగస్టు 17 ఆంధ్రపత్రిక:** మంత్రాలయం నియోజికవర్గ ఎరుకల హక్కుల పోరాట సమితి మహాసభలు జిల్లా అధ్యక్షులు ఎరుకల కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక రాగసుధ లాడ్జ్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎరుకల రాజు మరియు నంద్యాల జిల్లా అధ్యక్షులు మెడసారి గోపాల్ మరియు ఆదోని సబ్ డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎరుకల రవికుమార్, డోన్ సెక్రటరీ చోటా రామయ్య, సీనియర్ జర్నలిస్ట్ వేణుగోపాల్ రెడ్డి మరియు మంత్రాలయం తాలూకా కార్యదర్శి జయరాజు, అంజి హాజరయ్యి మాట్లాడుతూ.. రాష్ట్రంలో గిరిజన ఎరుకల ప్రజలు హక్కుల కోసం ఎరుకల హక్కుల పోరాట సమితి పోరాడుతుందని తెలిపారు. ఇటీవల సుప్రీం కోర్టు రిజర్వేషన్ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చింది అని, వర్గీకరణతో వర్గీకరణ కూడా చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేసి ఎరుకల ప్రజలును ఆర్థికంగా ఆదుకోవాలని కొరారు. మంత్రాలయం నియోజికవర్గంలో గిరిజన విద్యార్థుల కోసం గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎరుకల బ్యాండ్ మేళా కళాకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. తదనంతరం ఎరుకల హక్కుల పోరాట సమితి నియోజికవర్గ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సుగూరు గ్రామానికి చెందిన ఎరుకల బజారప్పను అధ్యక్షుడిగా ఎరుకల వెంకటేష్ ను ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా ఎరుకల రామాంజినేయులు, ఆంజనేయులు, హనుమంతు సహాయ కార్యదర్శులుగా, మహేష్, నాగరాజు, కృష్ణమూర్తి, కోశాధికారిగా ఎరుకల సురేష్, భీమేష్‌లను ఏకిగ్రవంగ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో చిన్న భీమన్న, కోసిగి లక్ష్మన్న, రామలింగ, చిన్న పాండు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థినిపై దాడి అమానుషం

**జన సేన పార్టీ సీనియర్ నేత దాసరి రవిశంకర్**



**వేంపల్లి ఆగస్టు 17(ఆంధ్రపత్రిక):** కోల్‌కతాలోని ఆర్.జి. కార్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థినిపై జరిగిన అమానుష హత్యాచారం బాధాకరమని జనసేన పార్టీ పులివెందుల నియోజకవర్గ సీనియర్ నాయకుడు దాసరి రవిశంకర్ శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. హత్యా నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వైద్య సేవలు నిలిపి వేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఇచ్చిన పిలుపు మేరకు వారికి మద్దతుగా జనసేన పార్టీ సంఘీ భావం తెలిపుతోందని రవిశంకర్ చెప్పారు దేశ వ్యాప్తంగా ఇప్పటికే కొవ్వొత్తుల ప్రదర్శనలు, నిరసనలు వెల్లువెత్తాయని చెప్పారు దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ మహిళలు ఇంకా ఒంటరిగా తిరిగే పరిస్థితి లేదన్నారు స్త్రీ మూర్తిని ఆది పరాశక్తిగా పూజించే మన దేశంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కావడం దురదృష్టకరమన్నారు ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడే నీచులను కఠినంగా శిక్షించాలని కోరారు ఇలాంటి సంఘటనలు పునరా వృతం కాకుండా నిందితులను ఎన్కౌంటర్ చేసి నేరస్తులకు భయం కలిగించేలా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు మహిళా హత్యా చారాలపై ప్రత్యేక చట్టాలను రూపొందించాలన్నారు ఇలాంటి దారుణాలను ప్రతి భారతీయుడు ముక్త కంఠంతో ఖండించాలని రవిశంకర్ పిలుపునిచ్చారు దేశ వ్యాప్తంగా చేపట్టిన విద్యార్థులకు,వైద్యులకు, యాజమాన్యాలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

# ఘనంగా వీరభద్రుడి మొదటి వార్షికోత్సవ పూజలు

**వేకువ జామునే రుద్రాభిషేకం ఫల పంచామృత అభిషేకాలు**



**మంత్రాలయం, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక):** మంత్రాలయం పట్టణ కేంద్రంలో పాత ఊరిలో వెలిసినటువంటి శ్రీ వీరభద్ర స్వామి మొదటి వార్షికోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం స్థానంలో నూతనంగా నిర్మించిన దేవాలయం విగ్రహ ప్రతిష్ట జరిగి సంవత్సరం అయింది. ఇందులో భాగంగానే శ్రీ వీరభద్ర స్వామి అర్చకులు వీరేష్ స్వామి, సిద్ధ లింగయ్య స్వామి ఆధ్వర్యంలో వీరభద్ర స్వామి మూల విరాట్ కి వేకువజామునే నిర్మాల్యం, ఫల పంచామృత విశేషాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలతో అలంకరించి పట్టు వస్త్రాలు సమర్పించారు. అంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించి మహా మంగళహారతులు గావించారు. ఈ కార్యక్రమానికి మంత్రాల యం పట్టణంలోని వీరశైవ లింగాయతులు మరియు వీరభద్ర స్వామి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

## పిఎస్‌యు విద్యార్థి సంఘం పోరాటంతో

# విద్యార్థులకు బస్సు సౌకర్యాన్ని కల్పించిన ఆర్టీసీ

**- హర్షం వ్యక్తం చేసిన ప్రజలు,విద్యార్థులు**



**నందవరం, ఆగస్టు 17(ఆంధ్రపత్రిక):** గత కొంతకాలంగా బస్సు సౌకర్యం లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న నందవరం మండలం విద్యార్థుల కష్టాలు ఎట్టకేలకి తీరాయి. నందవరం మండల గ్రామాలు పూలచింత,గంగవరం,చిన్నకొత్తిలి, పెద్దకొత్తిలి విద్యార్థులకు ప్రగతిశీల విద్యార్థి సంఘం పోరాటంతో ఎమ్మిగనూరు ఆర్టీసీ అధికారులు డిఎం,ఆర్ఎం స్పందించి శనివారం రోజున బస్సును ప్రారంభించారు. మా గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించడానికి విశేష కృషి చేసిన పి ఎస్ యు విద్యార్థి సంఘానికి,పి ఎస్ యు సంఘం జిల్లా కార్యదర్శి సురేష్ కు గ్రామాల ప్రజలు,విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. బస్సు సౌకర్యం లేక విద్యార్థులు పడుతున్న కష్టాలు ఈ రోజుటితో తీరటం జరిగిందని ప్రజలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పి ఎస్ యు జిల్లా కార్యదర్శి సురేష్ మాట్లాడుతు విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక గతంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురిఅయ్యారు,విద్యార్థుల గ్రామాలకు బస్సు కావాలని పోరాటం చేయగా అధికారులు డిఎం,ఆర్ఎం స్పందించి బస్సు సౌఖ్యరాన్ని కల్పించరని అందుకు అధికారులకు,ఉద్యమనికి సహకరించిన మీడియ మిత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులు ఈ ఆర్టీసీ బస్సు సౌకర్యన్ని వినియోగించుకోవాలన్నారు. ఆయా గ్రామాల విద్యార్థులు సుమారు 100మంది పైగా ప్రతి రోజు ఉన్నత చదువులు చదుకోవడనికి నందవరం, ముగతి, ఎమ్మిగనూరు స్కూల్స్,కాలేజీలకు వెళ్తూన్నారు,విద్యార్థులు సరైన సమయానికి వెళ్లి చక్కగా చదుకోవలని అన్నారు. ఏమైనా విద్యార్థుల సమస్యలు వుంటే తమ దృష్టికి తెలియజేయవచ్చు అని విద్యార్థులకు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎం అమర్నాథ్, పూలచింత యువ నాయకులు మఠం రాజశేఖర్, విద్యార్థులు విష్ణు భూపాల్ పాల్గొన్నారు.

# మైనారిటీ బాలికల విద్యాభివృద్ధికి కృషి



**కడప, ఆగస్టు 17(ఆంధ్రపత్రిక):** ముస్లిం మైనార్టీ బాలికల విద్యాభివృద్ధికి కృషి చేయడం జరుగుతోందని హజరత్ ఆయేషా జూనియర్ కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు ఖాదర్ భాషా అన్నారు శనివారం ఆ కళాశాల ప్రెస్సెస్ డే సందర్భంగా కడప ఎమ్మెల్యే మాధవి వచ్చి ఈ వేడుకల్లో పాల్గొన్నారని తెలిపారు 1993 లో ఎల్ కె జి నుంచి కేవలం 60 మంది విద్యార్థులతో ప్రారంభించిన స్కూల్ నేడు కళాశాలగా మారి 408 ఇంటర్ విద్యార్థులతో నడుస్తోందని చెప్పారు కళాశాల అభివృద్ధికి ఎమ్మెల్యే మాధవి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు ఇందులో 25/% మంది పేద పిల్లలకు ఉచితంగా 75/% మంది పిల్లలకు మినిమం ఫీజులు తీసుకోవడం జరుగు తోందని చెప్పారు. ఇందులో ప్రస్తుత అధ్యక్షుడు మజీద్ అలీఖాన్,సెక్రటరీ కలీముద్దీన్ ఉపాధ్యక్షుడు అక్బర్ బాషా ఎస్.బి. మహమ్మద్ అలీ,ఫయా జ్,మహబూబ్ భాషా, షామీర్ వల్లీ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తింపు లేని యూనివర్సల్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

**ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి.**



**పోరుమామిళ్ల, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక):** కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలోని యూనివర్సల్ పాఠశాల పై చర్యలు తీసుకోవాలని ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి శనివారం పాఠశాల వద్ద పోరుమామిళ్ల మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండా నర్సరీ నుంచి పదో తరగతి వరకు యూనివర్సల్ అనే పాఠశాల పేరుతో అధికంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను రక్తం పీడిస్తూ వసూలు చేస్తున్నటువంటి నడుపుతున్నటువంటి యూనివర్సల్ పాఠశాల యాజమాన్యం పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి అని వారన్నారు. అదేవిధంగా రికగ్నిషన్ తొమ్మిదో తరగతి వరకు వేరే పాఠశాల పేరుతో ఉంది అదే పేరుతో అదే గుర్తింపును యూనివర్సల్ పేరుతో మార్చి ఫీజుల దోపిడీ జరుగుతోంది. అదేవిధంగా యూనివర్సల్ అనే పేరుతో ప్రచారం చేస్తూ మరియు స్కూల్ వ్యాన్ మీద కూడా అదే పేరుతో ప్రచారం చేసుకుంటున్నటువంటి యూనివర్సల్ పాఠశాలపై తక్షణమే ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు చారి, మండల ఉపాధ్యక్షులు వంశీ,మండల నాయకులు మధు, సంజయ్,నరసింహ, వినయ్,పండు,ఆంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కరించే దశలో ఏపియుడబ్లుజే

**-67వ వార్షికోత్సవ వేడుకలు**

**ఎమ్మిగనూరు, ఆగస్టు17 (ఆంధ్రపత్రిక):** జర్నలిస్టుల సంక్షేమం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దశలో ఏపియుడబ్లుజే అడుగులు వేస్తోందని ఏపియుడబ్లుజే తాలుకా. పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బి. శ్రీనివాస నాయుడు. జిబి. పరమేష్. చిన్న ఆకుల నాగరాజులు పేర్కొన్నారు. శనివారం ఏపియుడబ్లుజే నాయకులు ఆధ్వర్యంలో 67వ వార్షికోత్సవ వేడుకలు పురస్కరించుకొని తాహశీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి మహాత్మాగాంధీ విగ్రహానికి. బిఆర్ అంబేడ్కర్ విగ్రహానికి. మాచాని సోమప్ప విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం. ఏపియుడబ్లుజే జిల్లా ఉపాధ్యక్షులు. సహాయ కార్యదర్శి. తాలుకా పట్టణ అధ్యక్ష కార్యదర్శిలు జాలవాడి బాష. నూర్ మహ్మద్ బి. శ్రీనివాస నాయుడు. చిన్న ఆకుల నాగరాజు. జిబి. పరమేష్ లు ఆధ్వర్యంలో ఏపియుడబ్లుజే జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లెల గ్రూప్ అధినేత మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు హాజరయ్యారు. సోమప్ప సర్కిల్ నందు న్యాయ సలహాదారులు అష్రఫ్ దేవేంద్ర రెడ్డి ఏపియుడబ్లుజే జెండాను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఏపియుడబ్లుజే తాలుకా. పట్టణ అధ్యక్షులు కార్యదర్శి మాట్లాడుతూ ఏపియుడబ్లుజే యూనియన్ మనందరం వుండడం ఎంతో అదృష్టంగా బావించాలన్నారు. ఏపియుడబ్లుజే 66 సంవత్సరాలుగా దిగ్విజయంగా ముందుకు పోవడం మనందరి శుభపరిణామం అన్నారు. ఆటుపోట్లు నెదుర్కోవడం జరిగిందన్నారు. దిశగా నిలబడి జెండా ఎగురు వేయడం ఏపియుడబ్లుజే జెండా కిందా వున్నందుకు మనందరి అదృష్టం అన్నారు. జర్నలిస్టు వ్యవస్థాపకం చేసినటువంటి కష్ట పూరితం ఎంతగానో కృషి వుందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఏపియుడబ్లుజే రాష్ట్రంలో జర్నలిస్టు యూనియన్ వున్నందుకు మనందరం గర్వ పడాలన్నారు. ఏపియుడబ్లుజే 66వ వసంతాలు పూర్తి చేసుకుని 67వ వసంతాలను జరుపుకుంటున్న ఈ ఉద్యమం స్ఫూర్తితో పని చేసి భవిష్యత్తులో చాటి చెప్పే జర్నలిస్టు ఏపియుడబ్లుజే అభివృద్ధికి బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మన జర్నలిస్టుల యూనియన్ సంఘానికి జిల్లా స్థాయిలో ప్రత్యేకమైన స్థానం గుర్తింపు వుందన్నారు. ఏపియుడబ్లుజే యూనియన్ ఒక మహా సముద్రం. యూనియన్ ఎవరికి భయపడదు భవిష్యత్తులో కూడా బలమైన యూనియన్‌గా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపియుడబ్లుజే నాయకులు వి. రామకృష్ణ. 99 టీవి ఈరన్న. ఖాశీమ్. జె. బాబు రాజు. మక్బుల్. అశోక్. శివ. జగదీష్. ఆవుల శ్రీనివాసులు. సోమన్న. తిరుమల వెంకటేష్. సి. నాగరాజు. కె. నర్సింహులు. జి. రవికుమార్. బాలాజీ. ఉపేంద్ర. భీమ శేఖర్. నరసింహ రెడ్డి. గోవిందు. వెంకటాపురం నాగరాజు. అబ్దుల్లా. యల్లయ్య. అనీల్. రాజు. మహేశ్వర రెడ్డి. సి. ఈరన్న. గాజుల వెంకటేష్. హారి. వి. రవి. రాజు. లక్ష్మన్న. ప్రసాద్. రహమాన్. రంగన్న. సునీల్ కుమార్. రాజశేఖర్. చిన్న తదితరులు పాల్గొన్నారు



## డివిజన్ మీటర్ రీడర్ల
# సమస్యలను పరిష్కరించాలి



హిందూపురం, ఆగష్టు 17 (ఆంధ్రపత్రిక) : హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత పిఏ సురేంద్ర బాబుకు హిందూపురం డివిజన్ మీటర్ రీడర్లు వినతి పత్రం సమర్పించారు. ఇందులో భాగంగా ట్రాన్స్కో సీఎం, విద్యుత్ శాఖ మంత్రులు గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో రాష్ట్రంలో ఉన్నటువంటి మూడు డిస్కం పరిధిలో సిఎండిలకు, విద్యుత్ మీటర్ రీడర్లకు ఎస్ క్రో అకౌంట్ ద్వారా మీటర్ రీడర్లకు జీతాలు చెల్లించాలని,ఈపీఎఫ్, ఈఎస్ఐ చెల్లించే విధంగా వినతి పత్రం సమర్పించారు. ట్రాన్స్కో సీఎం డి విజయానంద్ ఆదేశాలను ఎస్పీడీసీఎల్ సిఎండి బేఖాతరు చేశారని, బాలకృష్ణ వ్యక్తిగత పీఏ సురేంద్రబాబు మీటర్ రీడర్ల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారన్నారు.ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా మీటర్ లీడర్ అధ్యక్షుడు షేక్ షానవాజ్, అనిల్ కుమార్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## నందికొట్కూర్ ఎమ్మెల్యేకు వినతిపత్రం
# అందజేసిన సిపిఎం నాయకులు



నందికొట్కూర్ ఆగస్టు 17, ఆంధ్రపత్రిక : నందికొట్కూర్, పట్టణంలోని ఊరి చివర్లో ఉన్న జగనన్న కాలనీ 2,3 లేఔట్లలో ఉన్న నీరు, విద్యుత్తు, రోడ్డు, బస్సు స్టాప్ తదితర సమస్యలు పరిష్కరించాలని శనివారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం నాగేశ్వరావు, సిపిఎం నాయకులు కే భాస్కర్ రెడ్డి, పి ,పకీరి సాహెబ్ టి గోపాలకృష్ణ లబ్ధిదారులతో కలిసి నందికొట్కూరు నియోజకవర్గం శాసనసభ్యులు గిత్త జయ సూర్య కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది, ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ఇల్లు లేని పేదలను గుర్తించి పట్టణ చివరలో సెంటు స్థలం ఇచ్చి లక్ష 80 వేల రూపాయలు ఇచ్చి మీరు త్వరగా జగనన్న కాలనీలలో ఇండ్లు నిర్మించుకోవాలని అధికారులు చెప్పడంతో లబ్ధిదారులు వెంటనే ప్రైవేటు వాళ్ళ దగ్గర అప్పులు తెచ్చుకొని ఇల్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు, జగనన్న కాలనీలో త్రాగునీరు లేక టౌన్ లోకి వచ్చి తీసుకెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు, విద్యుత్తు లేక రాత్రి వేళలో కాలనీలో విష సర్పాలు సంచరించడంతో రాత్రివేళ బయటికి రావడానికి భయభ్రాంతులకు గురవుతున్నారు, మున్సిపల్ అధికారులు నీటి కోసం చిన్న ట్యాంకులు నిర్మించారు అవి నిరుపయముగా ఉన్నాయి వాటర్ ట్యాంకులకు కనెక్షన్ ఇవ్వడం లేదు అన్నారు, ఆర్టీసీ బస్సు స్టాప్ లేకపోవడంతో ఆర్టీసీ బస్సు కాలనీ దగ్గర ఆపడం లేదు అన్నారు, కాలనీకి ఆటోకు వెళ్లాలంటే పగటిపూట 100 రూపాయలు రాత్రి సమయంలో 200 రూపాయలు బాడుగ చెల్లించలేక ఇబ్బందులకు గురవుతున్నారు, కావున తక్షణమే ఎమ్మెల్యే స్పందించి జగనన్న కాలనీలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు, ఈ కార్యక్రమంలో రైతు సంఘం బెస్తరాజు, సిఐటియు నాయకులు ఆకుల రాము, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు డి బాబు, కాలనీవాసులు శాలు భాష, జగనాదం గౌడు, తదితరులు పాల్గొన్నారు.

## పీజీ డాక్టర్ హత్యకు నిరసన
# వ్యక్తం చేసిన వైద్య సిబ్బంది



దేవనకొండ,ఆగస్టు17 ఆంధ్రపత్రిక : కలకత్తాలో పీజీ జూనియర్ డాక్టర్పై జరిగిన దాడికి మరియు హత్యకు నిరసనగా దేవనకొండ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రము నందు డాక్టర్ కళ్యాణ్, విజయ్ భాస్కర్లు మరియు వైద్య సిబ్బంది కూడా పాల్గొని నిరసన వ్యక్తం తెలియ జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూదేశవ్యాప్తంగా మెడికల్ అసోసియే షన్పిలుపు మేరకు నిరసన తెలియ జెస్తున్నామని. దేశంలో రోజు రోజుకు మహిళ లకు రక్షణ కరువైందని. పశ్చిమ బెంగాల్లో సీఎం మమతా బెనర్జీ మహి ళా ముఖ్యమంత్రి ఉన్న రాష్ట్రంలో మహిళలకే రక్షణ కల్పించకపోవడం చాలా దురదృష్టకరం.ఈ ఘటనకు పాల్పడిన దోషులను వెంటనే పట్టుకొని బహిరంగంగా ఉరితీయాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దొషులకు భయం కలిగేలా కఠిన చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు సాయిబాబా, రంగస్వామి,శ్రీధర్, మరియు ఆస్పత్రి సిబ్బంది మరియు పిఎస్ సిబ్బంది పాల్గొని వారి నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది.

# ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం నందు మెరుగైన మౌలిక వసతులు కల్పించండి

## ఏఐవైఎఫ్ నాయకుల వినతి పత్రం



దేవనకొండ, ఆగస్టు 17 ఆంధ్రపత్రిక: మండల కేంద్రమైన దేవనకొండ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం నందు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా సహాయ కార్యదర్శి సి. రమేష్, ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎం. రామాంజనేయులుకోరారు.ఈ సందర్భంగా శనివారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) దేవనకొండ మండల సమితి ఆధ్వర్యంలో వైద్యాధికారి కళ్యాణ్ కు ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుండి వైద్య సేవల నిమిత్తం రాత్రి సమయంలో గర్భిణీలు, ప్రమాదం సంభవించిన క్షతగాత్రులు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన సమయంలో స్టాఫ్ నర్సు తప్ప డ్యూటీ డాక్టర్ లు లేక కొంత సమయాల్లో ప్రాణాలు పోయిన సందర్భాలు వున్నాయని ఆస్పత్రిలో కనీస వసతులు కల్పించడంలో మండల స్థాయి అధికారులు విఫలం చెందారని వారు ఆరోపించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు రోగులకు చాలీచాలని బెడ్లు ఉన్నాయన్నారు. ఎక్కువ సంఖ్యలో రోగులు వస్తే నేలపైనే పడుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ రెగ్యులర్ గా లేకపోవడం వలన దూరప్రాంతాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు కేరాఫ్ అడ్రస్గా దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొదటి స్థానంలో ఉండేదన్నారు. కానీ ప్రస్తుతం కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం మహిళలు వ్యయ ప్రయాసలు ఎదుర్కొంటూ సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. కావున మండల కేంద్రమైన ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం నందు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు తక్షణ చర్యలు తీసుకొని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం నందు కొనసాగే విధంగా మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం మండల నాయకులు భాస్కర్, వీరాంజనేయులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ మౌమితను అత్యాచారం చేసి హత్య చేసిన
# నిందితులను కఠినంగా శిక్షించాలి



నందికొట్కూర్, ఆగస్టు 17 ఆంధ్రపత్రిక: కలకత్తా కర్ మెడికల్ కాలేజీలో ట్రైనీ డాక్టర్గా చదువుతున్న డాక్టర్ మౌమితాను అత్యాచారం చేసి ఆపై హత్యను ఖండిస్తూ విద్యార్థి సంఘాలు పిడిఎసుయు, పి ఎస్ ఎఫ్, ఆధ్వర్యంలో జూనియర్ కాలేజీ నుంచి 400 మంది విద్యార్థినీలతో ర్యాలీగా వచ్చి పటేల్ సెంటర్లో మానవ హారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సభా అధ్యక్షత గా పి ఎస్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దక్కా కుమార్ అధ్యక్షత వహించగా పిడిఎసు యు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆది నందికొట్కూరు జనరల్ హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ రాంబాబు గైనకాలజీ స్పెషలిస్ట్ రాజలక్ష్మి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అమ్మాయిల పైన చిన్న పిల్లల పైన డాక్టర్స్ పైన అత్యాచారాలు, హత్యలు జరుగుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటు అని వారన్నారు.బిజెపి అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు అవుతున్న అమ్మాయిల పైన హత్యలు అత్యాచారాలు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదని వారన్నారు,అమ్మాయిలకు రక్షణ కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం, అయ్యాయన్నారు, డాక్టర్ మౌమితను అత్యాచారం చేసింది,ఒకరు కాదు ఇద్దరు కాదు అనేకమంది అత్యాచారం చేశారని అమ్మాయి మృతదేహంలో 150 గ్రాముల స్పెర్మ్ ఉందని శరీరంపై బలమైన ఘాట్లు ప్రైవేట్ పాట్ల నుంచి కళ్ళలో నుంచి రక్తం ధారాళంగా కారిందని వారు అన్నారు. డాక్టర్ మౌమీత మృతదేహాన్ని ఒక రోజు వరకు తల్లిదండ్రులకు చూపించకపోవడం ఏంటని ప్రశ్నించారు, కాలేజీ సూపర్నెంట్ స్వయంగా తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది అని చెప్పడం ఏంటని వారు అన్నారు,. సెమినార్ హాల్ దగ్గర ఒక తాగుబోతు మద్యం సేవిస్తూ మద్యం మత్తులో అమ్మాయిపై అత్యాచారం చేశాడు,అని పైకి చూపెడుతూ పోలీసు వ్యవస్థ సూపర్నెంట్ తమ డొల్లతనం బహిరంగంగా అందరికీ అర్థం అవుతుంది. మౌమిత ను అత్యాచారం చేసిన సెమినార్ హాలును రౌడీ మూకలు దాడి చేస్తుంటే పోలీసులు ప్రభుత్వము చోద్యం చూస్తున్నట్లుగా ఉండడం సిగ్గుచేటు,తమ అమ్మాయి మౌనితను అత్యాచారం చేసిన వారిలో సూపర్నెంట్ కూడా ఉండి ఉంటాడని అనుమానంతో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసును కి అప్పగించారే తప్ప అమ్మాయికి న్యాయం చేయాలని ఆలోచన వారిలో ఉంటే అత్యాచారం జరిగి 8 రోజుల వుతున్న ఇంతవరకు అత్యాచారం చేసిన నిందితులను కనిపెట్టకపోవడం సిగ్గుచేటు, హాస్పటల్లో ఎక్కడ చూసినా సీసీ కెమెరాలు ఉంటాయి సెమినార్ హాల్లో వింత జీవిగా ఉన్న అలాగే అత్యాచారం జరిగిన ప్రదేశంలో సీసీ కెమెరాలు ఉంటాయి సిసి ఫుటేజ్ను ఎందుకు బయట పెట్టడం లేదని వారు ప్రభుత్వాన్ని విమర్శించారు, డాక్టర్ల పైన మేజర్ల పైన మైనర్ల పైన నానాటికి అత్యాచారాలు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదని శిక్షలు కఠినంగా అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమ వుతున్నాయని వారు అన్నారు, ప్రపంచంలోనే అత్యాచారాలు జరిగే దేశంగా మన దేశాన్ని మిగతా దేశాలు అభివర్ణిస్తున్నాయని అన్నారు, మౌమితకు న్యాయం జరగకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని డాక్టర్లు తమ వృత్తులను పక్కన పెట్టేసి న్యాయం కోసం పోరాడుతామని వారు హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల హెడ్ నర్సు భువనేశ్వరి అల్వాల హాస్పిటల్ గురువయ్య గ్రామీణ వైద్యురాలు మీనాక్షి జనతా హాస్పిటల్ డాక్టర్ జహీర్ అహ్మద్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మహబూబ్ గణేష్ జగదీష్ శివ నరసింహ నాయకులు కిషోర్ రాజు నాయకులు అశోకు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## గుడ్డం కోనేరును పరిశీలించిన
# హిందూ సంఘాల నాయకులు..



హిందూపురం, ఆగష్టు 17 (ఆంధ్రపత్రిక) : పట్టణంలో వెలసిన గుడ్డం రంగనాథ స్వామి ఆలయం వద్ద ఉన్న కోనేరును హిందూ సంఘాల నాయకులు,హిందూపురం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగరంగ వైభవంగా హిందూపురం వాసులు జరుపుకునే అతిపెద్ద పండుగ వినాయక చవితి సెప్టెంబర్ 7న పండగ వస్తోందన్నారు. అయితే కొద్దిరోజుల సమయం మాత్రమే ఉంది కానీ చేయవలసిన పనులు చాలా ఉన్నాయని తెలియజేశారు. మున్సిపల్ అధికారులు కోనేరులో నీటిని నింపుతున్నారన్నారు. దాదాపు 50 శాతం పూర్తయింది ఇంకా 50 శాతం నీటిని వదలాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా హిందూపురంలో అన్ని వీధుల్లోనూ చెట్లు ట్రిమ్మింగ్, కరెంట్ లైన్లో మార్చడం, ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడ రోడ్లు దెబ్బతిన్నాయని వీటన్నిటిని రిపేరు చేస్తూ పండుగ రోజు నుండి నిమజ్జనం అయ్యేవరకు మద్యం దుకాణాలు బందు చేయాలని కోరారు. అన్ని డిపార్ట్మెంట్ల వారు తమ తమ బాధ్యతలను సకాలంలో పూర్తిచేసి పండుగకు ఏ ఆటంకం కలగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్, ఉత్సవ కమిటీ సభ్యులు బిఎస్ విద్యాసాగర్,రమేష్ రెడ్డి, హిందూ సంఘం నాయకులు చారు కీర్తి, వైటిపి శ్రీనివాసులు, రాము,రవి,రాజు స్థానిక యువత పాల్గొన్నారు.

# 300 మంది నిరుపేదలకు అన్నదానం



తొట్టంబేడు, ఆగస్టు 17(ఆంధ్రపత్రిక): తొట్టంబేడు మండలంలోని పొయ్య ఎస్టీ కాలనీ లో డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ కోట వినుత, కోట చంద్రబాబు ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు. పొయ్యఎస్టి కాలనీలో సైనికుడు గంధం శ్రీనివాసులు వారికి ఘనంగా స్వాగతం పలికి అనంతరం గ్రామ దేవత పొయ్యమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట వినుత, కోట చంద్రబాబు చేతులు మీదుగా పేదలకు అన్నదానం చేశారు.గంధం శ్రీనివాస్ ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు 300 మంది విచ్చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, జన సైనికులు గ్రామసులు పాల్గొన్నారు.

# ఘనంగా పల్లె ఉమ జయంతి వేడుకలు



హిందూపురం, ఆగష్టు 17 (ఆంధ్రపత్రిక) : దివంగత పల్లె ఉమా జయంతి వేడుకలలో భాగంగా శనివారం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం అందించడం జరిగింది.అదేవిధంగా సప్తగిరి కళాశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా పల్లె ఉమా సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంబిఏ, ఎంసీఏ ప్రిన్సిపల్ నారాయణ రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్ రెడ్డి, ఏఓ గంగి రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజునాథ్ లు పాల్గొని ఉపాధ్యాయులకు విద్యార్థులకు స్వీట్స్ పంచడం జరిగింది.

## నూతన తహసిల్దార్ జి.సుభద్రమ్మ ఎంపీడీవో డి.గోపికృష్ణని మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకులు



నందికొట్కూర్, ఆగస్టు 17 ఆంధ్రపత్రిక: పాములపాడు మండలానికి నూతన తహసిల్దార్గా పదవీ బాధ్యతలు చేపట్టిన జి.సుభద్రమ్మని, ఎంపీడీవోగా పదవి బాధ్యతలు చేపట్టిన డి.గోపికృష్ణ గారిని పాములపాడు మండల జనసేన పార్టీ నాయకులు సీనియర్ జనసేన నాయకుడు, పూజల రాము, జనసేన పార్టీ నాయకులు, శనివారం మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాలు కప్పి,శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రాము, జన సైనికులు సాయి కృష్ణ, ప్రభాకర్ ,రవి,కిరణ్ ,భాస్కర్ అల్లబకాస్, భాష, గణేష్, మనోజ్, శివకృష్ణ, ప్రవీణ్, సూర్యకుమార్, సురేష్, హర్ష, మక్బుల్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పురంలో వైద్యులు ధర్నా..



హిందూపురం, ఆగష్టు 17 (ఆంధ్రపత్రిక): కోల్ కత్తాలో వైద్యురాలుపై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా హిందూపురం ఐఎంఏ ఆధ్వర్యంలో ర్యాలీ మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పట్టణ ఒకటో పోలీస్ స్టేషన్లో సంఘటనకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ అనారోగ్యానికి గురైతే వైద్యం అందించాల్సింది వైద్యులేనని అలాంటి వైద్యులకు రక్షణ లేకపోతే ఎలా సేవలందిస్తారని ప్రశ్నించారు. ప్రధానంగా రాత్రి వేళల్లో మహిళ వైద్యులు విధులు నిర్వహించే పరిస్థితులు లేవని అందువల్ల ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో జరగకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని దీనిపై ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ చేసి నిందితులకు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాక ఒక ప్రత్యేక చట్టాన్ని ప్రభుత్వం తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా వైద్య సేవలు నిలిపివేసి కేవలం అత్యవసర సేవలు మాత్రమే కొనసాగించడంతో వ్యాధి బాధితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుప్రవీణ్, ఉపాధ్యక్షులు డాక్టర్ చంద్ర కిరణ్ రెడ్డి, సహాయ కార్యదర్శి డాక్టర్ అశోక్ రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ సతీష్ రెడ్డి, మాజీ ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ వెంకటరమణ, సీనియర్ డాక్టర్లు ఈ.టి. రామమూర్తి,డాక్టర్ లోకేంద్రనాథ్, డాక్టర్ షాన్వాజ్ ఖాన్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ రోహిల్ కుమార్, నర్సింగ్ స్టాప్, అన్ని విభాగాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలలో పల్లె ఉమ జయంతి వేడుకలు



హిందూపురం, ఆగష్టు 17 (ఆంధ్రపత్రిక) : మునిసిపల్ పరిధిలోని చౌడేశ్వరి కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బాలాజీ విద్యాసంస్థల మాజీ కరస్పాండెంట్ స్వర్గీయ పల్లె ఉమ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటవ తరగతి నుంచి 8వ తరగతి వరకు 25 మందికి ప్రతిభావంతులను గుర్తించి వారికి మెడల్స్ ప్రధానోపాధ్యాయుల మధుసూదన్ రెడ్డి, టీచర్ ప్రేమలత, ఈశ్వర్ రెడ్డిలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, చదువుతో పాటు క్రీడలు, ఇతర అంశాలలో ప్రతిభావంతులను గుర్తించి వారిని వారిని ప్రోత్సహించడానికి పల్లె ఉమా జయంతి సందర్భంగా మెడల్స్ అందజేయడం అభినందనీయమని ఇది ఇతర విద్యార్థులు కూడా ఆదర్శంగా తీసుకొని పోటీపడి ఎదగాలని తెలియజేశారు. ఉపాధ్యాయురాలు ప్రేమలత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహించడం ఇతరులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన ఈశ్వర్ రెడ్డి ఈ సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లా అంతటా విద్యాసంస్థలు నెలకొల్పి పేద మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించి ఉన్నత విద్యను అందించి వారిని గొప్పగా తీర్చిదిద్దిన ఘనత పల్లె ఉమాకే దక్కుతుందని తెలియజేశారు.స్వర్గీయ పల్లె ఉమా, పల్లె రఘునాథ్ రెడ్డి ఆశీస్సులతో విద్యారంగంలో విశేషమైన కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రేమలత, కృష్ణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మెను ప్రకారం విద్యార్థులకు
# మధ్యాహ్న భోజనం అందించండి



నందికొట్కూరు, ఆగస్టు 17 ఆంధ్రపత్రిక: ప్రభుత్వ మెను ప్రకారం విద్యార్థులకు అన్ని స్కూల్లలో మధ్యాహ్న భోజనం అందించాలని, కొందరు మధ్యాహ్న భోజనం నిర్వాహకుల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, అలాంటి వారి పద్ధతి మార్చుకోవాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్. బైరెడ్డి శబరి హెచ్చరించారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని మహాత్మగాంధీ మెమోరియల్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం పరిస్థితిపై నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తనిఖీ చేశారు. ప్రభుత్వం అందించే మెను ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని, నాణ్యమైన ఆహారంతో పాటు వంట శాలలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. కొందరు నిర్వాహకులపై ఎంపీ శబరి అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలల హెచ్ ఎం లు కూడా మధ్యాహ్న భోజనంపై దృష్టి పెట్టాలని, ఎం ఈ ఓ నిరంతర పర్యవేక్షణ అవసరం అని ఎంపీ శబరి కోరారు. అలాగే నందికొట్కూరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి తమ సమస్యలు వినతి పత్రం ద్వారా ఎంపీ శబరికి విన్నవించుకున్నారు. నందికొట్కూరు పట్టణంలోని తన ఇంటివద్దనే ఉండి వందలాది మంది వినతి పత్రాలు తీసుకొని కొన్ని సమస్యలు ఫోన్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజల సమస్యలు కొన్ని అక్కడికక్కడే పరిష్కరించారు. మరి కొన్ని వినతి పత్రాలను పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులకుఎంపీ శబరి పంపారు. ఈ కార్యక్రమంలో,మున్సిపల్ చైర్మన్,సుధాకర్ రెడ్డి,కౌన్సిలర్లు,టిడిపి నాయకులు, పాల్గొన్నారు.

# సంక్షేమ కార్యక్రమాల కోసం

# వెంకయ్యనాయుడు జీవితం అంకితం

- భారతదేశ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్
- స్వర్ణభారత్ 23 వసంతాల ఉత్సవం అందరి పండుగ అన్న భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు
- నెల్లూరు వెంకటాచలంలో స్వర్ణభారత్ ట్రస్ట్ 23 ఏళ్ళ సేవా ప్రస్థాన ఉత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉపరాష్ట్రపతి
- చక్కని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశంస
- కార్యక్రమంలో భాగంగా ముప్పవరపు వెంకయ్యనాయుడు గారి జీవన ప్రస్థాన ఛాయా చిత్ర ఆంగ్ల గ్రంథం ఆవిష్కరణ



**నెల్లూరు (వెంకటాచలం), 17 ఆగస్టు (ఆంధ్రపత్రిక) :** స్వర్ణభారత్ ట్రస్ట్ 23 ఏళ్ళ ప్రస్థానం అంటే అంకెలు కాదని, స్ఫూర్తిదాయక గమనమని, భారతదేశ గౌరవ ఉపరాష్ట్రపతి శ్రీ జగదీప్ ధన్ ఖడ్ పేర్కొన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్ 23వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ముందుగా అక్షర విద్యాలయాన్ని సందర్శించారు. అక్కడి విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించి వారిని అభినందించారు. అనంతరం అక్షర విద్యాలయం ఆవరణలోని సోమా నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అక్కడి శిక్షణార్థులతో ముచ్చటించి, నైపుణ్య కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత స్వర్ణభారత్ ట్రస్ట్ కు విచ్చేసిన ఆయన ట్రస్ట్ ఆవరణలో నూతనంగా నిర్మించిన అడ్మిన్ బిల్డింగ్ ను ప్రారంభించారు. అనంతరం ట్రస్ట్ ఆవరణలో మొక్కను నాటారు. స్వర్ణభారత్ ట్రస్ట్ – భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయ సమితి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న జైపూర్ ఫుట్ ఉచిత శిబిరాన్ని సందర్శించి కొందరికి కృత్రిమ అవయవాలను అందజేశారు. అనంతరం ట్రస్ట్ ఆవరణలో ఉన్న దంత వైద్యశాల, సాధారణ వైద్యశాలలను సందర్శించి వారి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారి జీవన ప్రస్థాన ఛాయా చిత్ర ఆంగ్ల గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ మాట్లాడుతూ వెంకయ్యనాయుడు గారి ఆలోచనలు మహోన్నతమైనవని పేర్కొన్నారు. వారు తమ జీవితాన్ని దేశం కోసం అంకితం చేశారని, అలాంటి వ్యక్తులు చాలా అరుదుగా కనిపిస్తారని పేర్కొన్నారు. వారి హృదయం ఎప్పుడూ గ్రామీణ ప్రాంతాలతో మమేకమై ఉందని, దానికి వారి మానస పుత్రికగా ఈ ట్రస్ట్ ఓ ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. వారికి ప్రతి అడుగులో సహకరిస్తున్న శ్రీ మతి ఉషమ్మ గారు వారి విజయాల వెనుక ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి దీపా వెంకట్ ను అభినందించిన ఆయన, ప్రభుత్వ సహకారం లేకుండా 23 ఏళ్ళ పాటు ట్రస్ట్‌ను ఓ మహాయజ్ఞంలా నిర్వహించారని, దానికి ఎంతో నిబద్ధత కావాలని పేర్కొన్నారు. ముప్పవరపు వెంకయ్య నాయుడు మాట్లాడుతూ స్వర్ణభారత్ ట్రస్ట్ 23వ వార్షికోత్సవం అందరి పండుగ అని పేర్కొన్నారు. 23 ఏళ్ళ క్రితం మిత్రుల సహకారంతో ప్రారంభమైన ఈ సంస్థ లక్ష మందికి పైగా నైపుణ్య శిక్షణను అందించామని తెలిపారు. విద్య, నైపుణ్య శిక్షణతో పాటు మన భాష, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవటానికి స్వర్ణభారత్ ట్రస్ట్ నిబద్ధతో పని చేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులు నవీన పద్ధతులను అందిపుచ్చుకుని సాధికారతతో తల ఎత్తుకుని నిలబడటం తమ కలగా అభివర్ణించిన ఆయన, మహిళలు సైతం అదే సాధికారతతో తల ఎత్తుకు నిలబడాలని ఆకాంక్షించారు. ఈ



కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి, పూర్వ ఉప రాష్ట్రపతి దంపతులతో పాటు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దులు నజీర్ దంపతులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ, పార్లమెంట్ సభ్యులు బీదా మస్తాన్ రావు, ఆదాల ప్రభాకర్ రెడ్డి, మేకపాటి శ్రీనివాసులు రెడ్డి, శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ చైర్మన్ మరియు శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్, ట్రస్టీలు సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## దేశంలో ఆయుష్ వైద్యశాలల పెంపుపై

# మాగుంట ప్రశ్న



**ఒంగోలు, 17 ఆగస్టు (ఆంధ్రపత్రిక) :** దేశం ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో (ఆయుష్) ఆయుర్వేద, యోగా, నేచురోపతి, యునాని, సిద్ధ, మరియు హోమియోపతి క్రింద నమోదుకాబడిన వైద్యులు, విధ్యా సంస్థలు, వైద్యశాలలు, విధ్య- వృత్తి ప్రోత్సాహానికి ఏర్పాటుచేసిన పథకాలు మరియు నిధుల కేటాయింపు గురించి ఇటీవల ముగిసిన పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డిగారు అడిగిన ప్రశ్నకు కేంద్ర అయుష్ శాఖ మంత్రి, ప్రతాప్ రావు జాదవ్ సమాధానమిస్తూ ప్రజలు ఆయుష్ సూత్రాలు - అభ్యాసాలు కలిగి, ఆయుర్వేద, నేచురోపతి, యునాని, సిద్ధ మరియు హోమియోపతి మందుల మరియు యోగా కార్యకలాపాలద్వారా వ్యాధి భారాన్ని తగ్గించుకొని స్వీయ రక్షణ పొందడమే ఆయుష్ వైద్యశాలల ప్రధాన లక్ష్యమని తెలిపారు. దేశంలో మొత్తంలో 01-04-2022 నాటికి 37,385 ఆయుష్ వైద్యశాలలో 7,30,317 డాక్టర్లు వున్నారని మరియు 847 కాలేజీలు ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో 3 ఆయుర్వేద, 1 యునాని, 2 యోగా - నేచురోపతి మరియు 7 హోమియోపతి కాలేజీలు వున్నాయని, 373 ఆయుర్వేద, 92 యునాని, 25 నేచురోపతి మరియు 245 హోమియోపతి వైద్యశాలలు వున్నాయని మరియు 1,910 ఆయుర్వేద, 562 యునాని, 197 నేచురోపతి మరియు 2,662 హోమియోపతి డాక్టర్లు వున్నారని తెలిపారు. ప్రకాశం జిల్లాలో 21 ఆయుర్వేద, 4 యునాని, 3 నేచురోపతి మరియు 13 హోమియోపతి వైద్యశాలలు వున్నాయని తెలిపారు. ఆయుర్వేద పరిశోధన కార్యక్రమం క్రింద 2022-23 లో 95 పట్టభద్రులకు రూ. 47.50,000/-లు మరియు ఆయుర్వేద శిక్షణ పథకం క్రింద పరిశోధన పట్టభద్రులకు రూ. 83,33,794/-లు ఉపకార వేతనాలు చెల్లించబడ్డాయని కేంద్రమంత్రి గారు తెలియజేశారు.

## ఆంధ్రపత్రిక ప్రత్యేక శీర్షికను

# ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయకర్



**మొగల్తూరు ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ 67వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నరసాపురం మండలం రుస్తుం బాధ గ్రామంలో లేపరీసీ కాలనీ ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో శనివారం నరసాపురం లో ఆంధ్రపత్రిక వార్షికోత్సవ ప్రత్యేక సంచికను నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ఆవిష్కరించారు. ఆంధ్రపత్రిక యాజమాన్యానికి ఎమ్మెల్యే నాయకర్ అభినందనలు తెలిపారు.







## ఆంధ్రపత్రిక 110 వ వార్షికోత్సవ బుక్‌లెట్‌ను ఆవిష్కరించిన శ్రీ మఠం పీఠాధిపతి

# శ్రీ సుబుదేంద్ర తీర్థులు స్వామి

**మంత్రాలయం ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** ఆంధ్రపత్రిక దినపత్రిక 110 వ వార్షికోత్సవ సందర్భంగా మంత్రాలయం శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థులు స్వామిజీ శనివారం శ్రీ మఠంలో బుక్‌లెట్ ను ఆవిష్కరించారు. స్వామిజీ మాట్లాడుతూ స్వాతంత్ర సమరానికి ఆయుధం అందించిన ఏకైక పత్రిక మన ఆంధ్రదే కావడం నిజంగా హర్షనీయమని అన్నారు. ప్రజా సమస్యలపైన ప్రభుత్వానికి ప్రజలకు పత్రికలు వారధిగా ఉండాలని స్వామిజీ అన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ రెడ్డి, సుధాకర్, వలి, భీమరాయ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా పవిత్ర సంగమం ప్రాంతాన్ని

# తీర్చిదిద్దుతాం..

### దసరా ఉత్సవాల నాటికి పవిత్ర సంగమం వద్ద నవ హారతులు సిద్ధం చేస్తున్నాం.. :జిల్లా కలెక్టర్ డా.జి.సృజన



**విజయవాడ, ఆగస్టు 17 (ఆంధ్రపత్రిక) :** ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా పవిత్ర సంగమం ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామని ముందస్తు ప్రణాళికతో అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి దసరా ఉత్సవాల నాటికి నవ హారతులకు సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డా. జి. సృజన తెలిపారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని పవిత్ర సంగమం వద్ద కృష్ణా, గోదావరిలకు నవ హారతులను ఇచ్చేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించేందుకు శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. సృజన సంబంధిత శాఖాల అధికారులతో కలిసి పవిత్ర సంగమం ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పవిత్ర సంగమం వద్ద నవ హారతుల కార్యక్రమాన్ని పునరుద్ధరించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆలోచన అనుగుణంగా పవిత్ర సంగమం ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పవిత్ర సంగమం ప్రాంతం అభివృద్ధి చేయడానికి అన్ని శాఖల సహకారం తీసుకుంటున్నామన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఆలయ అధికారులు, ఇరిగేషన్, సీఆర్డీఏ, ఆర్ అండ్ బి, ట్రాన్స్ కో, పోలీస్ తదితర శాఖల అధికారుల సమన్వయంతో అభివృద్ధి పనులను దసరా నాటికి పూర్తి చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఇబ్రహింపట్నం నుండి పవిత్ర సంగమం వరకు సుమారు 1.7 కి.లో మీటర్ల ప్రధాన రహదారిని అభివృద్ధి చేయడంతో భవిష్యత్‌లో రోడ్డు దెబ్బతినకుండా కాలవగట్లను పటిష్ట పరిచేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శానిటేషన్, భక్తుల భద్రత వంటి అంశాలపై ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. పవిత్ర సంగమం ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది రాష్ట్రంలోనే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు పవిత్ర సంగమం ప్రాంతాన్ని సందర్శించే విధంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నవ హారతుల సమయంలో భక్తుల్లో ఆధ్యాత్మిక భావం పెంపొందేలా వాఖ్యాత, భక్తి గీతాలు ఏర్పాటు చేయడం, విద్యుద్దీపాలంకరణలు చేయడం, పోలీసుల పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఉండేలా ముందస్తు ప్రణాళికలతో చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ జి. సృజన తెలిపారు. పవిత్ర సంగమం ప్రాంతాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ నిధి మీనా, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారావు, దేవస్థానం ఎఇ ఎల్. రమ, కొండపల్లి మునిసిపల్ కమీషనర్ బి. రమ్యకీర్తన, సిఆర్‌డిఏ సిఇ శివప్రసాద్‌రాజు, ఏపి టూరిజం జియం పి. నాగేశ్వరరావు, ఇబ్రహీంపట్నం తహాశీల్థార్ వై వెంకటేశ్వర్లు, యంపిడివో రామకృష్ణ నాయక్, ఏపిసిపిడిసిఎల్ ఇఇ జి.బి. శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బి ఎస్ ఇ వి.కె. విజయశ్రీ, మత్స్యశాఖ జిల్లా అధికారి వి. పెద్దిబాబు, మత్స్య శాఖ ఎఫ్‌డిరఓ పి. అలేఖ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



గుంటూరు జిల్లా కాజా టోల్ గేట్ సమీపంలో జాతీయ రహదారి-16పై గొర్రెలు

ఆంధ్రపత్రిక ఫొటోలు: సిహెచ్.విజయభాస్కర్




Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com